

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

కృష్ణా జలాల్లో తెలంగాణ
న్యాయమైన వాటా సాధించాలి
- సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలి
- డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలి
- నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష

10

సంపుటి 29, సంచిక: 141 | బుధవారం | 11-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

ప్రభుత్వ పనితీరుకు మీ నిర్ణయాలే గీటురాయి

- నిటారుగా నిలబడి విధులు నిర్వహిస్తే పెరుగనున్న రాష్ట్ర ప్రతిష్ఠ
- రానున్న 30 ఏళ్ల రాష్ట్ర భవిష్యత్తు కొత్త డిఎస్‌పిల చేతుల్లోనే
- వచ్చిన నేపథ్యం మర్చిపోతే తమ హోదాకు న్యాయం చేయలేరు
- 'ప్రొబేషనరీ డిఎస్‌పిల' ముఖాముఖిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో నూతన డిఎస్‌పిల చేతుల్లోనే ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 'మీ ఫీడ్‌బ్యాక్, నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతుందని, 'మీరు' నిటారుగా నిలబడి డ్యూటీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందని, తాము వచ్చిన నేపథ్యం మరిచిపోతే తమ హోదాకు న్యాయం చేయలేమని నూతన డిఎస్‌పిలకు సూచించారు. గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒక రాజకీయ పునరావాస కేంద్రంగా ఉండేదని, అవగాహన లేనివారిని బోర్డులో నియమించి గత ప్రభుత్వం తప్పు చేసిందన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం వల్ల చాలా మందికి తీరని నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో మంగళవారం జరిగిన 'ప్రొబేషనరీ డిఎస్‌పిల' ముఖాముఖి కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు శివధర్ రెడ్డి, ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి వైస్ చైర్‌పర్సన్ శాంతికుమారి, డిజిపి సి.వి.ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రొబేషనరీ డిఎస్‌పిలకు సిఎం అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా 'క్రైమ్ సీన్స్ ఫోరెన్సిక్' హ్యాండ్ బుక్‌ను సిఎం ఆవిష్కరించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ సంక్లిష్టమైన పరిస్థితుల్లో డిఎస్‌పిల నియామకాన్ని చేపట్టామన్నారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ప్రస్తుత ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. తెలంగాణలో 13 ఏళ్ల వరకు గ్రూప్ 1 పోస్టులను నియమించలేదని గుర్తు చేశారు. 2011లో గ్రూప్1 నియామకాలు చేపపడితే, ఆ తర్వాత 2025 వరకు నియామకాలు తరువాయి 8లో



కరువు పరిస్థితులపై దద్దరిల్లిన కలెక్టరేట్లు

- 364 మండలాలకే కరువును పరిమితం చేయొద్దు
- మొత్తం రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- కేంద్రం తక్షణమే సహాయ నిధులు విడుదల చేయాలి
- కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి బృందాలతో శాస్త్రీయ సర్వే నిర్వహించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్

తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ ధర్నాలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం /సంగారెడ్డి

'తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలి. రాష్ట్రంలో కేవలం 365 మండలాలకే కరువును పరిమితం చేయొద్దు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్న అన్నదాతలను ఆదుకునేందకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలి. పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. కరువు పరిస్థితులపై మంగళవారం కలెక్టరేట్ల వద్ద సిపిఐ శ్రేణులు కదం తొక్కారు. కరువు నివారణ చర్యలు చేపట్టాలని ధర్నా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల నినాదాలతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పాల్గొనగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి కరీంనగర్‌లో, బాగం హేమంతరావు ఖమ్మంలో, పశ్య పద్మ నిజామాబాద్‌లో, మేడ్చల్‌లో విఎస్ బోసు, ఆదిలాబాద్‌లో కలవేన శంకర్, నల్లగొండ జిల్లా మునుగోడు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. భద్రాద్రి కలెక్టరేట్ వద్ద కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలోనూ ప్రపంచంలోనూ కరువు విలయ తాండవం చేస్తోందని రాబోయే రోజుల్లో ఇది తీవ్రతరమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో వర్షాలు లేక కరువు ప్రభావం వచ్చే అక్టోబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించినట్లే జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని తరువాయి 12లో

మరిన్ని జిల్లాల వార్తలు 12లో

భౌగోళిక రాజకీయ పరిస్థితులపై

హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్

13,14 తేదీల్లో నిర్వహణ



- దాదాపు 70 దేశాలకు చెందిన నిపుణులకు కాంగ్రెస్ ఆతిథ్యం
- భారత్ సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 1,000 మంది ప్రతినిధులను ఒకచోట చేరుస్తోంది : ఖుర్షీద్
- వందలాదిమంది ప్రతినిధులతో హైదరాబాద్‌లో సమావేశం : శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ

- భారత్ సమ్మిట్, గిగ్‌వర్కర్ల సమావేశంలో పాల్గొననున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత
- ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీతో టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

03

న్యూఢిల్లీ : మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, నూతన ప్రపంచ వ్యవస్థ ఆవిర్భావం, పరిణామాలకు భారతదేశ వ్యూహాత్మక ప్రతిస్పందనలతో పాటు, సహకార సమాఖ్యవాదం, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చల కోసం కాంగ్రెస్ 70 దేశాల నిపుణులకు ఆతిథ్యం ఇవ్వనుంది. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పార్టీ విదేశాంగ శాఖ అధిపతి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ, ఈ నెల 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే భారత్ సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 1,000 మంది ప్రతినిధులను ఒకచోట చేర్చుతుందని, 'అవర్ వరల్డ్' అనే ఒక కొత్త మేధావి వర్గం ఏర్పాటు కూడా ఇందులో ప్రధాన చర్చనీయాంశమని తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే సహా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రపంచ విధాన రూపకర్తలు, ప్రగతిశీల ఉద్యమాల ప్రముఖులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సమ్మిట్‌లో చర్చలు ప్రధానంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'రాజకీయ దార్శనికత', మారుతున్న జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, నూతన ప్రపంచ వ్యవస్థ ఆవిర్భావం, ఈ పరిణామాలకు భారత్ వ్యూహాత్మక ప్రతిస్పందనలపై కేంద్రీకృతమవుతాయని ఆయన తెలిపారు. భవిష్యత్ భారతదేశం, ప్రపంచం కోసం రాహుల్ గాంధీ దార్శనికతను, అలాగే నూతన ప్రపంచ వ్యవస్థ ఆవిర్భావాన్ని ప్రతిబింబించడమే దీని ఉద్దేశ్యమని, తాము 12 అంతర్జాతీయ సమావేశాలు, తరువాయి 8లో

పంట రుణాలు రీషెడ్యూల్ రబీకి కొత్తరుణాలివ్వాలి

- కరువు పరిస్థితుల్లో రైతుకు బ్యాంకులే అండ
- ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన

రబీకి నిర్దేశించిన రూ.38,268 కోట్ల పంట రుణాలు మంజూరు చేయాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు రైతులను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయని, ఈ క్లిష్ట సమయంలో బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. పంట రుణాల పునర్ వ్యవస్థీకరణతో పాటు రబీకి కొత్త రుణాలు సకాలంలో మంజూరు చేయడంతో పాటు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించేందుకు సహకరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బిసి) త్రైమాసిక సమీక్షా సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించగా, 111 మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. వర్షాభావంతో రైతుల పెట్టుబడులు, ఆదాయాలు దెబ్బతిన్న నేపథ్యంలో బ్యాంకులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. రుణ ఉపశమన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరువు నేపథ్యంలో వ్యవసాయంపై తరువాయి 8లో



27 ఎఆర్‌టి కేంద్రాలో

తనిఖీలు

నిబంధనలు ఉల్లంఘించిన ఏడు ఆస్పత్రులకు వైద్య అధికారులు షోకాజ్ నోటీసులు జారీ

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 27 ఎఆర్‌టి (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ) కేంద్రాల్లో వైద్య అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఏడు ఆస్పత్రులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ ఆస్పత్రులు 13 నిబంధనలను ఉల్లంఘించినట్టు అధికారులు గుర్తించారు. అండాల సేకరణ ముసుగులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించడంతో వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఐవిఎఫ్ కేంద్రాలపై మంగళవారం ముమ్మర తనిఖీలు చేపట్టింది. పోలీసుల స్వాధీనంలో తరువాయి 8లో

ఒయు ఉద్యోగుల సమరశంఖం

- నినదించిన ఒయు నాన్ టీచింగ్ ఉద్యోగులు
- సంఘీభావం తెలిపిన వివిధ పార్టీలు, సంఘాలు



ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉస్మానియా వర్సిటీలోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట ఒయు నాన్ టీచింగ్ స్టాఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ధర్నాకు మద్దతు తెలిపిన తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. మహిళలు ఏడ్చినా, ఉద్యోగులు ఏడ్చినా, రైతులు కన్నీరు పెట్టుకున్నా ఆ రాజ్యం బాగుపడదని, ఉద్యోగులు ఇలాంటి పరిస్థితుల్లో ఉంటే యూనివర్సిటీ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, టైమ్ స్కేల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ, ఆర్థిక ఇబ్బందులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలు తరువాయి 8లో

07 మహారాష్ట్రలో బిజెపి కూటమి 'ఎలక్షన్ చోరీ'
- గోకుల్ డెయిరీ చైర్మన్‌గా రాజేశ్ పాటిల్ ఎన్నిక

'చేయూత పింఛన్ల'కు సన్నద్ధం 03
12 నుంచి 18 వరకు పత్రాల పంపిణీ

ఉక్రేన్ యుద్ధంపై త్రైపాక్షిక చర్చలు షురూ



అబుధాబి: ఉక్రేన్ యుద్ధం ముగించేందుకు వీలుగా అమెరికా చొరవతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధాన నగరం అబుధాబిలో త్రైపాక్షిక చర్చలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం కూడా ఈ చర్చలు కొనసాగుతాయి. యుద్ధం ముగించడం అనేది ఈ చర్చల్లో కేవలం ఒక చిన్న విషయం మాత్రమేనని, యుద్ధానంతరం ఒక సరికొత్త ఖండాంతర భద్రతా వ్యవస్థను సమగ్రస్థాయిలో ఏర్పాటు చేయడమే ఈ చర్చల ప్రధాన లక్ష్యమనేదే అత్యంత కీలకమని విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ విషయంలో రష్యా, ఉక్రేన్,యూరప్‌లకు సమగ్రంగా న్యాయం, ఆర్థిక ప్రయోజనాలు చేకూరేవిధంగా నాలుగు సూత్రాల ప్రణాళిక ఇప్పటికే ట్రంప్ వద్ద సిద్ధంగా ఉందని గతంలోనే వా ర్తలు వెలువడ్డాయి. ఐతే ఈ చర్చలు ఫలవంతమయ్యేందుకు వీలుగా యూరప్ దేశాల ప్రతినిధులను కూడా చర్చల్లో భాగం చేయాలని ట్రంప్ కోరుకుంటున్నారు. ఈ దిశగా వారిని చర్చల్లోకి తీసుకువచ్చేందుకు పుతిన్‌ను ఒప్పించాలని భావిస్తున్నారు. అందుకు ఈ చర్చలను ఒక వేదికగా ఉపయోగించుకోవాలని ట్రంప్ ప్రతినిధులు భావిస్తున్నారు. పుతిన్ సహాయకుడు వ్లాదిమీర్ మెడిన్స్కీ రష్యా తరపున బృందానికి చర్చల్లో నాయకత్వం వహిస్తుండగా, ఉక్రేన్ తరపున విదేశీ నిఘూసేవల అధిపతి రుస్తెం ఉమెరోవ్ నాయకత్వం వహిస్తున్నారు. వీరితోపాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్, నాటో సుప్రీం అలైడ్ కమాండర్ యూరప్ కమాండర్ అలెక్స్ గ్రీన్‌కెవిచ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశాంగమంత్రి అబ్దుల్లా బిన్ జాయెల్ అల్ నహ్యాన్ తదితరులు చర్చల్లో పాల్గొంటున్నారు. అన్ని అంశాలపై ఈసమావేశంలో చర్చలు జరిపేందుకు తమకు అనుమతి లభించిందని ఉక్రేన్ ప్రతినిధుల తరపు న రుస్తెం ఉమెరోవ్ చెప్పారు.ఈ చర్చలు ఫలవంత తరువాయి 8లో

వచ్చేవారం అసాధారణమైన అగ్రనాయక సంభాషణలు

దక్షిణ చైనాలోని షెన్‌జెన్ నగరంలో వచ్చేవారం జరిగే ఆసియా–పసిఫిక్ సహకార (ఎపిఇసి) సంస్థ ఆర్థికమంత్రుల సమావేశం (నవంబర్ 18,19) దాని నిర్ణీత ఎజండాను మించి అసాధారణ ప్రాముఖ్యత సంతరించుకుంది. అగ్రరాజ్యాలుగా ప్రపంచ గతిని నిర్దేశిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా ప్రజా రిపబ్లిక్ అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యన్ ఫెడరేషన్ అధ్యక్షుడు వ్లదీమిర్ పుతిన్ ఈ సందర్భంగా ద్వైపాక్షికంగా, త్రైపాక్షికంగా సంభాషణలు జరిపే అవకాశముంది. ఇవి అగ్రనాయకుల మర్యాదపూర్వక సమావేశాలు కావు. నాలుగేళ్లు దాటి ఐదవ సంవత్సరంలో ప్రవేశించిన రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్–అమెరికా యుద్ధం, ఆర్థిక సహకారం వంటి ప్రపంచ వ్యాప్త ప్రభావవంతమైన అంశాలు చర్చకు రానున్నట్లు ఊహాగానాలు. అటువంటి సమావేశం అవకాశంపై తాము ఇతర పక్షాలతో మాట్లాడుతున్నట్లు చైనా అధికారులు చెప్పారు. రష్యా–ఉక్రేన్ ఒప్పందం, ఇరాన్ సమస్య, అణ్వాయుధ నియంత్రణ ఎజండాలో ఉంటాయని అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం సూచనప్రాయంగా చెప్పారు. అధ్యక్షుడు పుతిన్, అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఒక సమావేశం ఉంటుంది – అది చాలా ఆసక్తిదాయకంగా ఉంటుందన్నారు. అణ్వస్త్రాల తొలగింపు (ఇరాన్ గురించిన ప్రస్తావన కావచ్చు), ఇరాన్‌లో యుద్ధం తదితర అనేక విషయాలు చర్చిస్తాం అని ట్రంప్ పొడిపొడి మాటల్లో చెప్పారు. 'ఇరాన్‌ను కోలుకోలేని దెబ్బ తీశాం. ద్రవ్యోల్బణం విపరీతంగా ఉంది. వారు ఒత్తిడిలో ఉన్నారు. వారు మంచి ఒప్పందం చేసుకోకపోతే మళ్లీ దాడి చేస్తాం' అని గాంభీర్యం ప్రకటించారు. మధ్యంతర ఎన్నికల్లో తమ ఓటమికి కారణాల్లో ఒకటి ఇరాన్ యుద్ధం అంటూనే బెదిరింపు మనస్తత్వం మానలేదు.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో తమ ప్రాణమిత్రుడు బెంజిమన్ నెతన్యాహు కూటమి పరాజయం, త్రిశంకు పార్లమెంటులో మెజారిటీ సాధనకు ప్రయత్నించాల్సిందిగా ప్రతిపక్ష నాయకుడు ఐసన్‌కోట్‌కు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఆహ్వానం, అమెరికన్ కాంగ్రెస్‌లో తన సొంత రిపబ్లికన్ పార్టీ మెజారిటీ కోల్పోయి డెమొక్రాట్లకు అధికారం అందించిన (కొత్త కాంగ్రెస్ జనవరి 3న ప్రమాణ స్వీకారం చేస్తుంది) నేపథ్యంలో ట్రంప్ తమ అధ్యక్ష అధికారాలను ఎలా ఉపయోగిస్తారోనని ప్రపంచదేశాలు ఆసక్తిగా వేచిచూస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఎపిఇసి సమావేశానికై చైనా వస్తున్నారు. చైనా అధ్యక్షునితో వచ్చేవారం ట్రంప్ సమావేశం ఈ సంవత్సరంలో మూడవది కానుంది. దిగుమతి సుంకాలు విపరీతంగా పెంపుచేసి చైనాను ఆర్థికంగా దెబ్బతీయటానికి ట్రంప్ చేసిన ప్రయత్నాలను కమ్యూనిస్టు చైనా ఎదురుసుంకాలతో తిప్పికొట్టిన పూర్వరంగంలో ఈ సంవత్సరం మే నెలలో ట్రంప్ చైనాలో అధికారిక పర్యటన జరిపారు. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ సెప్టెంబర్‌లో వాషింగ్టన్ సందర్శించారు. ఉక్రేన్–రష్యా యుద్ధం పట్ల ట్రంప్ వైఖరి రష్యా, చైనాలను మరింత సన్నిహితం చేసింది.

హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును తొలగించి తమ ఆధిపత్యం నెలకొల్పేందుకు, ఇరాన్ ఆయిలు రేవులను తమ యుద్ధనౌకలతో దిగ్బంధించి దాన్ని ఆర్థికంగా దెబ్బతీసి తమ దారికి తెచ్చుకునేందుకు ట్రంప్ పన్నాగాలన్నీ నిష్ఫలమైనాక, ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో కొన్ని రాయితీలు సాధించి యుద్ధం ముగించాలని ట్రంప్ కోరుకుంటున్నాడు. లోగడ పాకిస్థాన్, ఖటార్, టుర్కియే (టర్కీ) మధ్యవర్తులుగా సాధించిన పోరాట విరమణ, చర్చల ఎజండాను అమెరికా ఉల్లంఘించగా, ప్రస్తుతం ఖటార్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తోంది. ఖటార్ ప్రధానమంత్రి షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్ థని సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్‌తో చర్చలు జరిపారు.

ఇరాన్‌కు అణుబాంబు లేకుండా చేయటం తన లక్ష్యంగా ప్రకటించిన ట్రంప్ ఈ విషయంలో షెన్ జెన్ సంభాషణల్లో చైనా సహకారం కోరే అవకాశముంది. ఇరాన్ అందుకు అంగీకరించాలంటే ఇరాన్ షరతులను ట్రంప్ అంగీకరించాల్సి ఉంటుంది. రష్యా, చైనాల సహకారంతో ఇరాన్ యుద్ధం ముగించటం ట్రంప్ ఉద్దేశంగా కనిపిస్తున్నది. ఏదో పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని ప్రతిబింబిస్తూ ఆయిలు మార్కెట్ క్రూడ్ రేట్లు తగ్గించింది. స్టాక్ మార్కెట్లలో ఆయిలు కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. డాలర్ మారక విలువ స్వల్పంగా తగ్గింది.

ఉక్రేన్–రష్యా యుద్ధం ముగింపజేసేందుకు పలుమార్లు ప్రతిపాదనలు చేసిన ట్రంప్ ప్రతిసారీ యూరోపియన్ యూనియన్ ఒత్తిడికి తలొగ్గి వెనకడుగువేస్తూ వచ్చారు. ఇప్పుడు మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బ తదుపరి ట్రంప్ మరోసారి సీరియస్‌గా ప్రయత్నిస్తున్నట్లు వార్తలు తెలుపుతున్నాయి. యూరప్ భద్రత ఒప్పందం రష్యాకోణం నుంచి ప్రధాన అంశమైనందున ట్రంప్ ఈ విషయంలో కూడా చైనా సహకారం కోరుతున్నాడు. మరోవైపున, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ యూరప్ నేతలతో సంభాషిస్తూ చర్చల బల్లవద్ద తమకు స్థానం కావాలంటున్నారు. యూరప్ నేతలు, ముఖ్యంగా జర్మనీ, ఫ్రాన్స్ నేతలు కూడా తమ భాగస్వామ్యం లేకుండా యూరప్ భద్రత ఒప్పందం కూడదని ట్రంప్‌ని హెచ్చరిస్తున్నారు. ఏమైనా ఉక్రేన్–రష్యా యుద్ధం కూడా ఎజండాలోకి వచ్చింది. అందువల్ల షెన్‌జెన్‌లో ట్రంప్–పుతిన్–జిన్‌పింగ్ సంభాషణలకు అసాధారణ ప్రాముఖ్యత ఉంది. ●



టిప్పు సుల్తాన్‌ను యెడియూరప్ప ప్రశంసించలేదా?

బిజెపి వారు చరిత్రను సరిగ్గా తెలుసుకోవాలి. మైసూర్ పాలకుడైన టిప్పు సుల్తాన్ నాలుగు ఆంగ్లో- మైసూర్ యుద్ధాల్లో పోరాడారు. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదు. వాళ్ళు క్విట్‌ఇండియా ఉద్యమం, దండి మార్చ్, సహాయ నిరాకరణోద్యమంలో, రౌండ్ టేబుల్ సమావేశాలలో పాల్గొనలేదు. ఇప్పుడు వారు టిప్పు సుల్తాన్ జయంతి జరపవద్దని బిజెపి ఆదేశాలు జారీ చేస్తోంది. యెడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక పుస్తకంలో టిప్పు సుల్తాన్‌ను ప్రశంసిస్తూ రాసాడు. ఓట్లు కావాల్సినప్పుడు వారు మైనారిటీలకు అనుకూలంగా వ్యవహరిస్తారు. వద్దనుకుంటే వ్యతిరేకిస్తారు.

- ప్రియాంక్ ఖర్గే, కర్నాటక హోం మంత్రి

పనిచేసినా పైసల్లేవ్.. పరిశ్రమలు పరేషాన్!

యంత్రాలు తిరుగుతున్నాయి. కార్మికులు పనిచేస్తున్నారు. సరుకు తయారవుతోంది. మార్కెట్‌లో అమ్మకాలు కూడా జరుగుతున్నాయి. కానీ చేసిన పనికి రావాల్సిన డబ్బు మాత్రం సకాలంలో చేతికి అందడం లేదు. బిల్లులు పేరుకుపోతున్నాయి. పెట్టుబడి బకాయిల్లో చిక్కుకుపోతోంది. కొన్ని సంస్థల్లో వేతనాలు చెల్లించాలన్నా అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బ్యాంకు వాయిదాల చెల్లింపులపైనా ఒత్తిడి పెరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎదురవుతున్న ప్రధాన సవాళ్లలో ఆలస్యపు చెల్లింపులు ఒకటి. కేంద్ర ఆర్థిక సర్వే 2025–26 ప్రకారం దేశ స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా 31.1 శాతం, తయారీ రంగంలో 35.4 శాతం, ఎగుమతుల్లో 48.58 శాతం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రంగం నగదు ప్రవాహ సమస్యలతో సతమతమైతే దాని ప్రభావం ఉపాధి, ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలపై పడుతుంది.

కొనుగోలుదారుల నుంచి రావాల్సిన బకాయిలు నెలల తరబడి నిలిచిపోవడంతో చిన్న పరిశ్రమల నగదు ప్రవాహం దెబ్బతింటోంది. ఈ సమస్యను అధిగమించేందుకు రుణ సదుపాయాలు కల్పించడం ఒక్కటే సరిపోదు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రుణ లభ్యతను సులభతరం చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ 2026 ఫిబ్రవరి 9న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి మంజూరయ్యే లేదా పునరుద్ధరించే రుణాలకు వర్తించే నిబంధనల ప్రకారం, ఈ సంస్థలకు రూ.20 లక్షల వరకు రుణాలపై బ్యాంకులు తాకట్టు భద్రత కోరరాదు. మంచి రుణ చరిత్ర, ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని తమ అంతర్గత విధానం ప్రకారం ఈ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుకునే వెసులుబాటు కూడా ఉంది. రుణగ్రహీత స్వచ్ఛందంగా బంగారం లేదా వెండిని తాకట్టుగా సమర్పిస్తే స్వీకరించేందుకు నిబంధనలు అనుమతిస్తున్నాయి. ఈ నిర్ణయాలు పెట్టుబడి అవసరాలకు కొంత ఊరటనిచ్చినా, కొనుగోలుదారుల నుంచి రావాల్సిన బకాయిల సమస్యను పరిష్కరించలేవు. అప్పులపై ఆధారపడి ఉత్పత్తిని కొనసాగించే పరిస్థితి మారాలంటే, చేసిన పనికి చెల్లింపులు సకాలంలో అందే వ్యవస్థ బలోపేతం కావాలి.

చెల్లింపు ఆలస్యం.. చక్రవడ్డీ భారం ఎవరిపై?

సూక్ష్మ, చిన్న సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం–2006లోని 15, 16 సెక్షన్లు కీలక రక్షణ కల్పిస్తున్నాయి. అయితే ఈ చెల్లింపు రక్షణలు చట్టప్రకారం అర్హత కలిగిన సూక్ష్మ, చిన్న సరఫరాదారులకే వర్తిస్తాయి. 2026 సవరణ చట్టంలోని సెక్షన్ 15ఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల నుంచి కొనుగోలు చేసే వస్తువులు, సేవలకు సంబంధించిన బిల్లుల పరిష్కారాన్ని ఆర్బీఐ అనుమతించిన టీరెడ్స్ వేదిక ద్వారా నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే ఇతర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేసే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సంస్థలకూ ఈ నిబంధన వర్తిస్తుంది. సమాధాన్ పోర్టల్‌తో అనుసంధానమైన ఆన్‌లైన్ వివాద పరిష్కార వేదికతోపాటు దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 161 సూక్ష్మ, చిన్న పరిశ్రమల సదుపాయ మండళ్లు బకాయి వివాదాల పరిష్కారానికి అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌లో 2026 ఆగస్టు 25న నిర్వహించిన పరిశ్రమల అదాలత్ ద్వారా 65 బకాయి వివాదాలు, రూ.8.29 కోట్ల మేర పరిష్కారమయ్యాయి. ఇటువంటి ప్రయత్నాలు నిరంతర ప్రక్రియగా మారాలి. సవరణ చట్టంలోని అన్ని నిబంధనలు ఒకేసారి అమల్లోకి రాలేదన్న విషయాన్ని కూడా గుర్తించాలి. అక్టోబర్ 15 నుంచి నోటిఫికేషన్‌లో పేర్కొన్న సెక్షన్లు అమల్లోకి వచ్చాయి.

గేమ్ ఛేంజరా.. మరో స్కీమా?

చిన్న, మధ్యతరహా సంస్థల వృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర మంత్రివర్గం 2026 అక్టోబర్ 6న రూ.10వేల కోట్ల ప్రభుత్వ నిబద్ధతతో ఎస్ఎంఇ వృద్ధి నిధి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వృద్ధి సామర్థ్యం, ఆర్థిక సాధ్యత ఉన్న సంస్థలకు ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడుల ద్వారా తోడ్పాటు అందించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇది సాధారణ బ్యాంకు రుణ పథకం కాదు. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ అంచనాల ప్రకారం 2026లో ప్రపంచ ఆర్థిక వృద్ధి 2.6 శాతంగా, స్థిర ధరల వద్ద వస్తు, సేవల వాణిజ్య వృద్ధి సుమారు 4 శాతంగా ఉండనుంది. ప్రభుత్వ పథకాలు ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలివ్వాలి. రుణం అందించడం మొదటి అడుగు మాత్రమే. చేసిన పనికి పైసలు సకాలంలో అందడం, ఉత్పత్తికి తగిన మార్కెట్ లభించ డం, ప్రపంచ పోటీలో నిలిచే సామర్థ్యం పెరగ డం సాధ్యమైనప్పుడే చిన్న పరిశ్రమలు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఫిరోజ్ ఖాన్, 9640466464

ఒత్తిడికి గురవుతున్న ప్రజాస్వామ్యం

నంటూ బెనర్జీ

కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నిర్వహించిన భారీ నిరసనకు ప్రతిగా, 'లోక్‌తంత్ర బచావో... అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకత్వాన్ని తొలగించండి) అనే నినాదంతో అధికార బిజెపి ప్రజా ర్యాలీలు నిర్వహించడం ఆసక్తికరమైన పరిణామం. పెరుగుతున్న ప్రజా తిరుగుబాట్లు భారత్‌లోనేకాదు, యూరప్‌లోని పలు దేశాల్లోనూ ఎన్నికైన ప్రభుత్వాలకు సవాలుగా మారుతున్నాయి. ప్రజాదరణను తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం, సమాజంలో విభజనలు సృష్టించడం వంటి చర్యలతో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కొంతమంది ప్రజాకర్షక నాయకులు దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మన దేశంలో, గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ హయాంలో వేగంగా పెరుగుతున్న మత జాతీయవాదం (హిందూత్వ) భారతదేశ చారిత్రక బహుళత్వానికి సవాలుగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా సుమారు 20కోట్ల జనాభా కలిగిన ముస్లింలు సహా, మైనారిటీలను పక్కనపెట్టడం లేదా లక్ష్యంగా చేసుకోవడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ అనుసరిస్తున్న ఇలాంటి విధానాల వల్ల సమాజంలో విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయి. ఫ్రీడమ్ హౌస్, వీడెమ్ ఇన్‌స్టిట్యూట్ వంటి అంతర్జాతీయ ప్రజాస్వామ్య పర్యవేక్షణ సంస్థలు భారతదేశ ప్రజాస్వామ్య స్థాయిని తగ్గించాయి. గతంలో 'స్వేచ్ఛాయుత దేశం' లేదా 'సంపూర్ణ ప్రజాస్వామ్యం'గా పేర్కొన్న భారతదేశాన్ని ఇప్పుడు 'పాక్షిక స్వేచ్ఛాయుత దేశం' లేదా 'ఎన్నికల నిరంకుశత్వం' వంటి వర్గాల్లో చేర్చాయి. పత్రికా స్వేచ్ఛపై పెరుగుతున్న ఒత్తిడి, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించేలా న్యాయవ్యవస్థపై ప్రభావం చూపే ప్రయత్నాలు, రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడంతోపాటు, స్వతంత్ర పౌర సమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాలకు అవకాశాలు తగ్గడం వంటి అంశాలను తమ అంచనాలకు మూలాలుగా ఈ సంస్థలు పేర్కొంటున్నాయి. ప్రజాకర్షక నాయకులు ఎవరూ ప్రజాస్వామ్యాన్ని కూలదోస్తామని బహిరంగంగా ప్రకటించి అధికారంలోకి రారు. అందుకు భిన్నంగా, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరిస్తామని, అందరికీ సమాన అభివృద్ధి అందిస్తామని హామీ ఇస్తూ అధికారాన్ని చేపడతారు. అయితే, అందలం ఎక్కిన తర్వాత, క్రమంగా అధికారాన్ని కేంద్రీకరించి, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించే వ్యవస్థలను బలహీనపరుస్తారు. యూరప్‌లోని ప్రజాస్వామ్య వ్యవస్థలు కూడా ఇటువంటి ప్రజాకర్షక నాయకుల నుంచి ముప్పును ఎదుర్కొంటున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు సాధారణంగా తక్షణ ఉద్రిక్తతలను తగ్గించడం, క్రమబద్ధమైన చర్చలు జరపడం, సంస్థాగత, విధానపరమైన సంస్కరణ లు చేపట్టడం వంటి చర్యల ద్వారా మధ్యంతర ప్రజా తిరుగుబాట్లను ఎదుర్కొంటాయి. అయితే, ప్రజల అసంతృప్తికి మూలకారణాలను పరిష్కరిస్తూనే, శాంతిభద్రతలను కాపాడటం, ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవించడం మధ్య సమతుల్యత పాటించాల్సి ఉంటుంది.

ప్రజా నిరసనలు ప్రాథమిక హక్కు. పనిచేసే ప్రజాస్వామ్యానికి అవి కీలకమైన భాగం. కానీ, ఈ కీలకమైన విషయాన్ని ఎన్నికైన ప్రభుత్వాలు తరచుగా మరచిపోతుంటాయి. ప్రభుత్వాలపై తమ అసమ్మతిని వ్యక్తం చేయడానికి, పాలకులను జవాబుదారీగా నిలబెట్టడానికి, విధానపరమైన మార్పులకు ప్రజా నిరసనలు తప్పనిసరి అవుతాయి. యూరప్‌లో రాజకీయ మార్పులపై జరిగిన పరిశోధనలు, హంగరీలో విక్టర్ ఓర్బన్ పాలన వంటి చారిత్రక, సమకాలీన ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ప్రజాకర్షక పాలకులు ప్రజాస్వామ్య పర్యవేక్షణకు అవసరమైన ప్రాథమిక హక్కులపై దాడిని లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొంటున్నాయి. ఇందులో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు లేదా రాజకీయ ఒత్తిడి, న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీయడం, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కుపై పరిమితులు విధించడం వంటి అంశాలు ఉన్నాయి. పక్షపాత మీడియా వ్యవస్థలు, డిజిటల్ మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం, వలసలు, ఆర్థిక అనిశ్చితి, ప్రజారోగ్య సంక్షోభాల చుట్టూ ప్రజల్లో ఉన్న అసంతృప్తిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో, యూరప్ ప్రజాస్వామ్యాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇవన్నీ బహుళత్వ ప్రజాస్వామ్య విలువల సామర్థ్యాన్ని, స్థిరత్వాన్ని పరీక్షిస్తాయి. యూరోప్, భారత దేశాల్లో ప్రతిపక్షాలు, సామాజిక సంస్థలు, విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రస్తుత ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు మధ్య సారూప్యత కనిపిస్తున్నది. రెంటిలోనూ ప్రజాకర్షక నాయకులు అనుసరించే రాజకీయ పద్ధతుల్లో అనేక పోలికలు ఉన్నాయి. ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రత్యర్థులను చట్టబద్ధమైన ప్రత్యామ్నాయాలుగా కాకుండా శత్రువులుగా చూస్తున్నాయి. వారిని 'ప్రజల శత్రువులు' లేదా





దేశ భద్రతకు ముప్పుగా చిత్రీకరిస్తున్నాయి. అటు యూరోప్‌లో, ఇటు భారత్‌లో ప్రభుత్వాలు సార్వత్రిక ఎన్నికలు వంటి ప్రజాస్వామ్య ప్రక్రియల బాహ్య రూపాన్ని కొనసాగిస్తూనే, కార్యనిర్వాహక అధికారాన్ని నియంత్రించే స్వతంత్ర సంస్థలు, న్యాయస్థానాలు, పర్యవేక్షణ సంస్థల స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయి. బలహీనపరుస్తున్నాయి. న్యూఢిల్లీలో ఇటీవల ప్రతిపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలకు వివిధ పౌరసమాజ సంస్థలు మద్దతు తెలిపాయి. ఈ ప్రదర్శనలు సంస్థల స్వతంత్రత, ఎన్నికల సంఘం, ప్రభుత్వ పాలనకు సంబంధించిన అంశాలపై కొనసాగుతున్న ప్రజాభిప్రాయాలను ప్రతిబింబించాయి. ఈ ఉద్యమాలు ప్రజల్లో నెలకొన్న లోతైన ఆందోళనతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న చైతన్యాన్ని కూడా తెలియజేస్తున్నాయి. శాంతియుత నిరసనలు అధికారంపై కీలకమైన నియంత్రణగా పనిచేస్తాయి. ఎన్నికల రోజు వచ్చే వరకు వేచి చూడకుండా, అణగారిన వర్గాలు, మైనారిటీలు ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశాన్ని కల్పిస్తాయి. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, యువత ఆధ్వర్యంలోని వీధి నిరసనలు, మారుతున్న ఎన్నికల పరిస్థితుల నుంచి ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లోని ప్రభుత్వాలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కార్మికవర్గంలో అసంతృప్తికి అధిక ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, అందుబాటులో లేని గృహాలు, నిరుద్యోగం, తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటి సమస్యలు ప్రధాన కారణాలు. అనేక ప్రజాస్వామ్య దేశాల్లో అధికారమంతా తమకు జవాబుదారీగా ఉందని పాలకవర్గం లేదా పెద్ద సాంకేతిక సంస్థల చేతుల్లోనే ఉందని పౌరులు భావిస్తున్నారు. దీనివల్ల సంప్రదాయ సంస్థలపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోంది. అనేక దేశాల్లో స్వతంత్ర తనిఖీ, నియంత్రణ వ్యవస్థలు, ఎన్నికల నియమాలు, పౌర హక్కులు ప్రమాదంలో పడుతున్నాయి. యూరప్‌లో ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, బెల్జియం, పోర్చుగల్, గ్రీస్, అల్బేనియా వంటి దేశాల్లో యువత నేతృత్వంలో నిరసనలు ఎగసిపడుతున్నాయి. ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వాలపై యువత ఒత్తిడి తెస్తోంది. బ్రెజిల్, సెర్బియా వంటి దేశాల్లో ఇటీవల జరిగిన కీలక ఎన్నికలు కూడా రాజకీయంగా విభాజితమైన ఓటర్ల వైఖరిని ప్రతిబింబించాయి. అధికారంలో ఉన్న నాయకత్వానికి, ప్రజాస్వామ్య విలువలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా సాగుతున్న రాజకీయ ప్రయత్నాలు ఈ ఎన్నికల్లో స్పష్టమయ్యాయి.

భారతదేశంలో ఈ పరిణామాలకు ప్రత్యక్ష ఉదాహరణగా ఒక పెద్ద ప్రజా ఉద్యమం కొనసాగుతోంది. ఎన్నికల జాబితాల్లో మార్పులకు వ్యతిరేకంగా భారీ నిరసనలు వెల్లువెత్తడంతో కేంద్రంలోని అధికార ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దేశ ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలపై 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) అనే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అమలు చేసింది. ఈ ప్రక్రియలో 13 కోట్లకు పైగా పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. అభిజీత్ దీప్కే నాయకత్వంలోని 'కాక్రోచ్ మూమెంట్' వంటి విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్ నాయకత్వంలోని లద్దాఖ్ ఉద్యమం, దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్ష నాయకులు ఈ తొలగింపులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి ప్రయోజనం చేకూర్చేందుకు ఈ ప్రక్రియ ద్వారా అణగారిన వర్గాలు, మైనారిటీలు, ఇతర అంచున ఉన్న ప్రజల ఓటు హక్కును అసమానంగా తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్రాల అధికారులు మాత్రం నకిలీ లేదా నకిలీగా నమోదైన లేదా మరణించిన ఓటర్ల పేర్లను తొలగించినట్టు చెప్తున్నారు. ఓటర్ల సమాచారాన్ని ప్రక్షాళన చేయడం కోసం ఈ ప్రక్రియ అవసరమని వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రతిదాడికి దిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా హైదరాబాద్‌లో పాదయాత్ర నిర్వహించారు. 'సర్'కు వ్యతిరేకంగా 'ఓట్ బచావో' (ఓటును కాపాడండి) ఉద్యమం చేయాల్సిన ప్రతిపక్షాలు, వాస్తవానికి 'ఘుస్పేటియా బచావో' (చొరబాటుదారులను కాపాడండి) ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. కోల్‌కతాలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి భారీ ర్యాలీకి నాయకత్వం వహించారు. ఎన్నికల పారదర్శకతపై ప్రతిపక్షాలు చేస్తున్న వాదనలను సవాలు చేస్తూ ఈ ప్రదర్శన నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా నిరసనలు ఒక కీలకమైన భద్రతా కవచంగా, ప్రభుత్వాలను జవాబుదారీగా ఉంచే సాధనం గా పనిచేస్తాయనే విషయాన్ని ఎన్నికైన ప్రభుత్వాలు దురదృష్టవశాత్తూ మరచిపోతున్నాయి.

ప్రజలు నిర్వహిస్తున్న నిరసనలకు వ్యతిరేకంగా ఒక ప్రభుత్వం స్వయంగా ఎదురుదాడి ర్యాలీలను నిర్వహించినప్పుడు లేదా వాటికి మద్దతు ఇచ్చినప్పుడు, అది తన అధికారాన్ని, ప్రతిష్ఠను పెంచుకోవడానికి ప్రయత్నించడంగా, ప్రజాస్వామ్య విలువల నుంచి వెనక్కి తగ్గడంగా, అసమ్మతిని అణచివేయడంగా పరిగణించాల్సి ఉంటుంది.

(ఐపిఎ సర్వీస్)

ఎల్ నినో ముప్పు... విద్యారంగంపై ప్రభావం..



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు
7569548477

ఏ వస్తువైనా మార్కెట్లో కొనగలం.. అవసరమైతే ప్రభుత్వాన్ని అడిగి సాధించుకోగలం. కానీ నీటిని మాత్రం మనం ఫ్యాక్టరీల్లో తయారుచేయలేం. ఆకాశం కరుణించి వర్షం కురిస్తేనే జీవకోటికి ప్రాణాధారం లభిస్తుంది. ప్రకృతిలో చోటుచేసుకునే వాతావరణ మార్పులు నేరుగా మానవ జీవన విధానాన్ని శాసిస్తాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం తీవ్రమైన సవాళ్లను సృష్టిస్తోంది. ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే 'ఎల్ నినో' ప్రభావం భారత దేశ రుతుపవనాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనివల్ల దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఈ పరిస్థితి కేవలం తాగునీరు, సాగునీటి కొరతకే పరిమితం కాకుండా.. వ్యవసాయం, ప్రజారోగ్యం, విద్యార్థుల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపనుంది.

బాసర ట్రిపుల్ ఐటి ఒక హెచ్చరిక

వాతావరణ మార్పుల తీవ్రతకు విద్యాసంస్థలు ఏ విధంగా ప్రభావితమవుతాయో చెప్పడానికి బాసర ట్రిపుల్ ఐటి (ఆర్‌జియుకెటి) పరిస్థితే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. అక్కడ నీటి కొరత తీవ్రమవడంతో విద్యార్థులను ఇళ్లకు పంపి, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో కూడా కళాశాలలు నీళ్ళు లేక ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి.

ఇది కేవలం ఒక సంస్థకు పరిమితమైన సమస్య కాదు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కోబోయే విపత్తుకు ముందస్తు హెచ్చరిక. రానున్న ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉన్నాయి. అలాగే వివిధ ప్రవేశ పరీక్షల (జెఇఇ, నీట్, ఎంసెట్ మొదలైనవి) కోసం వేలాది మంది విద్యార్థులు కోచింగ్ కేంద్రాలలో శిక్షణ పొందుతున్నారు.ఇలాంటి కీలక సమయంలో నీటి కొరత, విద్యుత్ కోతలు ఏర్పడితే విద్యార్థుల విద్యా సంవత్సరం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

ఎల్ నినో ప్రభావంతో చలికాలం ముగియకముందే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగే అవకాశం ఉంది. వడదెబ్బ కారణంగా డీహైడ్రేషన్, నీరసంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. వేలాదిమంది విద్యార్థులు కలిసి ఉండే సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాలయాలు, యూనివర్సిటీ క్యాంపస్‌లలో నిత్యావసరాలకు నీటి సరఫరా నిలిచిపోతే స్నానాలు లేక అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఎల్ నినో ముప్పు ముంచుకొస్తున్న వేళ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో నీటి కొరత తలెత్తకుండా విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూ



ఎస్) విభాగం, మున్సిపల్ శాఖలు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రస్తుత నీటి వనరుల (బోర్‌వెల్స్, మిషన్ భగీరథ/మంచినీటి కనెక్షన్లు) స్థితిగతులపై తక్షణమే 'వాటర్ ఆడిట్' నిర్వహించాలి. ఎండాకాలంలో ఏయే ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతాయో ముందే మ్యాపింగ్ చేయాలి. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కు తగినట్లుగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, భూగర్భ సంపుల నిల్వ సామర్థ్యాన్ని సమీక్షించి, అవసరమైన చోట అదనపు సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటికీ స్థానిక తాగునీటి గ్రిడ్ కనెక్షన్లు నిరంతరాయంగా పనిచేసేలా చూడాలి. పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలి. తీవ్ర నీటి కొరత ఉండే ప్రాంతాల్లోని పాఠశాలలు, హాస్టళ్లను స్థానిక మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీల తాగునీటి ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎండిపోయిన లేదా పూడిక పేరుకుపోయిన బోర్ బావులను ఫ్లషింగ్ చేయించాలి.

అవసరమైతే మోటార్ల సామర్థ్యాన్ని పెంచడం లేదా పైపులను మరింత లోపలికి దించడం వంటి పనులు జనవరి లోపే పూర్తి కావాలి. స్కూళ్లు, హాస్టళ్లలో అనేక చోట్ల ఆర్వో ప్లాంట్లు చిన్నచిన్న మరమ్మతులతో మూలనపడ్డాయి. వాటన్నింటినీ గుర్తించి తక్షణమే పునరుద్ధరించాలి.

వ్యర్థ నీటి పునర్వినియోగంపై దృష్టిపెట్టాలి

హాస్టళ్లలో విద్యార్థులు స్నానాలు చేసిన నీరు, కిచెన్‌లో గిన్నెలు కడిగిన నీరు వృథాగా పోకుండా.. వాటిని చిన్నపాటి ఫిల్టర్ బెడ్స్ ద్వారా మళ్లించి, టాయిలెట్ల ఫ్లషింగ్‌కు, క్యాంపస్ లోని మొక్కలకు ఉపయోగించాలి. దీనివల్ల తాగునీటిపై ఒత్తిడి 40శాతం వరకు తగ్గుతుంది. పాఠశాలల్లో విద్యార్థులు ట్యాప్స్ సరిగ్గా బంద్ చేయకపోవడం వల్ల వందలాది లీటర్ల తాగునీరు వృథా అవుతుంది. వీటికి బదులుగా వాటంతట అవే ఆగిపోయే 'పుష్ బటన్' ట్యాప్స్ అమర్చాలి. రాబోయే రోజుల్లో ఎండలు తీవ్రం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజ్, హెల్త్ కిట్లను అందుబాటులో ఉంచాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో బోర్డు పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద విద్యార్థుల కు చల్లని, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంచే బాధ్యతను స్థానిక అధికారులకు అప్పగించాలి. ఎండల తీవ్రత పెరిగితే పాఠశాలల వేళలను (బడి సమయాలను) ముందే సవరించాలి.

ఎల్ నినో అనేది ప్రకృతి సృష్టించే విపత్తు. దీన్ని పూర్తిగా ఆపడం ప్రభుత్వాలకు సాధ్యం కాకపోవచ్చు. కానీ, దీని ప్రభావాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడం కచ్చితంగా ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలు లేదా హెచ్చరికలు ప్రజలను, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఉండకూడదు.

ముందస్తు ప్రణాళిక లు, నీటి సంరక్షణ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణ ద్వారానే మనం ఈ సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగలం. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడటం, ప్రజల సురక్షిత జీవనానికి హామీ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత.



దేశ ప్రతిష్ఠను చాటేలా
ఖేలో ఇండియా నిర్వహణ

అధికారులకు మంత్రి వాకిటి శ్రీహరి దిశానిర్దేశం

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026 నిర్వహణతో జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠను చాటిచెప్పాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు సూచించారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల నిర్వహణకు మొత్తం రూ.203 కోట్లతో ఏర్పాట్లు చేపడుతుండగా, ఇందులో రూ.120 కోట్లను క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయించినట్లు ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వాణీ ప్రసాద్ వెల్లడించారు. ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధమయ్యాయని, మరో ఐదు స్టేడియాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని స్పోర్ట్స్ అథారిటీ విసి, ఎండి సోనిబాలాదేవి తెలిపారు. బేగంపేటలోని టూరిస్ట్ ప్లాజాలో మంగళవారం ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణపై వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదల, కృషి కారణంగానే తెలంగాణకు ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించే అవకాశం దక్కిందన్నారు. కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి తెలంగాణకు ఈ బాధ్యతలు అప్పగించాలని గతంలో కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలను విజయవంతంగా నిర్వహించాలని, నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. క్రీడా పోటీల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు అవి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ పనుల నిర్వహణకు డిప్యూటీ కలెక్టర్లకు ప్రభుత్వం పూర్తి అధికారాలు కల్పిస్తోందని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

యువతను క్రీడల వైపు మళ్లించాలి

యువత రీల్స్, సోషల్ మీడియా వ్యసనంతోపాటు బెట్టింగ్ మహమ్మారి బారిన పడకుండా క్రీడల వైపు మళ్లించాలని మంత్రి పిలుపునిచ్చారు. మణిపూర్‌లో గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడా సంస్కృతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలోని ప్రతి గ్రామంలో క్రీడా వాతావరణాన్ని పెంపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ ఖేలో ఇండియా నిర్వహణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. స్టేడియాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని, పనుల్లో నాణ్యత, వేగం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వాణీ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు, కోచ్‌లు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ విసి, ఎండి సోనిబాలాదేవి మాట్లాడుతూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక ఐఎంఎస్ పోర్టల్ ఏర్పాటు చేశామని, ప్రతి పనికి సంబంధించిన వివరాలను అందులో నిరంతరం నమోదు చేయాలని డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు.

భూ యజమానుల ప్రయోజనాలు
అభిప్రాయాలకే అత్యున్నత ప్రాధాన్యం

● రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సమగ్ర భూ రీసర్వే ప్రక్రియ ప్రారంభించాలి
● అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : తరతరాలుగా రైతాంగాన్ని వేధిస్తున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలకే అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 125 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టామని మంత్రి అన్నారు. తొలి దశలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున, నక్షాలు లేని గ్రామాలను కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సర్వే ప్రక్రియ వెయ్యి గ్రామాల మైలురాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే పనులు విజయవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో సర్వే సిబ్బంది ఎదుర్కొంటున్న పరిస్థితులను మంత్రి ఫోన్‌లో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియ నిర్వహణలో అధికారులు పాటించాల్సిన కీలక అంశాలపై మంత్రి స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. గ్రామాల్లో సర్వే ప్రారంభించడానికి ముందుగా రికార్డులు, సరిహద్దులు, విస్తీర్ణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. క్షేత్రస్థాయి సర్వే పూర్తయిన వెంటనే భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలను స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. రీసర్వే ఆరంభ దశలోనే ఉన్నందున చిన్న పొరపాట్లు ఉన్నా వెంటనే సరిదిద్దుకోవాలని, ఒక చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో భూ వివాదానికి దారితీయకూడదన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతీ భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చే 'భూధార్' నెంబర్ కేటాయింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ యజమానుల పూర్తి సంతృప్తే ఈ కార్యక్రమ విజయానికి ప్రామాణికమని, భవిష్యత్తు తరాలకు భూ వివాదాలు లేని తెలంగాణను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయి పరిస్థితులపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

'చేయూత పింఛన్ల'కు సన్నద్ధం

12 నుంచి 18 వరకు పత్రాల పంపిణీ

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మంజూరైన 'చేయూత పింఛన్ల' పత్రాలను ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు సంబంధిత నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో లబ్ధిదారులకు అందజేయనున్నారు. చేయూత సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి కొత్తగా మంజూరైన పింఛన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అర్హులైన దరఖాస్తుదారుల పెండింగ్ వెరిఫికేషన్, ఆమోద ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు సెర్ప్ (ఎస్ఇఆర్‌పి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ మెమో జారీ చేశారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి ఆమోదించాలని సూచించింది. మండలాలు, మున్సిపాలిటీలలో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా మంజూరు పత్రాలను అం దజేసే కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులను, ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని స్పష్టం చేసింది. చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు ప్రతి కార్యక్రమ వేదిక వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సెర్ప్ ఆదేశించింది. లబ్ధిదారుల సమస్యలను స్వీకరించి, అవసరమైన సహాయం అందించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల వెరిఫికేషన్, ఆమోదం నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సెర్ప్ సూచించింది. కొత్త పింఛన్ల మంజూరు, పంపిణీ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాలపరిమితిలో అన్ని చర్యలు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపింది.

సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిని
హరీశ్‌రావు ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం మాజీ మంత్రి, బిఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా ఆర్‌ఎంఓ రూమ్‌కు వెళ్లి అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించగా.. చాలామంది డాక్టర్లు రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి ఆసుపత్రిలో లేకపోవడం చూసి విస్మయానికి గురయ్యారు. ఆయా విభాగాల డాక్టర్లకు ఫోన్లు చేసి ప్రశ్నించగా, లంచ్‌కు వెళ్లామని, ఇంటికి వెళ్లామని కుంటిసాకులు చెప్పడంతో హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మెటర్నిటీ వార్డు, ఆర్థోపెడిక్ వార్డ్, పీడియాట్రిక్ వార్డు, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఆ తర్వాత ఆసుపత్రి డాక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, అనంతరం మీడియాతో మాట్లాడారు. నిత్యం 1000 నుంచి 1,500 ఓపీ అందించే ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కాలేజీకి అనుసంధానమై 20 సూపర్ స్పెషాలిటీ విభాగాలతో నడుస్తోంది. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో హెచ్‌ఒడిలు, ప్రొఫెసర్లు, సీనియర్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పిజి డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. కానీ మధ్యాహ్నం వరకే ఆసుపత్రికి వస్తే.. ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, ఆప్తమాలజీ (కంటి విభాగం), డెంటల్ సర్జరీ వంటి కీలక విభాగాల్లో ఒక్కరంటే ఒక్క ప్రొఫెసర్ గానీ, సీనియర్ డాక్టర్ గానీ డ్యూటీలో లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు ఉచిత



వైద్యం అందించాల్సిన డాక్టర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కచ్చితంగా ఆసుపత్రిలో ఉండాలి. కానీ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి ఇంటికి వెళ్లిపోవడం అత్యంత దురదృష్టకరం. డాక్టర్ల బాధ్యతారాహిత్యం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆసుపత్రికి వచ్చే పేషెంట్ల సంఖ్య పడిపోయింది. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని కేసీఆర్ హయాంలో సిద్దిపేటకు మెడికల్ కాలేజీ తెచ్చి 600 బెడ్లు ఏర్పాటు చేశాం. ఇవాళ ఆసుపత్రిలో 230 మంది రెగ్యులర్ డాక్టర్లు, 88 మంది పీజీ డాక్టర్లు.. కలిపి మొత్తం 318 మంది డాక్టర్లు ఉంటే, 600 బెడ్లకు గాను కేవలం 301 మంది ఇన్ పేషెంట్లు మాత్రమే ఉన్నారన్నారు. అంటే డాక్టర్ల కంటే పేషెంట్ల సంఖ్య తక్కువగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందక పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. ఇకపై ప్రతి నెలా నేనే స్వయంగా ఆసుపత్రి పనితీరుపై రివ్యూ చేస్తాను, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాల్సిందేనన్నారు.

నేరుగా పంచాయతీలకే
స్టాంప్ డ్యూటీ, సీవరేజ్ నిధులు

● ఉప సర్పంచుల జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేయాలి
● నూతనంగా ఎన్నికైన జిల్లా సర్పంచుల సంఘాల సమావేశంలో నేతల డిమాండ్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధి, స్థానిక సంస్థల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ నిరంతరం పనిచేస్తుందని పలువురు ప్రతినిధులు స్పష్టం చేశారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన జిల్లా సర్పంచుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరిగింది. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 2018లో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచాయతీ రాజ్ చట్టం వల్ల గ్రామ పంచాయతీలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే స్టాంప్ డ్యూటీ, మైనింగ్, సీవరేజ్ నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే అందేలా ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచులతో పాటు ఉప సర్పంచులకు కల్పించిన జాయింట్ చెక్ పవర్ వల్ల గ్రామాల్లో పరిపాలనాపరమైన చిక్కులు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కాబట్టి ఉప సర్పంచుల జాయింట్ చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా సర్పంచుల సంఘాల నాయకులు క్షేత్రస్థాయిలో సర్పంచుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. పంచాయతీ రాజ్ ఛాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి పుసులూరి నరేంద్ర మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో స్థానిక సంస్థల సంక్షేమం, బలోపేతం కోసం పోరాటాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, ఉపాధ్యక్షులు పుస్కూర్ అశోక్ రావు, తెలంగాణ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, కరీంనగర్ జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు అంజని ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మండిపల్ వెంకట్‌లతో పాటు నూతనంగా ఎన్నికైన వివిధ జిల్లాల సర్పంచుల సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ జెన్‌కోకు రోజుకు
75 వేల టన్నుల బొగ్గు సరఫరా

సింగరేణి-జెన్ కో సమన్వయ సమావేశంలో సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి మంగళవారం సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సిఎండి డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ జెన్‌కో కేంద్రాలకు బొగ్గు సరఫరాపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమావేశంలో తెలంగాణ జెన్‌కోకు జరుగుతున్న సరఫరాను మరింత పెంచాలని నిర్ణయించారు. జెన్‌కో థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు సూచించారు. గత నాలుగేళ్లతో పోల్చి చూస్తే ఈ ఏడాది తెలంగాణ జెన్‌కోకు ఎక్కువ బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరిగితే సింగరేణి తన సామర్థ్యం మేరకు మరింత బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ప్రస్తుతం 3 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని సిఎండి తెలిపారు. ఈ నేపథ్యంలో యాదాద్రికి బొగ్గు రవాణాను పెంచడానికి చర్యలు తీసుకోవాలని జెన్‌కోకు సూచించారు. ఒడిశాలో స్థానికంగా రవాణా సమస్యల వల్ల బొగ్గు రవాణాలో కొంత జాప్యం జరుగుతోందని, ఈ నెలాకరు నుంచి 16 వేల టన్నులను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జెన్‌కో సిఎండి డాక్టర్ హరీష్ వివరించారు. గని నుంచి సమీప రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో జరుగుతున్న బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. గత సమావేశాల తర్వాత బొగ్గు రవాణా పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జెన్‌కోలతో సహా స్థానికంగా ఉండే పలు ప్రైవేట్ సంస్థలు కూడా నైనీ బొగ్గు కోసం విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని నైనీ జిఎం ప్రస్తావించారు. నైనీలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో మొదటి ప్రాధాన్యంగా తెలంగాణ జెన్‌కోకు సరఫరా చేయాలని, మిగిలిన బొగ్గును కూడా ఇతర సంస్థల అవసరాల కోసం రవాణా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి మార్కెటింగ్ శాఖ అధికారులను సిఎండి ఆదేశించారు. ప్రతీ రోజు నైనీ బొగ్గు రవాణా విషయంలో తెలంగాణ జెన్‌కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, ఈడి (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణ జెన్‌కో డైరెక్టర్ (కోల్ అండ్ లాజిస్టిక్స్) నాగ్య, రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమైక్య మాజీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, తెలంగాణ రైతు సంక్షేమ శాఖ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది తదితరులు



స్వచ్ఛ సర్వేక్షణ్-2025-26 జాతీయ అవార్డు

అందుకోనున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్2025–26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవం బుధవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ తరఫున హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ అవార్డును అందుకోనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్, కేంద్ర సహాయ మంత్రితో ఖన్ సాహు విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ కింద దేశవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో అమలు చేసిన పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాల ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు విజ్ఞాన్ భవన్‌లోని ప్లీనరీ హాల్లో అవార్డుల ప్రదానోత్సవం ప్రారంభం కానుంది. అంతకుముందు రాష్ట్రపతి అవార్డు గ్రహీతలతో గ్రూప్ ఫొటో గ్రాఫ్‌లో పాల్గొననుండగా, అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ దశాబ్ది డాక్యుమెంటరీతో పాటు ఇతర ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించి, జాతీయ పురస్కారాలను అందజేయనున్నారు.

హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ పర్యటన

● భారత్ సమ్మిట్, గిగ్‌వర్కర్ల సమావేశంలో పాల్గొననున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత
● ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీతో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ సమావేశం



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్: ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో పర్యటించనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న 'భారత్ సమ్మిట్'తో పాటు గిగ్ వర్కర్ల ప్రత్యేక సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొంటారని ఆయన చెప్పారు. దాదాపు 70 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్న ఈ అంతర్జాతీయ సమ్మిట్‌లో ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై చర్చలు జరగనున్నాయని వివరించారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో రాహుల్ గాంధీ సమావేశమై గిగ్ వర్కర్ల సంక్షేమం, వారి హక్కులు, సామాజిక భద్రత అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన విషయాన్ని రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఢిల్లీలోని జనపథ్‌లో మంగళవారం రాహుల్ గాంధీని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ కలిశారు. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, జాతీయ స్థాయిలో ఓబిసిల ప్రాతినిధ్యం, పార్టీ రాజకీయ కార్యాచరణ, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం, బిసి అజెండాను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాలపై సమావేశంలో వారు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. భారత్ సమ్మిట్, గిగ్ వర్కర్ల సమస్యలు, ఎస్ఐఆర్ వ్యతిరేక కార్యక్రమాలు, మెగా బిసి ర్యాలీ తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలపై రాహుల్‌గాంధీకి మహేష్ కుమార్ గౌడ్ నివేదిక అందజేశారు.

జాతీయ రాజకీయాల్లో ఓబిసి ప్రాతినిధ్యంపై చర్చ

దేశవ్యాప్తంగా ఓబిసిల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడం, వారి సమస్యలపై కాంగ్రెస్ తరఫున మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై రాహుల్ గాంధీతో చర్చించినట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. బిసి సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలను జాతీయ స్థాయిలో మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరంపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో బిసి అంశంపై పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను కూడా వివరించారు. తెలంగాణలో బిసి రాజకీయ కార్యాచరణను మరింత విస్తృతం చేసే దిశగా హైదరాబాద్లో భారీ బీసీ ర్యాలీ నిర్వహించనున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. ఈ ర్యాలీకి రాహుల్ గాంధీని ఆహ్వానించామని, కార్యక్రమ తేదీలు ఇంకా ఖరారు కాలేదని వెల్లడించారు. మరోవైపు ఎస్ఐఆర్కు వ్యతిరేకంగా హైదరాబాద్లో నిర్వహించనున్న సభలోనూ రాహుల్ పాల్గొనాలని కోరినట్లు పేర్కొన్నారు.

పార్టీ అంతర్గత విభేదాలపై చర్చించలేదు

తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకుల మధ్య విభేదాలు, అంతర్గత వివాదాలపై రాహుల్ గాంధీతో ఎలాంటి చర్చ జరగలేదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాలను పార్టీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ పర్యవేక్షిస్తారని తెలిపారు. రాష్ట్రంలో బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, సంస్థాగతంగా చేపట్టిన కార్యక్రమాల వివరాలను మాత్రమే రాహుల్ గాంధీకి నివేదించినట్లు చెప్పారు.

సోనియా ఆత్మకథపై ప్రత్యేక కార్యక్రమం

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథను స్వాగతిస్తున్నామని మహేష్ గౌడ్ తెలిపారు. ఈ పుస్తకంపై తెలంగాణలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జ్ఞాపకార్థం తెలంగాణ ప్రభుత్వం హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో నిర్మించిన మెమోరియల్ పార్క్‌కు సంబంధించిన పుస్తకాన్ని ఢిల్లీలో రాహుల్ గాంధీకి మహేష్ కుమార్ గౌడ్ అందజేశారు. జనపథ్‌లో జరిగిన సమావేశం సందర్భంగా ఈ పుస్తకాన్ని రాహుల్‌గాంధీకి మహేష్‌కుమార్ గౌడ్ అందించారు.

ఈ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

తెలంగాణలోని వివిధ ప్రభుత్వ సంస్థలు, కార్పోరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను నవంబర్‌లోనే పూర్తి చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవకాశాలు కల్పించే అంశంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలను కొనసాగిస్తూనే ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్
షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-32/CMC/PTC-C-46/2026-27, తేదీ: 09.11.2026

NIT	పని పేరు	అంచనా విలువ / ఇసివి	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం	బిడ్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం	ఇ.ఇ. పేరు & చిరునామా
షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-32/ CMC/PTC-C-46 /2026-27, తేదీ: 09.11.2026	తెల్లాపూర్ వార్డ్ నెం. 263 మరియు ముత్తంగి వార్డ్ నెం. 265లో రెండు నీటి సరఫరా లీకేజీలు.	రూ. 22.00 లక్షలు	11.11.2026 ఉ.10.30 గం.లకు	14.11.2026 మ.3.00 గం.ల వరకు	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్ నెం. 7331189492

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 13419-PP/CL/ADVT/2026-27, Date: 10-11-2026

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

NIT	పని పేరు	అంచనా విలువ	బిడ్ సమర్పణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం	అధికారి పేరు & చిరునామా
NIT No. 10/ SE(GZ)/ GHMC/ 2026-27, తేదీ: 10.11. 2026	జిహెచ్‌ఎంసి, గోల్కొండ జోన్, కార్వాన్ సర్కిల్-31 పరిధిలోని పురానాపూల్ వంతెన నుండి అత్తాపూర్ వంతెన వరకు మూసీ నదిపై పేరుకుపోయిన నీటి హైసింత్, గడ్డి మరియు చెత్తను తొలగించడానికి FTC 6 నెలల పాటు హిటాచీని నియమించడం.	రూ. 132.00 లక్షలు	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 11.11.2026 ఉ.11.00గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేదీ: 19.11.2026 ఉ.11.00గం.లకు, టెక్నికల్ బిడ్ ప్రారంభ తేదీ: 19.11.2026 ఉ.11.30గం.లకు, ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ: 20.11.2026 ఉ.11.00గం.లకు	సూపరింటెండింగ్ ఇంజనీర్, గోల్కొండ జోన్, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎఫ్‌ఏసి), గోల్కొండ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 13456-PP/CL/ADVT/2026-27, Date: 10-11-2026



రూ.2.10 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాపక్షం/చర్లపల్లిఃకాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డిసిసి అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్ చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని కాకతీయ డైమండ్ కాలనీ నుండి తారక ఎన్‌క్లేవ్ కాలనీ వరకు సుమారు 2 కోట్ల 10 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులకు వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి, పంగ హరిబాబు, భూమయ్య యాదవ్, దాసోహం చిన్న, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజాపక్షం/ నిజాంపేట్ ః పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో, హెచ్‌పీఎల్ కాలనీలో రూ.60లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు పనులకు కూన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ హెచ్‌పీఎల్ కాలనీ ఈస్ట్, వెస్ట్‌తో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలనీ నుండి ఆదర్శ్ నగర్ వరకు లింక్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, కనీస వసతులను కల్పించలేక పోయారని విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే నేటికీ ప్రజలు గుండెల్లో నిలిచిపోయాయని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, సుమారు ముప్పై కోట్ల నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణపు పనులను చేపట్టినట్లు వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి, జగన్ గౌడ్, అలీ భాయ్, యాదగిరి, మూర్తి, వేణు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలి

మాజీ కార్పొరేటర్ రవి కిరణ్

ప్రజాపక్షం/నిజాంపేట్ ః గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలని మాజీ కార్పొరేటర్ వాకలపూడి రవి కిరణ్ కోరారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు మాజీ కార్పొరేటర్ రవి కిరణ్ ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాలకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రభుత్వ పాఠశాలకు, ప్రభుత్వ ఆసుపత్రి ఇతరత్రా ప్రజా ప్రయోజనాలకు కేటాయించి ప్రభుత్వ భవనాలను నిర్మించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాల వైద్య పరీక్షలకు, పిల్లలకు విద్య అందించిన వారవుతారని చెప్పారు. ప్రభుత్వ జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రభుత్వ భూమిని పరిరక్షించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని రవి కిరణ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల మధు పాల్గొన్నారు.

273 డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు కృషి

కుత్బుల్లాపూర్ ః 273వ నిజాంపేట్ డివిజన్‌లో విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు మరో ముందడుగు పడింది. డివిజన్‌లో అందుబాటులో ఉన్న ప్రభు త్వ స్థలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పా టు చేయాలని మంగళవా రం మాజీ కార్పొరేటర్ వకాలపూడి రవికిరణ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రదీప్ తల్లూరి పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డా.ఇ. నవీన్ నికోలస్ కలిసి కోరారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాల అవసరం, విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులు, స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో పాఠశాలను ఏర్పాటు చేసి పరిసర ప్రాంతాల విద్యార్థుల కు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ మేరకు పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపై సానుకూలంగా స్పందించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, ఈ విషయంపై తక్షణమే చర్యలు తీసుకుని అవసరమైన ప్రక్రియను ప్రారంభించాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగడంతో స్థానికంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆశాభావం వ్యక్తమవుతుంది.

వైభవంగా సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ ః అన్నోజిగూడలో జగదంబ మాత సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు బంజారా గ్రామ ప్రజలు పెద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం 6 గంటలకు గణపతి హోమం,7గంటలకు అమ్మవారికి అభిషేకం 8 గంటలకు ప్రత్యేక అలంకరణ 9గంటలకు చండీయాగం నిర్వహించారు.

రైళ్ల భద్రతలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

సిగ్నలింగ్ వైఫల్యాలపై సమగ్ర విచారణ జరపాలి * పండుగ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడపాలి

దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: రైళ్ల రాకపోకల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, సిగ్నలింగ్, సమాచార వ్యవస్థల్లో తలెత్తే వైఫల్యాలకు కారణాలను గుర్తించి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. పండుగల నేపథ్యంలో ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని సమర్థంగా నియంత్రించాలని, అవసరాన్ని బట్టి అదనపు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో మంగళవారం రైల్వే ఉన్నతాధికారులతో నిర్వహించిన భద్రతా సమీక్ష సమావేశంలో జిఎం మాట్లాడారు. రైళ్ల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించడంతోపాటు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలన్నారు. రైల్వే పాయింట్లు, క్రాసింగ్‌లు, భద్రతా పరికరాలు, అలారం వ్యవస్థల పనితీరుపై తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పట్టాల భద్రతకు ముప్పు కలిగించే అనుమానాస్పద కార్యకలాపాలను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సిగ్నళ్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని, రైల్వే ట్రాక్‌ల వెంట ప్రమాదాలకు కారణమయ్యే చెట్లను కత్తిరించే పనులను వేగవంతం చేయాలని సూచించారు. పండుగల సమయంలో ప్రధాన స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని, ప్రయాణికుల రాక పోకల సరళిని నిరంతరం పరిశీలిస్తూ అదనపు రైళ్ల అవసరాన్ని గుర్తించాలని అధికారులకు సంబంధిత సిబ్బందికి అవసరమైన మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. రైల్వే పట్టాలపై ఇనుప వస్తువులు, రాళ్లు ఉంచడం వంటి ఆకతాయిచర్యలను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు భద్రతా నిబంధనలు, నూతన విధానాలపై పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ హెచ్ఓడిలు పాల్గొనగా, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డిఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.



ఎఐటియుసి పోరాట ఫలితమే కంటోన్మెంట్ కార్మికులకు బోనస్ ः ఎం. నరసింహ

ప్రజాపక్షం/న్యూస్‌బ్యూరో/హైదరాబాద్:సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు దీపావళి సందర్భంగా బోనస్ అందడం ఎఐటియుసి పోరాట ఫలితమేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ అన్నారు. గతేడాది బోనస్ చట్టాన్ని అమలు చేయాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు పోరాటం చేశారని, దాని ఫలితంగా ఈ ఏడాది బోనస్ అందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం బోర్డు సిఇఓ, హెల్త్ సూపరింటెండెంట్‌ను కార్మికుల సమక్షంలో శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎం. నరసింహ మాట్లాడుతూ 2009 నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతోందన్నారు. బోనస్ అమలు కోసం చేపట్టిన పోరాటం విజయవంతమై, దీపావళి సందర్భంగా కార్మికులకు బోనస్ అందడం అభినందనీయమన్నారు. కంటోన్మెంట్ సిఇఓ మాట్లాడుతూ కార్మికులు అంకితభావంతో పనిచేసి కంటోన్మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని బోనస్ లభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. విజయోత్సాహంతో టపాసులు కాల్చి ఆనందం పంచుకున్నారు.

నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ వ్యాపారాలు అభివృద్ధి

మహిళా సంఘాల ప్రతినిధులకు ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి సూచన



ప్రజాపక్షం/న్యూస్ బ్యురో హైదరాబాద్ : మహిళలు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాల ను ఆచరణలో పెట్టి నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి సూచించారు. మహి ళా స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా మరింత బలోపేతం చేసి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ఎంఎంసి ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలి టీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటిఎహ్ఎం)లో నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 33 మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వినయ్ కృష్ణారెడ్డి వారికి ధృవీకరణ పత్రా లు అందచేశారు. శిక్షణలో భాగంగా మహిళలకు బల్క్ కుకింగ్ టెక్నిక్స్, హాస్పిటాలిటీ హైజీన్, మిల్లెట్ ఆధారిత వినూత్న వంటకా ల తయారీ, ఆహార నాణ్యత మెరుగుదల, ఉత్పత్తుల బ్రాండింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. నాణ్యమైన ఆహార తయారీ, పరిశుభ్రత ప్రమాణాల పాటింపు, వ్యాపార నిర్వహణ, బ్రాండ్ అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే ఆహార సంబంధిత వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకోవడంతో పాటు కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లో ప్రవేశపెట్టి మెరుగైన ఆదాయం పొందేందుకు ఈ శిక్షణ దోహదపడనుంది. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆహార రంగానికే పరిమితం కాకుండా ఇతర రంగాల్లోనూ మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ అనుభవాల ను పంచుకుంటూ, కొత్త వంటకాల తయారీ, పరిశుభ్రత ప్రమాణాలు, వ్యాపార నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను నేర్చుకున్నామని తెలిపారు. తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు అవకాశం కల్పించిన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుసిడి అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, పిడి యుసిడి సురేష్, డిఎంసి భానుప్రకాష్, ఇతర అధికారులు, యుసిడి సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను నూతన నిబంధనలపై సంపూర్ణ అవగాహన ఉండాలి

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆస్తిపన్ను నూతన నిబంధనలపై అధికారులు, సిబ్బందికి సంపూర్ణ అవగాహన ఉండాల ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన అన్నారు. సిఎంసి పరిధిలో ఆస్తి పన్నుకు సంబంధించిన క్యూర్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) చట్టం2026 నూతన నిబంధనలపై అధికారుల కు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైటెక్ సిటీలోని ఎన్‌సిసి భవనంలో ఉన్న సిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్స్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు. కొత్త చట్టంలోని ఆస్తి పన్ను నిబంధనలు, అమలు విధానంపై క్షేత్రస్థాయి అధికారులకు సమగ్ర అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కమిషనర్ సృజన అన్నారు. ఆస్తిపన్ను నిర్ధారణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది మేరుగైన సేవలు అందించాలన్నారు. సిఎంసి అదనపు కమిషనర్ (రెవెన్యూ) గీతారాధిక ఆస్తి పన్నుకు సంబంధించిన నూతన చట్టంలోని నిబంధనలను వివరం గా వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన క్యాపిటల్ వ్యాల్యూ సిస్టమ్ ఆధారంగా ఆస్తి పన్ను లెక్కింపు విధానాన్ని ఉదాహరణలతో వివరించడంతో పాటు ఆస్తి పన్ను దరఖాస్తులు, సంబంధిత ఫైళ్లను ఆన్‌లైన్‌లో నిర్వహించే ప్రక్రియను వివరించారు. ఈ నూతన నిబంధనలను అన్ని క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు ఏకరీతిలో అమలు చేయడంతో పాటు పన్ను చెల్లింపుదారులకు సరైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.





యాదవుల ఐక్యత చాటిన సదర్ సమ్మేళన్

ప్రజాపక్షం/బోడుప్పల్: మేడిపల్లి మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సదర్ వేడుకలు అంగరంగ వైభవం గా జరిగాయి. మండల యాదవ సంఘ అధ్యక్షుడు పాశం బుచ్చి యాదవ్ అధ్యక్షతన మేడిపల్లి హనుమాన్ ఆలయం ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే లు మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతలకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో సమాజంలో సుఖసంతోషాలు వెల్లివెరియాలని, యాదవులందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, దర్గా దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు రవి, బండి శ్రీరాములు, మాజీ మేయర్ జక్క వెంకటరెడ్డి, డిప్యూటి మేయర్ శివకుమార్‌గౌడ్, సదర్ సమ్మేళన నిర్వాహకులు మధుగాని దేవేందర్ యాదవ్, పాశం రాజు యాదవ్, పాశంసత్యం యాదవ్,తదితరులు పాల్గొన్నారు. **ఘట్‌కేసర్ః** యాదవుల ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతిని చాటిచెప్పేలా అన్నోజిగూడలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో యాదవ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి యాదవ సంఘం సభ్యులు సాగర్ సంజిత్ యాదవ్, బోయినీ శ్రీశైలం యాదవ్, బోయినీ జంగయ్య యాదవ్, పాశం లక్ష్మణ్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిలుగా మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, జగన్మోహన్ రెడ్డి, కొంతం శంకర్ రెడ్డి, శ్యామల సందీప్ రెడ్డి, బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి,సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంబంధిత పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేదు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అవసరాల గురించి విజ్ఞప్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఎంఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉప్పల్, నాచారం, కాప్రా సర్కిళ్లకు సంబంధించి డిప్యూటీ కమిషనర్లతో కల్సి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదిత పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, రోడ్లు, వీధి దీపాలు దోమల నివారణ, ఫుడ్‌సేఫ్టీ, టౌన్‌ప్లానింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజావసరాలు, సమస్యల తీవ్రత మేరకు అత్యవసరమైన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, అధికారులు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచిం చారు. ప్రజా సంబంధిత పనుల్లో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేసా రు. పలు ప్రాంతాల నుండి సమావేశ ప్రాంతానికి వచ్చిన కాలనీ ప్రతినిధులు, బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకొని వెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగు పరచాలి


ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణిని కల్సి ప్రభు త్వ పాఠశాలల పరిస్థితులను చర్చించిన అనంత రం ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల ఆశించిన ఫలితాలు రావటం లేదన్నారు. పేద విద్యార్థులకు నిలయాలుగా మారిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువు ఆటకంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యాప్రమాణాల మెరుగు పరచే లక్ష్యంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించటం, తగిన సంఖ్యలో తరగతి గదులు ఉండేలా జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

విస్టా క్విజ్ సర్క్యూట్ - ఫుడ్ ఫర్ థాట్ పై విద్యార్థులకు పోటీలు



ప్రజాపక్షం/ నిజాంపేట్ ః కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి బివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫర్ ఉమెన్ క్యాంపస్‌లో విస్టా క్విజ్ సర్క్యూట్ 'ఫుడ్ ఫర్ థాట్' పై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్‌లోని 23 పాఠశాలలకు చెందిన 69 జట్ల నుండి మొత్తం 138 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఆహారానికి, సమకాలీన ప్రపంచ పరిణామాలకు మధ్య సంబంధం ఏమిటి, ఈ రెండింటి మధ్య ఆసక్తికరమైన అనుబంధం ఉందని యువ క్విజ్ పోటీదారులు నిరూపించారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎస్‌విఈఎస్) ఆధ్వర్యంలో విస్టా క్విజ్ కరెంట్ అఫైర్స్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వినూత్న విధానం పోటీకి కొత్తదనాన్ని తీసుకురావడమే కాకుండా అనుభవపూర్వక అభ్యాసానికి అవకాశం కల్పించిందని నిర్వాహకులు తెలిపారు. సమకాలీన పరిణామాలు, సాధారణ అవగాహన, వివిధ అంశాల మధ్య సంబంధాలను గుర్తించే సామర్థ్యాన్ని ఈ పోటీ పరీక్షించింది. ఈ పోటీలో మొదటగా రాత పరీక్ష నిర్వహించారు. ఆ తరువాత రెండు సెమీ ఫైనల్స్, చివరగా ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సెయింట్ పాల్స్ హై స్కూల్‌కు చెందిన లక్ష్ చవాన్, మహమ్మద్ అర్మాన్ ఉల్లా సిద్ధిఖీ జట్టు అద్భుత ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ జట్టుకు మొదటి బహుమతిగారూ.20,000 అందజేశారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్ బొల్లారం రెండో స్థానంలో నిలవగా ఆ జట్టుకి రూ. 15,000 నగదు బహుమతిని అందజేశారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఉప్పల్ మూడో స్థానా న్ని దక్కించుకోగాఆజట్టుకిరూ.10,000ల నగదు బహుమతిని అందజేశారు. ఒకే ఒక్క పోటీగా కాకుండా పాఠశాలల మధ్య నిరంతరం విజ్ఞాన పోటీల పరంపరగా ఈ క్విజ్ సర్క్యూట్‌ని రూపొందించారు. విద్యార్థుల్లో జిజ్ఞాస, స్వతంత్ర ఆలోచన, సమకాలీన ప్రపం చ పరిణామాలపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించిన తొలి పోటీ అనంతరం కరెంట్ అఫైర్స్ రెండో పోటీగా నిర్వహిస్తామని వివరించారు. ఈ క్విజ్ పోటీని విస్టా క్విజ్ డైరెక్టర్ క్విజింగ్ న్యాయపతి గౌతమ్ నిర్వహించారు.

పాత బస్టాప్‌లో ఆర్టీసి బస్సులు నిలపాలి



ప్రజాపక్షం/దుండిగల్ః బాదురుపల్లి సర్కిల్ పరిధి లోని 294 డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఆకినబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ డిపో మేనేజర్ పర్మిళను కలిసి బహదూర్ పల్లి గ్రామంలోని సుమారు 30 సంవత్సరాల చరిత్ర కలిగిన పాత బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంపై వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ ఇకపై పాత బస్టాప్ వద్ద బస్సులు నిలపని పక్షంలో సంబంధిత డ్రైవర్లకు మెమోలు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి ఈనెల 15వరకు ధారూర్ మెథడిస్టు జాతర

ప్రజాపక్షం /వికారాబాద్ః నేటి నుంచి ఈ నెల 15వరకు జరిగే ధారూర్ మెథడిస్టు జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ ఇన్‌చార్జి బిషప్ సిజి దయానంద కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ధారూర్ జాతర ఉత్సవాలు బెంగుళూర్, రీజినల్ కాన్ఫరెన్స్ బిషప్ అనిల్ , హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ అధ్యక్షతన జరుగుతాయని తెలిపారు. 104వ జాతర అని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ , కర్నాటక, మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున భక్తులు రావడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. జాతరలో ప్రత్యేక ఆరాధనలు చేయడంతోపాటు భక్తిభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ లే లీడర్ జోషప్, ట్రెజరర్ రాజు, వికారాబాద్ డిఎస్ జాన్‌వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ, ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తుందని లింగారెడ్డి గూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో 583మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కొత్తగా 93 కుటుంబాలకు రేషన్‌కార్డులు అందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యుడు మల్లేష్ యాదవ్, జీపీఓ రాము, గ్రామకార్యదర్శి రాము, అంగన్‌వాడి టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

సర్పంచ్‌లకు తగిన గౌరవం ఇవ్వాలి



ప్రజాపక్షం/కేశంపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రంలో ఎంపిడిఒ, తహసీల్దార్‌లకు సమస్యలతో కూడిన వినతిపత్రం అంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నడిపించే సర్పంచ్‌లకు తగిన గుర్తింపు గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తొమ్మిదిరేకుల సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి, నిర్ధవెళ్ళి సర్పంచ్ చెదురువెళ్లి భాస్కర్ గౌడ్, దత్తాయపల్లి సర్పంచ్ భాస్కర్, బోదునంపల్లి సర్పంచ్ నాగేష్, పుట్టోనిగూడ సర్పంచ్ చప్లే భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

నిత్య అన్నప్రసాద వితరణ ప్రారంభం



ప్రజాపక్షం/హయత్ నగర్ : మన్సూరాబాద్ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్లు కొప్పుల విట్టల్ రెడ్డి నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 41 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మాల ధరించే అయ్యప్ప స్వాములు ప్రతిరోజూ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాంపల్లి శంకరయ్య, అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు నగేష్ గురుస్వామి, పాల్‌చందర్ అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు సముచిత గౌరవం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో వార్డు సభ్యులకు తగిన గౌరవం ఇవ్వడంతోపాటు ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వార్డు సభ్యుల సంఘం ఇన్‌చార్జి గ్యార సురేష్ కోరారు. మంగళవారం షాద్‌నగర్‌లో వార్డు సభ్యుల ఐక్యత, హక్కులు, ఆత్మగౌరవం కోసం నిర్వహించిన సభలో నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెల్జర్ల గ్రామ వార్డు సభ్యులు వెంకటయ్య నాయక్, తుప్పరి వనజ కుమార్, ఆచారి అనిత, లక్ష్మీ రవీందర్, చందునాయక్, రమేష్, పవన్, లావణ్య దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



ప్రజాపక్షం/కొందుర్గు: బాలల హక్కుల పరిరక్షణలో ప్రజలందరు భాగస్వాములు అయ్యేందుకు ప్రజలందరు కృషి చేయాలని కొందుర్గు సర్పంచ్ చౌదాపురం ప్రభాకర్ కోరారు. మంగళవారం కొందుర్గు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా బాలల సంరక్షణ కమిటీ సిడిపియు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిధిగా చౌదాపురం ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉజ్వల రాణి, అశ్రిత, గీత, సరళత, అంగన్‌వాడి టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించని అధికారులు



ప్రజాపక్షం/కొందుర్గు: మహానీయుల విగ్రహాలకు భంగం కలిగించకుండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను మరో ప్రాంతంలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని బిఎస్పీ జిల్లా నాయకుడు దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కొందుర్గు మడల కేంద్రంలో భిక్షపతి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అడ్డంగా లేము కానీ మహానీయుల విగ్రహాల ముందు నిర్మాణాన్ని అపివేరే ప్రదేశంలో కట్టడాలను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలను గత నాలుగు రోజులుగా చేస్తుంటే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు గూడెం చెన్నయ్య, బిఎస్పీ జిల్లా నాయకుడు దొడ్డి శ్రీనివాస్, వార్డు సభ్యులు భిక్షపతి, రత్నం, లక్ష్మణ్, జగన్, రాజు, నవీన్, మంజుల, యువకుకు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

‘తమ్మిడికుంట’ పునరుద్ధరణ పూర్తి





నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం న్యూస్‌బ్యురో/హైదరాబాద్ : నగరంలోని మాదాపూర్‌లో హైడ్రా ఆధ్వర్యంలో సుందరీకరించిన తమ్మిడికుంట చెరువును బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. శేరిలింగంపల్లి శాసన సభ్యులు, ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఈ సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సుంకరి రాజు, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బొగ్గారపు దయానంద్ గౌరవ అతిథులుగా, ప్రముఖ సిని నటుడు నాగార్జున అక్కినేని విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ వేడుకలో పాలుపంచుకోనున్నారు. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణే లక్ష్యంగా హైడ్రా చేపట్టిన ఈ సుందరీకరణ పనులతో తమ్మిడికుంట చెరువు కొత్త రూపు సంతరించుకుంది.

జోరుగా జిహెచ్‌ఎంసిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

రెండో రోజు 43.6 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు

ప్రజాపక్షం న్యూస్‌బ్యురో/హైదరాబాద్ : నగర పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపర్చే లక్ష్యంతో మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ఈనెల 9 నుంచి డిసెంబర్ 5 వరకు అన్ని 30 సర్కిళ్లలో నాలుగు వారాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. ‘ప్రగతి50 నగరాల’ ఫ్రేమ్‌వర్క్‌లోని కీలక పనితీరు సూచికల (కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్) ఆధారంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి వారానికి ప్రత్యేక థీమ్, ప్రతి పనిదినానికి నిర్దిష్ట కార్యాచరణను అమలు చేస్తున్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం రెండో రోజు నగరంలోని చెరువులు, కుంటలు, మురుగు కాలువలు, నాలాల్లో తేలియాడుతున్న వ్యర్థాలు, పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించడం, డంపింగ్ జరుగుతున్న ప్రవేశ మార్గాలను నిరోధించడం, అవగాహన కోసం సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలను అన్ని 30 సర్కిళ్లలో విస్తృతంగా నిర్వహించారు. మొత్తం 57 చెరువులు, కుంటలు, మురుగు కాలువలు, నాలాలను శుభ్రం చేయగా, 43.6 మెట్రిక్ టన్నుల తేలియాడే వ్యర్థాలు, పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే 21 డంపింగ్ ప్రవేశ ప్రాంతాలలోప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, జలవనరులను పరిరక్షించడం ప్రధాన లక్ష్యమని జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు.



పోలీసు కుటుంబాల పిల్లలకు చేయూత

ఆప్టిమస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి : యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి రూ.50లక్షల విరాళం అందించారు. మంగళవారం మైండ్‌స్పేస్‌లోని పెరెల్ క్లబ్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో తెలంగాణ డిజిపి సివి ఆనంద్ విరాళం చెక్కును అందజేశారు. ఈ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డిజిపి సివి ఆనంద్ అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలను నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకొచ్చి సహకరించడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి.సృజన, ఎస్ఎస్‌సి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటి రంగానికి చెందిన సంస్థల ప్రతినిధులు, ఆర్టీసీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇవిఎంల భద్రతలో అప్రమత్తత

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు)గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. సాధారణ నెలవారీ పరిశీలనలో భాగంగా గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడ ఏర్పాటు చేసిన సీల్స్‌ను పరిశీలించారు. ఇవిఎంల భద్రత, నిల్వ, పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలను సమీక్షించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు,వివి ప్యాట్ యంత్రాలు,ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సిసి టీవీ నిఘా వ్యవస్థ పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు,భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. తనిఖీలో రాజేంద్రనగర్ ఆర్‌డిఒ శ్రీధర్, తహసీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ పాత రికార్డులు తనిఖీ చేసి

అన్యాక్రాంత భూములపై స్పష్టత తేవాలి

అదనపు కలెక్టర్ కిరణ్మయి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : రెవెన్యూ పాత రికార్డులను తనిఖీ చేసి అన్యాక్రాంతమైన భూములపై స్పష్టత తేవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మండల దండుమైలారం గ్రామంలో 4.20 ఎకరాల భూమి అన్యాక్రాంతమైన గ్రామ కంఠం భూమి వివాదం జరుగటంతో మంగళవారం జిల్లా ఉన్నతాధికారులు బృందం పర్యటించి ప్రజల సమక్షంలో క్షేత్ర స్థాయిలో విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ దండుమైలారం గ్రామంలో గత 1954నాటి పహాణి, పైసల్ పట్టి రికార్డులతో పాటు లింకు డాక్యుమెంట్‌లను క్షుణంగా తణిఖీ చేయాలని ఆర్‌డిఒ, తహసీల్దార్, సర్వే అధికారులకు సూచించారు. భూములపై స్పష్టతపై రెవెన్యూ పాత రికార్డులను తనిఖీ చేయాలన్నారు. అన్యాక్రాంతమైన భూములపై స్పష్టత తేవాలన్నారు. గ్రామ కంఠం భూమి కబ్జా చేశారని ప్రజలు చేసిన ఆరోపణపై సమగ్ర విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిపిఒ సురేష్‌మోహన్, ఆర్‌డిఒ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సునీత పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా సిపిఐ

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి

ప్రజాపక్షం/తుర్కయంజాల్ : సిపిఐలో పనిచేసే ప్రతికార్యకర్తకు, వారి కుటుంబాలకు పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి తెలిపారు. సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యవర్గ సభ్యుడు సిహెచ్.నారాయణరెడ్డికి గత సంవత్సరం ప్రమాద వశాత్తు భవనంపై నుంచి కిందపడి వెన్నుపూసకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సుమారు రూ.8 లక్షలు వెచ్చించి చికిత్స చేయించుకున్నారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో రూ.1,75,000 మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం కోహెడలోని నారాయణరెడ్డి నివాసానికి వెళ్లినరవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ ఆయనకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు.



హాస్టల్ విద్యార్థులకు

అన్ని వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

ప్రజాపక్షం/హయత్‌నగర్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని జెడ్పీ కార్యాలయం వెనుక ఉన్న గురుకుల హాస్టల్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, తాగునీటి సదుపాయం, పారిశుద్ధం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించారు. విద్యార్థులు వినియోగించే నీటిని 3, 4 అంతస్తులకు కూడా వారే తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలుసుకున్నారు. 60 మూత్రశాలలకు కేవలం 8 మాత్రమే వినియోగంలో ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, గండి సన్నియాదవ్, కొత్త రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు

భరోసా కల్పించడమే లక్ష్యం

డిజిపి సివి ఆనంద్



ప్రజాపక్షం/రంగారెడ్డి: మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత భరోసా కల్పించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలిలో మహిళా, శిశు భద్రత విభాగం (విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్) కోసం ప్రత్యేకంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని డిజిపి సివి ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, కూకట్‌పల్లి జోన్ డిసిపి రితిరాజ్, కుత్బుల్లాపూర్ జోన్ డిసిపి కోటి రెడ్డి, శేరిలింగంపల్లి జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్, ట్రాఫిక్ డిసిపి శేషాద్రిని రెడ్డి , అడ్మిన్ డిసిపి టి.అన్నపూర్ణ, స్పెషల్ బ్రాంచ్ డిసిపి వై.వి.ఎస్. సుధీంద్ర, మహిళా, శిశు భద్రత విభాగం డిసిపి కె. సృజన, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన పాల్గొన్నారు. భవన నిర్మాణానికి రహేజా గ్రూప్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులను అందించింది. నిధుల సమీకరణలో రహేజా గ్రూప్ డైరెక్టర్ శర్వణ్‌గోన్ కీలక పాత్ర పోషించారు. పోలీస్ శాఖకు, రహేజా గ్రూప్‌కు మధ్య సమన్వయం చేస్తూ ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సిఎస్‌సి) కీలకంగా వ్యవహరించింది. భవనంలో నాలుగు ప్రధాన విభాగాలు పనిచేయనున్నాయి. షీ టీమ్స్ మహిళలపై వేధింపులు,ఈవ్ టీజింగ్ వంటి సమస్యలపై చర్యలు తీసుకుంటాయి. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, వ్యవస్థీకృత అక్రమ రవాణా, దోపిడీ నుంచి మహిళలు, చిన్నారులను రక్షించడంపై దృష్టి సారిస్తుంది. బాధితులకు సమగ్ర సహాయం, వైద్య, న్యాయ, మానసిక సహకారం అందించడంలో భరోసా కేంద్రం కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్, వృత్తిపరమైన కౌన్సెలర్ల సహాయంతో కుటుంబ, దాంపత్య వివాదాల పరిష్కారానికి కృషి చేస్తుంది. నాలుగు విభాగాలను ఒకే భవనంలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మహిళలు, చిన్నారులకు సత్వర సహాయం, సమన్వయంతో కూడిన సేవలు అందించేందుకు మార్గం సుగమమైంది.

విద్యుత్ అవసరాలకు అనుగుణంగా పంపిణీ వ్యవస్థ అభివృద్ధి

పాల్గొన్న ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: సంస్థ నిర్మాణం, వివిధ విభాగాల బాధ్యతలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్వహణ, ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి తెలంగాణ రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌కి వివరించడం జరిగింది. మంగళవారం ఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో జరిగిన ఉన్నతాధికారుల పరిచయం, సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి, తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ సిఎండి జితేష్ పాటిల్ సంస్థ కార్యకలాపాలు, పరిపాలనా నిర్మాణం, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, వివిధ విభాగాల పని తీరు, అమలులో ఉన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వికాస్‌రాజ్‌కు వివరించారు. టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని జిల్లాలు, విద్యుత్ వినియోగదారుల సంఖ్య, విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్, సబ్ స్టేషన్లు, విద్యుత్ ఫీడర్లు, పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరా నిర్వహణ, సంస్థ అందిస్తున్న వివిధ రకాల వినియోగదారుల సేవల గురించి సమగ్రంగా పరిచయం చేశారు. అలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు సంస్థ చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యుత్ సరఫరాలో నాణ్యత, విశ్వసనీయత పెంపుదల, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, విద్యుత్ నష్టాల నియంత్రణ, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార విధానాలు తదితర అంశాలను వివరించడం జరిగింది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేయడం, భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాల అమలు, విద్యుత్ తదితర అంశాల గురించి కూడా సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్, ఐటి, మాస్టర్ ప్లాన్) వట్టికొండ శివాజీ, డైరెక్టర్ (ఆపరేషన్స్) డా.ఎన్.నరసింహులు, డైరెక్టర్ (కమర్షియల్) చిలుకమరి చక్రపాణి, డైరెక్టర్ (ఫైనాన్స్) పి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిని 20 శాతం ఆదా చేయండి

హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇంచార్జి మహమ్మద్ వలీవుల్లా సమీర్

ప్రజాపక్షం/చార్మినార్: నీటి ఎద్దడి నేపథ్యంలో 20 నీటిని ఆదా చేయాలని హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇంచార్జి మహమ్మద్ వలీవుల్లా సమీర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. 20 శాతం నీటిని ఆదాచేయండి.. హైదరాబాద్‌ను సురక్షితం చేయండి అనే నినాదంతో సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రకటించారు. తక్కువ వర్షపాతం, ఎల్ నినో పరిస్థితులపై ఆందోళనల నేపథ్యంలో తాగునీటి కొరతను నివారించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. వెంటనే నీటి పొదుపు చర్యలు చేపట్టకపోతే, రాబోయే వేసవిలో హైదరాబాద్ తీవ్ర నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని సమీర్ వలీవుల్లా ఆందోళన వ్యక్తం చేశారు.

తలసానికి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/బేగంపేట్: మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్చాలు, స్వీట్లు అందజేసి శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మహేందర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అమీర్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌ల బిఆర్‌ఎస్ అధ్యక్షులు హన్మంతరావు, వెంకటేషన్ రాజు, నాయకులు మహేందర్ గౌడ్, శైలేందర్, కూతురు నర్సింహ, శేఖర్, ఉత్తమ్ సింగ్, గజ్జెల శ్రీనివాస్, గోపిలాల్ చౌహన్, గులాబ్ సింగ్ తదితరులు ఉన్నారు.

సంస్కృతికి ప్రతీక సదర్



ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ: సదర్ ఒక వేడుక మాత్రమే కాదని.. తర తరాలుగా వస్తున్న మన సంస్కృతి సాంప్రదాయాలు, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నదని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బోరబండలో జరిగిన సదర్ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గణేష్ యాదవ్, ఆనంద్ యాదవ్, కిట్టు యాదవ్, వెంకటేష్ యాదవ్, యాదవ సంఘం నాయకులు, కుల పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రజాబాట



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఎస్‌పిడిసిఎల్ పరిధిలో మంగళవారం విస్తృతంగా ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఇలు, డిఇలు, ఎడిఇలు, ఎఇలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొని విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్వహణ, మరమ్మతులు, భద్రతా చర్యలు చేపట్టారు. ప్రజాబాటలో భాగంగా వివిధ ప్రాంతాల్లోని డిటిఆర్ యార్డులను శుభ్రపరచడం, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, దెబ్బతిన్న ఎల్టీ కేబుళ్లు, ఫ్యూజ్ బేస్లను మార్చడం, వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడం వంటి పనులు చేపట్టారు.హిమాయత్‌నగర్ సెక్షన్లో డీటీఆర్ల వద్ద ఎల్టీ కేబుళ్లను క్లీట్స్‌ను పటిష్టంగా బిగించి అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ పనులను డైరెక్టర్ (ఆపరేషన్స్) డా.ఎన్.నరసింహులు పరిశీలించి అధికారులను అభినందించారు.

ఎఫ్‌ఎంజిలపై ఖాకీల ఝులుం



ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: శాంతియుతంగా రిలే నిరాహారదీక్ష చేపట్టిన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్‌పై పోలీసులు ఝులుం ప్రదర్శించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంగళవారం కోఠిలోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆవరణలో ఎఫ్‌ఎంజీ వైద్యులు సమావేశమై డిమాండ్లపై తాజా సమాచారం తెలుసుకునేందుకు డిఎంఇని కలిసి వినతిపత్రం అందించేందుకు కొందరు ప్రతినిధులు యత్నించడంతో పోలీసులు కఠినంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ సిఐ జి.నరేష్, ఏసిపి మట్టయ్య వ్యవహరించిన తీరుపట్ల ఎఫ్‌ఎంజిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన కొనసాగిస్తున్న సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని బలవంతంగా తరలిస్తున్న సందర్భంలో డాక్టర్ శశాంక్, డాక్టర్ వైష్ణవి గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిని మలక్‌పేట్, సైదాబాద్ తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించిన సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

కాలిపోతున్నా కళ్లు తెరవరా?

గోల్కొండ జోన్‌లో ఏం జరుగుతోంది?

ప్రజాపక్షం/గోషామహల్: అక్రమ నిర్మాణాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నా.. టౌన్‌ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అగ్ని ప్రమాదాలను ప్రోత్సహిస్తున్నారు. నిర్మాణ అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా ఉంటుండటంతో ప్రమాదాలు జరిగిన సందర్భంగా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోంది. దీపావళికి బేగంబజార్ కోల్సావాడిలో జరిగిన అగ్నిప్రమాదం కేవలం హెచ్చరిక మాత్రమే. అక్కడ అక్రమంగా కొనసాగుతున్న ప్లాస్టిక్ గోదాముల వల్లే ఆ ప్రమాదం జరిగినప్పటికీ, గోల్కొండ జోనల్ కమిషనర్ ఎందుకు పట్టించుకోవడం లేదు? అనేది అంతుచిక్కడం లేదు. ఖరీదైన ప్రాంతం కావడంతో ఏకంగా 100 గజాల స్థలంలో సైతం సెల్లార్లతో పాటు ఏకంగా ఐదు, ఆరు, ఏడు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇరుకు గల్లీల్లో చేపడుతున్న ఇటువంటి నిర్మాణాలతో స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కనీస సెట్ బ్యాక్స్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా ఎలా నిర్మాణాలు చేపడుతున్నారు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నా కఠిన చర్యలు చేపట్టడం లేదు. ఓ టౌన్‌ప్లానింగ్ అధికారి కారణంగానే అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయని.. ఇకనైనా బల్దియా బాస్ కర్ణన్ బేఅక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జె. హరికిషన్ ఎన్నిక

ప్రధాన కార్యదర్శిగా హనుమంతరావు

కోశాధికారిగా డి. శ్రీనివాస్





ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: తెలంగాణ ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా జె. హరికిషన్ ఎన్నికయ్యారు. తెలంగాణ ఎక్సైజ్ భవన్ కార్యాలయంలో నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా హనుమంతరావు (ఇఎస్, మల్కాజిగిరి), కోశాధికారిగా డి. శ్రీనివాస్ (ఎసి, గ్రేటర్ హైదరాబాద్) ఎన్నికయ్యారు. అసోసియేటెడ్ ప్రెసిడెంట్లుగా ఎ. చంద్రయ్య, శశిధర్ రెడ్డి, జ్యోతి, కిరణ్మయి, ఆర్. ప్రవీణ్, కె. రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి. శ్రీనివాస రెడ్డి, జి. గణేష్, కె. తిరుపతి, ఎం. శ్రీనివాసరావు, ప్రవీణ్ చంద్ర ఎన్నిక కాగా, జాయింట్ సెక్రటరీలుగా కె. నవీన్ కుమార్, ఎం. సుధాకర్, పి. కరంచంద్, ఎ. మోహన్ కుమార్, ఎస్. శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శులుగా ఎస్. కృష్ణప్రియ, ఎన్.ఎం. నివేదిత, ప్రచార కార్యదర్శిగా ఎం. సాయిరాం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. ప్రదీప్ రావు, క్రీడా కార్యదర్శులుగా జీవన్ కిరణ్, చిరంజీవి ఎన్నికయ్యారు. వీరితోపాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

జలమండలిలో మరణ మృదంగం

• మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి • మండిపడుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు • సిఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలి: మందాల బాలకృష్ణారెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: జలమండలిలో మరణ మృదంగం మోగుతోంది. వారానికి ఒకరు చొప్పున ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పిట్టల్లా రాలుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం మీటర్ రీడర్ మల్లేష్ బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృత్యువాత పడటం జరిగింది. గడచిన రెండు నెలల వ్యవధిలో తొమ్మిది మంది మృతిచెందినా.. జలమండలి ఎండి కె.అశోక్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి నిర్దిష్టమైన హామీ ఇవ్వకుండా మరణాలకు కారణం అవుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ జెఏసి వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల బాలకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఈ క్రమంలోనే మంగళవారం మౌలాలి సర్కిల్ ఔట్‌సోర్సింగ్ మీటర్ రీడర్ మల్లేష్ మృతిచెందడం పట్ల ఉద్యోగుల్లో అలజడి మొదలయ్యింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ముప్పు తలపెట్టేలా జిఓ 60 ప్రస్తావన లేకుండా జారీ చేసిన నూతన టెండర్ వ్యవహారం తీవ్ర అనుమానాలకు తావిస్తున్నది. సాంక్షన్ పోస్టుల ఫైలు పెండింగ్, ఐఎఫ్ఎంఐఎస్‌లో గుర్తింపులేని కార్మికులు, 675 మంది మీటర్ రీడర్ల కుటుంబాల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయని సంబంధిత ఉద్యోగులు మనోవేదనకు గురవుతున్నారు.

సిఎం దృష్టి సారించాలి...

జలమండలిపై సిఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఏసి చైర్మన్, అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ జెఏసి వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల బాలకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. మల్లేష్ కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని.. మరో కార్మికుడి కుటుంబం ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకోకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. మీటర్ రీడర్ల భవిష్యత్తుకు భరోసా లభించని పక్షంలో జలమండలిని స్తంభింప చేస్తామని వారు హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికులకు పండుగ సెలవులు అమలు చేయాలి



తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: మున్సిపల్ కార్మికులకు 15 క్యాజువల్ సెలవులు, 8 పండుగ సెలవులు అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. మద్దిలేటితో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశా రు. కార్మికులకు రొటేషన్ పద్ధతిలో ఎఫ్ఆర్‌ఎస్‌లో హాజరు నమోదు చేసే అవకాశం కల్పించాలని వా రు కోరారు. వినతిపై స్పందించిన అడిషనల్ కమిషనర్ సంబంధిత జాయింట్ కమిషనర్ పి. శ్రావణి, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం, ఐటి సెక్షన్ అధికారులకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం నాయకుడు బి. విక్రమ్ పాల్గొన్నారు.

జ్ఞానేశ్వరి రవిప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా.దేశబోయిన రఘు కోరారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గంగపుత్ర సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. గంగపుత్రులు తరతరాలుగా కాంగ్రెస్‌కు అండగా నిలుస్తూ వస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతానికి నిరంతరం పనిచేస్తూ, మహిళల సాధికారతకు, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తున్న పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్‌కు ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు కె.యాదగిరి, సత్యనారాయణ, పాక రాములు, వంగాల సుధాకర్, అంబటి రమేష్, వెంపటి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు గొంతు కోసిందే కెసిఆర్: యన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/ న్యూస్‌బ్యూరో/-హైదరాబాద్ : పాలమూరు గొంతు కోసిందే మాజీ సిఎం కెసిఆర్ అని ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. 10 ఏళ్ల బిఆర్‌ఎస్ పాలనలో పాలమూరు జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని జూరాల నుంచి నీళ్లు తీసుకొచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోలేదన్నారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని వేగవంతం చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఐదు వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్, ఎనిమిది లైన్ల రహదారి, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పాలమూరు అభివృద్ధిని బిఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కృష్ణా జలాల్లో 299 టిఎంసిలకు అంగీకరించి తెలంగాణకు కెసిఆర్ అన్యాయం చేశారని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు ఏటా రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారని యన్నం పేర్కొన్నారు.

కాంగ్రెస్ విధ్వంసంతో పాలమూరు మూడు తరాల పాటు కోలుకోదు

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో /హైదరాబాద్: పాలమూరు నీళ్లను వినియోగించుకుంటే ప్రస్తుతం పాలమూరు ముఖచిత్రమే మారిపోయేదని,కానీ కాంగ్రెస్ చేసిన దుర్మార్గం,విధ్వంసం కారణంగా మూడు తరాల పాటు పాలమూరు కోలుకోలేకుండా పోయిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్,మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, కొప్పుల మహేష్ రెడ్డి, మాజీ శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటైన వేదికలపైన సిఎం రేవంత్ రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం,అక్కడ రాజకీయాలు మాట్లాడడం, అందులో ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నాయకుడిని ధూషించడం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. సిఎం తన సొంత నియోజకవర్గానికి వెళ్లడంలో ప్రత్యేకత ఏమిటని?, కొడంగల్ పర్యటనతో పాలమూరుకు ఏం సంబంధమని ప్రశ్నించారు. జూరాలలో 9 టిఎంసిలనీళ్లు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు ఇవ్వకుండా వేధించారన్నారు. కర్నాటక నుంచి తెలంగాణకు నీటిని విడుదల చేసే విధంగా కర్నాటక ప్రభుత్వం వద్దకు తెలంగాణ రాష్ట్ర మంత్రులను పంపించినప్పటికీ ఒక్క చుక్క నీరు కూడా విడుదల కాలేదని నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేవలం మూడు వంతెనల వద్ద మట్టి తీస్తే సాగునీరు తరలించే అవకాశం ఉండేదనే విషయాన్ని తాము అఖిలపక్ష సమావేశంలో సూచించినప్పటికీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పట్టించుకోలేదని ఆరోపించారు. మాజీ మంత్రి వి .శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గతంలో గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకు నిధులను తీసుకుపోతున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారని, ప్రస్తుతం సిఎంగా ఆయన ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాకు ఏడాదికి రూ 20 వేల కోట్లు ఇస్తామని చెప్పి, మూడేళ్ల కాలంలో రూ 60వేల కోట్లు కాదు కదా? రూ ఆరు కోట్లు అయినా వచ్చాయా అని ప్రశ్నించారు.

జిఓ నెం: 259 సవరించండి

తెలంగాణ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్



ప్రజాపక్షం/ఖైరతాబాద్: బోర్‌వెల్స్ నిషేధంతో వాటిపై ఆధారపడి జీవించే లక్షలాది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని తెలంగాణ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జిఓ నెం: 259ను తక్షణమే సవరించి, బోర్‌వెల్ రంగాన్ని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పాత బోర్లకు ఉచిత రిజిస్ట్రేషన్ కల్పించాలని, నిర్ణీత ఫీజు చెల్లించిన 15 రోజుల్లోగా బోర్‌వెల్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎండిపోయిన బోర్లకు, రీబోరింగ్‌కు అనుమతులు ఇవ్వడంతో పాటు 300 అడుగుల లోతు వరకు బోర్లు వేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భూగర్భ జలాల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అందులో బోర్‌వెల్స్ యజమానులకు బాధ్యత ఉందని.. భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తిస్థాయిలో సహకరించేందుకు రిగ్ ఓనర్లు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వం కార్మికుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని బోర్‌వెల్ రంగానికి ఆచరణ సాధ్యమైన నిబంధనలు రూపొందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల మెరుపుదాడి

నలుగురు అరెస్ట్

రూ.5,025 నగదు, 4 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాపక్షం/నారాయణపేట : పట్టణంలోని పేరపల్ల రోడ్డులో పేకాట స్థావరంపై టౌన్ పోలీసులు మెరుపుదాడి నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పోలీసుల రాకను గమనించి అక్కడి నుంచి పరారయ్యారు. టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడి చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పేరపల్ల రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,025 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నలుగురిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పరారైన మరో ఐదుగురి వివరాలను సేకరించి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

'చదువుకో తెలంగాణ' కార్యక్రమం అభినందనీయం



మహబూబ్‌నగర్ ఎంపి డికె.అరుణ

ప్రజాపక్షం/గద్వాల రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించేందుకు శ్రీరామ్ గ్రూప్ సంస్థ 'చదువుకో తెలంగాణ' అనే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని మహబూబ్‌నగర్ ఎంపి డికె. అరుణ తెలిపారు. శ్రీరామ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డికె బంగ్లాలో సన్మానించారు. 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో గద్వాల జిల్లా టాపర్‌గా నిలిచిన ఉత్తనూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పవిత్రను మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, బిజెపి యువ నాయకురాలు స్నిగ్ధరెడ్డి ఘనంగా సన్మానించి, శ్రీరామ్ గ్రూప్ సహకారంతో లక్ష రూపాయల చెక్కును అందజేశారు. దీంతో పాటు, గద్వాల జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించి, ఉత్తమ ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.10,000 చొప్పున ప్రోత్సాహక చెక్కులను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి డికె.అరుణ మాట్లాడుతూ మనిషికి ఎన్ని ఆస్తులు ఉన్నా.. చదువు లేకపోతే అవన్నీ వృథా అవుతాయని, విద్యే నిజమైన సంపద అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే ఇటువంటి గుర్తింపు, ఆర్థిక ప్రోత్సాహకాలు వారిలో మరింత చదువుకోవాలనే కసిని, పోటీతత్వాన్ని నింపుతాయని, ప్రతిభ చాటిన విద్యార్థులంతా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజంలో ఉన్నతమైన స్థానాల్లో నిలవాలని ఎంపి డికె అరుణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఎక్బోటే, జిల్లా కోశాధికారి మీర్జాపురం వేముకటేశ్వర రెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, శ్రీరామ్ గ్రూప్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్‌తో విద్యా సంస్థ విధ్వంసం

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ‘దిమాగీ నక్సల్స్’ (మేధో నక్సల్స్) వ్యాఖ్యలను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు ప్రధాన మంత్రి సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. అదే సమయంలో విశ్వవిద్యాలయాలు సహా అనేక సంస్థలలోకి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చొరబడుతోందని మండిపడ్డారు. బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాజా సోమవారం స్పందిస్తూ ‘కాంగ్రెస్ ముక్త్ భారత్’ నుంచి ‘నక్సల్ ముక్త్ భారత్’కు ప్రభుత్వం నినాదాలు మార్చడాన్ని, దిమాగీ నక్సల్స్ ఉన్నారన్న తాజా వాదనను ప్రశ్నించారు. ‘మోదీ దేశ ప్రధాన మంత్రి. ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు సిగ్గుపడాలి. హోం మంత్రి అమిత్ షా నక్సల్ ముక్త్ భారత్ (నక్సల్ రహిత భారత్) గురించి మాట్లాడారు. అంతకు ముందు ‘కాంగ్రెస్ ముక్త్ భారత్’ అని చెప్పారు. ఆ తర్వాత ‘నక్సల్ ముక్త్ భారత్’ అన్నారు. ఇప్పుడు ప్రతి చోటా ‘దిమాగీ నక్సల్స్’ (భావజాల పరమైన నక్సల్స్) ఉన్నారని చెబుతున్నారు’ అని రాజా విమర్శించారు. అన్ని సంస్థలను స్వాధీనం చేసుకుంటున్నారని మండిపడ్డారు. నియామకాలు జరుగుతున్న తీరును ప్రశ్నిస్తూ విద్యాసంస్థల్లోకి ఆర్‌ఎస్‌ఎస్ చొరబడుతోందన్నారు. ‘అన్ని సంస్థలను వారు స్వాధీనం చేసుకుంటున్నారు. విధ్వంసం జరుగుతోంది. కానీ నేను మోదీకి చెప్పాలనుకుంటున్నాను. ఆర్‌ఎస్‌ఎస్‌తో ఏం జరుగుతోందో మీరు తప్పక పరిశీలించాలి. విశ్వవిద్యాలయాలు సహా అన్ని సంస్థలలోకి ఆర్‌ఎస్‌ఎస్ చొరబడుతోంది. నియామకాలు జరుగుతున్న తీరు గురించి ఉపాధ్యాయ ప్రతినిధులను, విద్యార్థులను అడగండి’ అని రాజా అన్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారిపై ‘దిమాగీ నక్సల్స్’ ముద్ర వేస్తూ... ఆ పదాన్ని ఉపయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ‘మోదీ ఇలాంటి అసంబద్ధమైన ప్రకటనలు చేయడం ఆపాలి. ఎందుకు ఇలా జరుగుతోంది? ఎన్నో ఏళ్లుగా ఇలాగే కొనసాగుతోంది. దీనిపై మోదీ దృష్టి సారించి, ప్రజలకు సమాధానం చెప్పాలి’ అని రాజా డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాలను కించపరచడం ప్రధాని హోదాకే అవమానం:కె.రామకృష్ణ

నక్సలిజాన్ని అంతం చేశామని ఒక వైపు గొప్పలు చెప్పుకుంటూ మరోవైపు ‘దిమాగీ నక్సల్స్’ పేరుతో ప్రతిపక్షాలపై బురదజల్లడం ప్రధాని మోదీ రాజకీయ ద్వంద్వ వైఖరికి పరాకాష్ట అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. దేశ ప్రజలు దీపావళి సంబరాల్లో మునిగితేలుతున్న శుభవేళ సైనికుల సమక్షంలో ప్రతిపక్షాలను కించపరిచేలా మాట్లాడటం ప్రధాని హోదాకు తగదన్నారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి తన హోదాను మరిచి ప్రతిపక్షాలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ‘దిమాగీ నక్సల్స్’ పేరుతో ప్రశ్నించే వారందరిపై నిర్బంధకాండ ప్రయోగించేందుకు సిద్ధపడటం దుర్మార్గమని రామకృష్ణ విమర్శించారు. లొంగిపోయిన మాజీ నక్సలైట్లకు ప్రభుత్వం ప్రకటించిన సరెండర్, పునరావాస ప్యాకేజీని అమలు చేయాలని ఆయన కోరారు. లొంగిపోయిన నక్సలైట్లపై నిరంతరం పోలీసుల నిఘా కొనసాగిస్తూ, ప్రజల్లో స్వేచ్ఛగా తిరగనీయకుండా చేయడం వల్ల వారు తిరిగి అడవుల బాట పట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు.

మహారాష్ట్రలో బిజెపి కూటమి ‘ఎలక్షన్ చోరీ’

- గోకుల్ డెయిరీ చైర్మన్‌గా రాజేశ్ పాటిల్ ఎన్నిక
- అప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచారు: శశికాంత్ ఘుయేకర్ విమర్శ



కొల్హాపూర్:మహారాష్ట్ర కొల్హాపూర్‌లో అత్యంత వివాదాస్పద రాజకీయాంశంగా మారిన గోకుల్ డెయిరీ చైర్మన్ పదవిని అధికార బిజెపి మహాయుతి కూటమికి చెందిన ఎన్‌సిపి నాయకుడు,శాసనసభ మాజీ సభ్యుడు రాజేశ్ పాటిల్ ఓట్‌చోరీతో దక్కించుకున్నారు.పాటిల్‌కు 16 ఓట్లు వచ్చాయని బిజెపి నాయకుడు,రాజ్యసభ ఎంపి ధనంజయ్ మహాదిక్ పత్రికలకు చెప్పారు. చైర్మన్‌గా గెలిచిన రాజేశ్ పాటిల్ మాట్లాడుతూ, రాజకీయాలను పక్కనపెట్టి మొత్తం 25 మంది డైరెక్టర్లతో, నలుగురు ప్రభుత్వ ప్రతినిధులు, మరో ఇద్దరు కో–ఆప్టెడ్ డైరెక్టర్లతో కలిసి పనిచేస్తానని చెప్పారు.ఓటమి చెందిన ‘రాజర్షి షాహు షేత్కరీ సంవిచారి అఘాడీ’ అభ్యర్థి శశికాంత్ ఘుయేకర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విరుద్ధంగా అక్రమ పద్ధతులలో మహాయుతి కూటమి చైర్మన్ పదవిని స్వాధీనం చేసుకుందని విమర్శించారు. వారు ప్రజాస్వామ్యన్ని నమ్ముకోలేదని, బలాన్ని, అధికారాన్ని ఉపయోగించి ఈ ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు. తన ఏడాది పదవీకాలంలో పాడి రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తానని,సహకార వ్యవస్థను, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడతానని గెలుపొందిన పాటిల్ చెప్పారు. గడచిన ఏడాదికాలంగా సహకార సంస్థ నష్టాలను రికవరీల ద్వారా భర్తీచేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలు, విభేదాలు పక్కనపెట్టి పాడి రైతుల మేలుకోసం కలిసి పనిచేయాలని ప్రతిపక్ష కాంగ్రెస్‌కు పాటిల్ విజ్ఞప్తి చేశారు. గోకుల్ డెయిరీ వార్షిక సమావేశం వచ్చేనెలలో జరుగుతుందని ఆయన చెప్పారు. వంతులవారీగా మహాయుతి కూటమి పార్టీలు ఈ చైర్మన్ పదవీ బాధ్యతలు నిర్వహిస్తాయి.ప్రభుత్వం నామినేటెడ్ సభ్యులను నియమించడంవల్ల కోరం ఉండదనే భయాలు తొలగిపోయాయని, ఇక సమావేశాల్లో ప్రతిష్ఠంభన ఏర్పడబోదని ఎంపీ ధనంజయ్ మహాదిక్ చెప్పారు. నామినేటెడ్ సభ్యుల నియామకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ సమస్యను పరిష్కరించారని,ఈ ఘనత వారికే దక్కుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో డెయిరీ పాలకవర్గంలో మెజార్టీ పదవులు సంపాదించిన కాంగ్రెస్‌పార్టీని అధికారం చేపట్టకుండా అడ్డుకునేందుకు దొడ్డిదారిలో ఐదుగురు ప్రభుత్వ ప్రతినిధులను నామినేట్ చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసి వారిలో నలుగురికి డైరెక్టర్స్ బోర్డులో ఓటు హక్కు కల్పించడం ద్వారా అధికార మహాయుతి కూటమి చైర్మన్ పదవిని దక్కించుకుంది. పాటిల్‌కు ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన 12 మంది డైరెక్టర్ల ఓట్లతోపాటు ప్రభుత్వం నామినేట్ చేసిన ప్రతినిధుల నాలుగు ఓట్లు కూడా లభించడంతో మొత్తం 16 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థికి ఎన్నికల్లో గెలిచిన సభ్యుల 13 ఓట్లు లభించాయి. నామినేటెడ్ సభ్యులను నియమిస్తూ గవర్నర్ జారీ చేసిన ఆర్డినెన్స్‌ను స్తంభింపజేసేందుకు సోమవారంనాడు బోంబే హైకోర్టు తిరస్కరించింది. ఐతే నామినేటెడ్ ప్రతినిధులు (డైరెక్టర్స్)ఓటింగ్‌లో పాల్గొంటారని, కానీ వారికి విడిగా ఒక బ్యాలెట్ బాక్సు ఏర్పాటు చేయాలని ఔరంగాబాద్ హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.దీంతో మంగళవారం జరిగిన ఎన్నికల్లో పాటిల్ గెలిచారు. అక్టోబరు 19వ తేదీన గోకుల్ డెయిరీ పాలకవర్గానికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ 13 స్థానాలు గెలుచుకుని స్వల్ప ఆధిక్యం సంపాదించగా,బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి 12 స్థానాలకు పరిమితమైంది.దీంతో ప్రజాస్వామ్యబద్ధమైన తీర్పును తలక్రిందులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నలుగు ప్రభుత్వ ప్రతినిధులను డైరెక్టర్స్‌బోర్డులోకి ఓటు హక్కులు కల్పించి చొప్పించింది. ప్రభుత్వం ప్రజాతీర్పును అపహాస్యం చేసిందని,అక్రమ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ వేలాదిమంది పాడిరైతులు ప్రతిఘటిస్తూ కొల్హాపూర్‌లో సోమవారం భారీ ర్యాలీ చేశారు. సహకార ప్రజాస్వామ్య వ్యవస్థపై పట్టపగలే ఘోరమైన దాడి చేశారని ప్రభుత్వాన్ని పాడి రైతులు తీవ్రంగా విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు, డెయిరీ రైతుల నుండి కాంగ్రెస్‌కు భారీ మద్దతు లభించినప్పటికీ అధికారబలమే చైర్మన్ ఎన్నికల్లో గెలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యశాఖామంత్రి హసన్ ముష్రిఫ్ చైర్మన్ పాటిల్‌కు అభినందనలు తెలియజేశారు. నలుగురు సభ్యుల నియామకాన్ని ఆయన సమర్థించారు.దీనివల్ల సమావేశాల్లో క్వారం సమస్య ఉండబోదని అన్నారు.

వందేళ్ల తర్వాత భారత్‌కు 39 మంది

నాగా పూర్వీకుల అవశేషాలు

న్యూఢిల్లీ: వందేళ్లకుపైగా తమ మ్యూజియంలో భద్రపరిచిన నాగా తెగలకు చెందిన 39 మంది పూర్వీకుల అవశేషాలను యుకెలోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తిరిగి అప్పగించింది. పిట్ రివర్స్ మ్యూజియంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ‘ఫోరం ఫర్ నాగా రికన్సిలియేషన్ (ఎఫ్ఎన్ఆర్)’, నాగా హోహో సంస్థలకు ఈ అవశేషాలను అధికారికంగా అందజేసింది. వాటిని నాగాలాండ్‌కు తరలిస్తున్నట్లు ఎఫ్ఎన్ఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అప్పగింతను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి, నాగా ప్రజలకు మధ్య ఉన్న సంబంధాల్లో ఓ చరిత్రాత్మక ఘట్టంగా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఐరీన్ ట్రేసీ అభివర్ణించారు. బ్రిటిష్ వలస పాలనలో తన సొంత గ్రామాన్ని ఎలా తగులబెట్టారో ఎఫ్ఎన్ఆర్ ప్రతినిధి వైసియర్ సాన్యు గుర్తుచేసుకున్నారు. ఇదిలావుంటే నాగాలాండ్ రాజధాని కోహిమాలోని ‘నాగా సాలిడారిటీ పార్కు’ లో ఆ అవశేషాల ఖననం కోసం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

వాహన కాలుష్య నియంత్రణకు తక్షణజోక్యం

ఢిల్లీ, మూడు పొరుగు రాష్ట్రాలకు ‘సుప్రీం’ ఆదేశం

కాలం చెల్లిన వాహనాలను అడ్డుకోండి

న్యూఢిల్లీ:వాహనాల కాలుష్యం విపరీతంగా పెరిగినందువల్ల తక్షణం జోక్యం చేసుకోవాలని ఢిల్లీ, దాని పొరుగున్న ఉన్న మూడు రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. పాతబడిన,కాలం చెల్లిన వాహనాలను నియంత్రించే విషయంలో ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు ఏమిటో తమకు తెలియజేయాలని సుప్రీం కోర్టు ధర్మాసనం మంగళవారం కోరింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేస్తూ, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల ప్రభుత్వాలకు, ఢిల్లీ నగరపాలక సంస్థలు తీసుకున్న స్వల్పకాలిక,దీర్ఘకాలిక చర్యల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరింది. ఎక్కడెక్కడ వాహనాలను వ్యక్తిగతంగా తనిఖీలు చేస్తున్నారో కూడా తెలియజేయాలని కోరింది. కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్స్ ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని కోరింది. వాణిజ్య, వాణిజ్యేతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని,వాటి కాలుష్య పరిమాణాలు, కాలం చెల్లిన వాహనాలను రాజధానిలో ప్రవేశించకుండా అడ్డుకోవాలని, ఈ విషయాలు గమనించాలని పేర్కొంది. అదేవిధంగా తమకు సమర్పించిన డేటా ప్రకారం ఢిల్లీ వ్యాప్తంగా, చుట్టుపక్కల ఉత్తర ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్‌లలో రైతులు దగ్ధం చేసే వ్యర్థాలు తగ్గాయని పేర్కొంది. ఈ పరిణామం ప్రశంసించదగినదని, వాహన కాలుష్యం కూడా తగ్గించాలని కోరింది. ఉల్లంఘనలకు పాల్పడే వాహనాలపై దృష్టి పెంచాలని తెలియజేసింది.ఉమ్మడిగా, సమన్వయ చర్యలు తీసుకోవాలని కోరింది. వాహన కాలుష్యానికి సంబంధించి ఎవరైనా స్వచ్ఛంధంగా వచ్చి కేసులు నమోదు చేయాలనుకుంటే కేసులు నమోదు చేయాలని, తమ దృష్టికి వస్తే ఎవరి ప్రమేయం లేకుండా కేసులు నమోదు చేయాలని సుప్రీం కోర్టు రిజిస్ట్రీకి కూడా ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలను దగ్ధం చేస్తే, బాణసంచా కాలిస్తే నవంబరు 25న ఆ కేసులను లిస్టులో చేర్చాలని కోరింది.

ఫిబ్రవరి 15 నుంచి

సిఐఎస్‌సిఇ టెన్త్ పరీక్షలు

న్యూఢిల్లీ : కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్ (సిఐఎస్‌సిఇ) మంగళవారం నాడు 2027 బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. 10వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుండి, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 9 నుండి ప్రారంభం కానున్నాయి. ఈ రెండు పరీక్షలకు మొత్తం 3,79,980 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 10వ తరగతి పరీక్షలకు 3,106 అనుబంధ పాఠశాలల నుండి 2.70 లక్షల మంది విద్యార్థులు, అలాగే ఐఎస్‌సి 12వ తరగతి పరీక్షలకు 1,651 పాఠశాలల నుండి 1.1 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. ఐసిఎస్‌ఇ పరీక్షలో మొత్తం 76 సబ్జెక్టులు లేదా పేపర్లు ఉండగా, ఐఎస్‌సి పరీక్షలో 60 సబ్జెక్టులు ఉంటాయి. 2027వ సంవత్సరానికి సంబంధించిన ఐసిఎస్‌ఇ పరీక్షలు 2027 ఫిబ్రవరి 15న ప్రారంభమై, మార్చి 31న ముగుస్తాయి. ఈ పరీక్షలను భారత్, విదేశాలలో ఉన్న మొత్తం 2,835 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు. ‘ఒక పరీక్షా విధానం విశ్వసనీయత అనేది దాని ప్రక్రియలలోని నిష్పక్షపాతం, నిర్వహణలోని నిజాయితీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థలలో అది కలిగించే నమ్మకంపై ఆధారపడి ఉంటుంది’ అని సిఐఎస్‌సిఇ చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెక్రటరీ జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ పేర్కొన్నారు. ఐసిఎస్‌ఇ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అత్యధికంగా ఉత్తరప్రదేశ్ (51,168), పశ్చిమ బెంగాల్ (46,521), కర్ణాటక (33,417), మహారాష్ట్ర (31,035), పంజాబ్ (19,308), జార్ఖండ్ (17,201) రాష్ట్రాల నుండి ఉన్నారు. 2027వ సంవత్సరానికి సంబంధించిన ఐఎస్‌సి పరీక్షలు ఫిబ్రవరి 9న ప్రారంభమై, ఏప్రిల్ 8న ముగుస్తాయి. భారతదేశం, విదేశాలలో ఉన్న 1,477 పరీక్షా కేంద్రాలలో, 1,651 అనుబంధ పాఠశాలల నుండి మొత్తం 1,10,025 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.రాష్ట్రాల వారీగా చూస్తే, ఉత్తరప్రదేశ్ నుండి అత్యధిక సంఖ్యలో (34,702) ఐఎస్‌సి అభ్యర్థులు ఉన్నారు.

డిజిటల్ అరెస్ట్‌ల నివారణకు చర్యలు సూచించండి

వాట్సాప్, ఇతరులను కోరిన ‘సుప్రీం’



న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ అరెస్ట్ కుంభకోణాలు, సంబంధిత సైబర్ నేరాలను నివారించడానికి తాము ప్రతిపాదించిన చర్యల గురించి తెలియజేయాలని సుప్రీంకోర్టు వాట్సాప్, ఇతర మధ్యవర్తులను కోరింది. ‘నకిలీ డాక్యుమెంట్లకు సంబంధించిన డిజిటల్ అరెస్ట్ బాధితులు’ అనే పేరుతో అక్టోబరు 29న సుమోటోగా స్వీకరించిన కేసులో నిర్వహించిన విచారణకు సంబంధించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఒక ఉత్తర్వులో ‘భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, వాట్సాప్, దాని ఇతర మధ్యవర్తులు తమ ప్రతిపాదనలను ఏకకాలంలో 14సి (ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్)కి సమర్పించాలని కోరింది. న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహన కూడా సభ్యులుగా ఉన్న ఈ త్రిసభ్య ధర్మాసనం , ఈ పిటిషన్‌ను తదుపరి పరిశీలన కోసం నవంబరు 23వ తేదీకి జాబితా చేసింది. వాట్సాప్ తరుపున్న హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, 9,400 అకౌంట్లపై చర్యలతో సహా, తమ ప్లాట్‌ఫారమ్ నివారణ చర్యలు తీసుకుందని, చేపట్టిన చర్యల వివరాలను తెలియజేస్తూ ఒక అఫిడవిట్ దాఖలు చేయనున్నదని ధర్మాసనానికి తెలియజేశారు. అనుమానాస్పద ఖాతాలను గుర్తించి, వినియోగదారులను హెచ్చరించే సాఫ్ట్‌వేర్‌పై ఆ ప్లాట్‌ఫారం పనిచేస్తున్నదని కపిల్ సిబల్ చెప్పారు. ‘డిజిటల్ అరెస్ట్ కుంభకోణాలు, సంబంధిత సైబర్ నేరాలను నివారించడానికి తాము చేపట్టదలచిన చర్యల గురించి ఈ కోర్టుకు తెలియజేయాలని వాట్సాప్ ఎల్‌ఎల్‌సి (ఎ మెటా కంపెనీ), ఇతర సంబంధిత మధ్యవర్తులను కూడా ఆదేశిస్తున్నాం. వారు తమ ప్రతిపాదనలను ఏకకాలంలో 14సి కూడా సమర్పించాలి ’అని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణాలు, ఇతర సైబర్ మోసాలకు ఆర్థిక సంస్థలు జవాబుదారీగా ఉండాలని, అలాగే సంస్థ తగిన శ్రద్ధ వహించడంలో విఫలం అవడం వల్లే మోసం జరిగిందని దర్యాప్తులో తేలిన పక్షంలో, బాధితులకు జరిగిన నష్టానికి బ్యాంకులు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అక్టోబరు 29న సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రతిపాదించిన నియంత్రణ చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని పునరుద్ఘాటిస్తున్నాం, నొక్కిచెబుతున్నాం. ఒక చర్య /సంఘటనను నివారించడంలో లేదా నివేదించడంలో ఆర్థిక సంస్థ తగిన శ్రద్ధ వహించడంలో విఫలం అవడం వల్ల మోసం లేదా నేరం జరిగిందని రుజువైనప్పుడు, డిజిటల్ అరెస్ట్ కుంభకోణాలు, ఇతర సైబర్ మోసాల బాధితులకు ఆర్థిక సంస్థలు నష్టపరిహారం చెల్లించాల, కస్టమర్ కోల్పోయిన మొత్తానికి తక్కువ కాకుండా గుర్తించదగిన పరిహారాన్ని చెల్లించాలని కోరే తగిన నిబంధనలను కార్పొరేట్‌స్థాయిలో చేర్చాలి’ అని బెంచ్ తన ఉత్తర్వులో పేర్కొంది. విచారణ సందర్భంగా, తమ నిర్ధారిత లావాదేవీల పద్ధతులకు విరుద్ధంగా వినియోగదారులు అకస్మాత్తుగా, అసాధారణంగా పెద్దమొత్తంలో డబ్బు బదిలీ చేయడానికి ప్రయత్నించినప్పుడు బ్యాంకులు ఎందుకు జోక్యం చేసుకోలేకపోయాయని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. ఆర్‌బిఐ ప్రతిపాదించిన నియంత్రణ చర్యలు, అలాగే, జారీ చేసిన ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు, తదుపరి విచారణ తేదీన అన్ని అధీకృత ఆర్థిక సంస్థల జాబితాను ఈ కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం ఆర్‌బిఐని ఆదేశించింది. ఈ ఆదేశాలను నవంబరు 30 నాటికి నోటిఫై చేసి, డిసెంబరు 31నాటికి అమలులోకి తీసుకురావాలని ప్రతిపాదించబడింది.

‘మాదకద్రవ్యాల ముప్పు’పై సంయుక్తంగా చర్యలు


భారత్ –అమెరికా ప్రతిన

న్యూఢిల్లీ : మాదకద్రవ్యాలకు సంబంధించి తలెత్తుతున్న ముప్పులను ఎదుర్కోవడానికి సమన్వయంతో కూడిన చర్యలు చేపట్టేందుకు భారత్–అమెరికా అంగీకరించాయి. ఇక్కడ ఇటీవల ముగిసిన ఉన్నత స్థాయి సమావేశంలో ఇరుదేశాలు ప్రతినబూనాయి. నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) నవంబరు 2–3 తేదీలలో 2వ భారత్–అమెరికాడ్రగ్ పాలసీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని నిర్వహించిందని, ఫెడరల్ మాదక ద్రవ్యాల నిరోధక సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. భారత ప్రతినిధి బృందానికి ఎన్‌సిబి డైరెక్టర్ జనరల్ అనురాగ్ నాయకత్వం వహించగా, అమెరికా బృందానికి ఆఫీస్ ఆఫ్ నేషనల్ డ్రగ్ కంట్రోల్ పాలసీ (ఒఎన్‌డిసిపి) యాక్టింగ్ డిప్యూటీ డైరెక్టర్ డెబ్బీ సెగిన్ నేతృత్వం వహించారు.భారత్–అమెరికా మాదక దవ్యాల విధాన చట్రం విధివిధానాలకు అనుగుణంగా, అక్రమ మాదక ద్రవ్యాల రవాణాను ఎదుర్కోవడంంలో ద్వైపాక్షిక సహకారాన్ని ఈ సమావేశం సమీక్షించిందని, అలాగే, నిఘా సమాచార మార్పిడిని బలోపేతం చేయడం, సమన్వయంతో కూడిన చట్ట అమలు చర్యలు, ముడి పదార్థాల నియంత్రణ, ఔషధ సరఫరా గొలుసు సమగ్రత, మాదక ద్రవ్యాల డిమాండ్‌ను తగ్గించడం వంటి ప్రాధాన్యతా రంగాలను గుర్తించిందని ఆ ప్రకటన తెలిపింది. ‘ఉద్భవిస్తున్న మాదకద్రవ్యాల ముప్పులను ఎదుర్కోవడానికి, డిమాండ్ తగ్గించడాన్ని ప్రోత్సహించడానికి నిరంతర సంస్థాగత భాగస్వామ్యం, సకాలంలో నిఘా సమాచార మార్పిడి, సమన్వయ చర్యల ప్రాముఖ్యతను ఈ సమావేశం నొక్కి చెప్పింది’ అని ప్రకటన తెలిపింది. ‘చట్ట అమలు అంశాలలో ఉత్తమ పద్ధతులను మరింతగా పంచుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి’అని అది పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మార్గదర్శకత్వంలో, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా నాయకత్వంలో రూపొందించిన ఇండియా విజన్ రోడ్ మ్యాప్ 2026–2029ను ఎన్‌సిబి డిజి ప్రముఖంగా ప్రస్తావించారు. ‘అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణ నెట్‌వర్క్‌ను అడ్డుకోవడానికి, అలాగే, సింథటిక్ డ్రగ్స్, రసాయనిక పూర్వగాములను ప్రపంచ మార్కెట్లలోకి మళ్లించడాన్ని నిరోధించడానికి, అమెరికా, భారతదేశాల మధ్య కార్యనిర్వాహక కార్యవర్గం, ద్వైపాక్షిక సహకారం చాలా కీలకమైనవి’ అని ఒఎన్‌డిసిపి డైరెక్టర్ సారా కార్టర్ అన్నారు.‘అక్రమ మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను వాటి మూలంలోనే అరికట్టడంతో మొదలు అవుతుంది’ అని భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ప్రకటనలో తెలిపారు.

వాయు కాలుష్యంలో ఢిల్లీ ఎందుకు

‘విశ్వగురువు’గా మారుతోంది?

మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడిన ఖర్గే
‘గాలి లెక్క’ చెప్పే ధైర్యం ప్రధానికి ఉందా అని నిలదీత



న్యూఢిల్లీ : దేశ రాజధానిలో ఢిల్లీ రోజు రోజుకు వాయు కాలుష్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వాయు కాలుష్యంలో ఢిల్లీ ఎందుకు ‘విశ్వగురువు’గా మారుతోందని, దేశానికి ‘గాలి లెక్క’ చెప్పే ధైర్యం ప్రధాని నరేంద్ర మోదీకి ఉందా అని ప్రశ్నించారు. దీపావళి తర్వాత పెరుగుతున్న కాలుష్య స్థాయిలతో ఢిల్లీ పోరాడుతోంది. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను కాల్చడం కూడా ఈ పరిస్థితి మరింత దిగజారడానికి దోహదపడుతోంది. ఈ క్రమంలో కాలుష్య సమస్యను పరిష్కరించడానికి మోదీ ప్రభుత్వం పాక్షిక చర్యలే తీసుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ‘వాయు కాలుష్యంలో మనం ఎందుకు ‘విశ్వగురువు’గా మారుతున్నాం? పాక్షిక చర్యలు, ప్రచార ఎత్తుగడలు, ఇచ్చిన మాట తప్పడం, ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం బిజెపికి నైజంగా మారాయి’ అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. స్వచ్ఛమైన గాలి ప్రాథమిక హక్కు, ప్రభుత్వం ప్రసాదించే ప్రత్యేక హక్కు కాదు అని అన్నారు. గత సంవత్సరం, కాలుష్య గణాంకాలను కడిగివేస్తున్నారన్న ఆరోపణల మధ్య ఎక్యూఐ పర్యవేక్షణ కేంద్రాల చుట్టూ నీటి ట్యాంకర్లతో నీటిని చల్లారు, కానీ, ఈ సంవత్సరం కాలుష్యం గరిష్ట స్థాయికి చేరినప్పుడు, ఢిల్లీలోని 59 పర్యవేక్షణ కేంద్రాలలో 36 కేంద్రాల నుండి పిఎం 2.5 రీడింగ్‌లు పూర్తిగా మాయమయ్యాయని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ వాయు కాలుష్య సమస్యపై కేవలం మాటలకే పరిమితమయ్యారని, 2019 మే 8న ప్రధాని మోదీ దీనిని ప్రధాన సవాలుగా గుర్తించారు, కానీ ఆయన ప్రభుత్వం ఆ దిశగా ఏమీ చేయలేదని దుయ్యబట్టారు. ఢిల్లీ–ఎన్‌సిఆర్ నుండి ఉత్తరప్రదేశ్, బిహార్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ వరకు ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం అల్లాడుతున్నారని కాంగ్రెస్ అధినేత ఆందోళన వ్యక్తం చేశారు. ‘మోదీజీ దేశానికి ‘గాలికి లెక్క’ చెప్పే ధైర్యం చేస్తారా? అని ఖర్గే నిలదీశారు. ‘వాస్తవాలు ఎంత ఆందోళనకరంగా ఉన్నాయో, అంతే సిగ్గుచేటుగా కూడా ఉన్నాయి: 2023లో ఢిల్లీలో సంభవించిన 17,188 మరణాలకు వాయు కాలుష్యమే కారణమని అంచనా వేయబడింది. ఇది మొత్తం మరణాలలో దాదాపు 15 శాతం (అన్ని వయసుల వారు). 2021లో భారతదేశం అంతటా, ఐదేళ్ల లోపు వయసున్న 1,69,400 మంది పిల్లలు వాయు కాలుష్య సంబంధిత కారణాలతో మరణించారు (స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2024). ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో, పిఎం 2.5 ప్రభావానికి గురికావడం వల్ల ఊపిరితిత్తుల అభివృద్ధి దెబ్బతినడం, శిశు మరణాల ప్రమాదం పెరగడం వంటి వాటితో సంబంధం ఉందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సెప్టెంబర్ 2026 నాటి ఒక ఆర్‌టిఐ సమాధానం ప్రకారం, ఢిల్లీ పర్యావరణ నష్టపరిహార వసూళ్లలో దాదాపు 60 శాతం అంటే రూ. 1,154 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయాయి. డిసెంబర్ 2025 వరకు విడుదల చేసిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమ నిధులలో ఢిల్లీ కేవలం 17 శాతాన్ని మాత్రమే వినియోగించుకుంది’ అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి వివరణాత్మక స్పందనలు, ప్రతిపాదిత చర్యలను సమర్పించేందుకు బిజెపి పాలిత ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లకు సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చిందని ఖర్గే తెలిపారు.

ఢిల్లీలో మెరుగుపడిన.. గాలి నాణ్యత

299గా ‘ఎక్యూఐ’ నమోదు

న్యూఢిల్లీ : ఢిల్లీలో మంగళవారం గాలి నాణ్యత మెరుగుపడి ‘పూర్’ కేటగిరీలోకి చేరింది. 24 గంటల సగటు గాలి నాణ్యతా సూచిక (ఏక్యూఐ) 299గా నమోదు అయ్యింది. ఇది ‘వెరీ పూర్’ కేటగిరీ పరిమితికి కొంచెం దిగువన ఉంది. రాబోయే కొన్ని రోజుల్లో గాలి నాణ్యత మరింత మెరుగుపడే అవకాశం ఉందని, గాలి వేగం పెరగడమే దీనికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. స్కైమెట్ వైస్ ప్రెసిడెంట్, వాతావరణ నిపుణుడు అయిన మహేశ్ పలవత్ మాట్లాడుతూ, ‘గాలి దిశ, వేగం మారాయి. ఇప్పుడు గంటకు 12నుంచి 14గంటల కిలోమీటర్ల సగటు వేగంతో వాయువ్య గాలులు ఢిల్లీ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇది కాలుష్య కారకాల వ్యాప్తికి సహాయపడింది’ అని పేర్కొన్నారు. రాబోయే రెండు రోజులు గాలి వేగం అధికంగానే ఉండే అవకాశం ఉందని, దీనివల్ల ఏక్యూఐ మరింత మెరుగుపడే అవకాశం ఉందని పలవత్ తెలిపారు. ఢిల్లీ వాయు నాణ్యత ముందస్తు హెచ్చరిక వ్యవస్థ (ఇడబ్ల్యుఎస్) ప్రకారం, గాలిలోని పార్టిక్యులేట్ మ్యాటర్ సాంద్రతలు పిఎం2.5, పిఎం 10–కూడా రాబోయే రెండు రోజుల్లో తగ్గుముఖం పట్టనున్నాయి. కాగా, మంగళవారం డేటాను నమోదు చేసిన 58 పర్యవేక్షణ కేంద్రాలలో 28 కేంద్రాలు ‘వెరీ పూర్’ కేటగిరీలో, ‘పూర్’ కేటగిరీలో 28 కేంద్రాలు, రెండు కేంద్రాలు మితమైన కేటగిరీలో ఉన్నాయి. ఏ పర్యవేక్షణ కేంద్రం కూడా ‘తీవ్రమైన’ గాలి నాణ్యతను నమోదు చేయలేదు. ఢిల్లీ కంటోన్మెంట్ ప్రాంతం, శ్రీ అరబిందో మార్గ్‌లోని గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు ‘మితమైన’ గాలి నాణ్యతను నమోదు చేశాయి. ఈ ప్రదేశాలలో సగటు గాలి నాణ్యత సూచిక వరుసగా 135, 155గా నమోదు అయ్యింది. నగర సగటు గాలి నాణ్యత సూచిక సోమవారం నాటి 344 నుంచి మంగళవారం నాటికి 299కి మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) ప్రకారం...‘0’ నుంచి 50’ మధ్య గాలి నాణ్యత సూచికను ‘గుడ్’, 51 నుంచి 100 మధ్య ‘సంతృప్తికరమైనది’, 101 నుంచి 200 మధ్య ‘మితమైనది’, 201 నుంచి 300 మధ్య ‘పేలవం’ (పూర్), 301 నుంచి 400 మధ్య ‘చాలా పేలవం’ (వెరీపూర్), 401 నుంచి 500 మధ్య ‘తీవ్రమైనది’గా వర్గీకరించారు. జాతీయ సాట్థయిలో మంగళవారం రాజధానిలో పిఎం 10 ప్రధాన కాలుష్యకారకంగా ఉంది.ఢిల్లీకి సంబంధించి డిసీషన్ సపోర్ట్ సిస్టమ్ (డిఎస్ఎస్) మంగళవారంనాడు 18శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణంగా నిలువనుంది.

ట్రంప్‌నకు కోర్టు అనుమతి

వాషింగ్టన్:వలసల నిర్మూలనకు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన సరిహద్దు గోడ నిర్మాణం తిరిగి ప్రారంభించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించింది.టెక్సాస్‌లోని బిగ్ బెండ్ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర తీరం నుండి గల్ఫ్ ఆఫ్ మెక్సికో వరకూ ఈ సరిహద్దు గోడ నిర్మించాలని ట్రంప్ తలపెట్టారు.కానీ ఈ విషయం న్యాయస్థానం వరకూ వెళ్ళింది. ఇప్పుడు సుప్రీంకోర్టు ట్రంప్‌కు అనుమతి ఇచ్చింది.ఈ గోడ నిర్మాణం వృథాఅనీ,విశిష్టమైన ప్రకృతి సౌందర్యానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని వాదించిన పక్షాలకు కోర్టుతీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశంలోకి వలసలు నిర్మూలించేందుకు ప్రతిజ్ఞచేసిన ట్రంప్ ఈ గోడ నిర్మించాలని ఏనాటి నుండో వాదిస్తున్నారు. వాహనాలను నిరోధించే నిర్మాణాలు,కొత్త రోడ్ల నిర్మాణాలు ఉంటాయి.వలసలు తక్కువగా ఉన్న ప్రాంతాలలో ఈ అడ్డుగోడ నిర్మాణం చేయడంలేదు.

ఎంసిసి ఆంక్షలు, నిషేధాలు మరికొంతమంది ఉద్యోగులకు వర్తింపు

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద విధించే ఆంక్షలు, నిషేధాలు మరికొంత మంది ఉద్యోగులకు కూడా వర్తించనున్నాయి. కొందరు తమ అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) కింద ప్రస్తుతం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ఆంక్షలు, నిషేధాలను ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన ఉద్యోగంలో ఉన్న లేదా తిరిగి ఉద్యోగంలో చేరిన పదవీ విరమణ పొందిన అధికారులకు, వ్యక్తులకు కూడా ఎన్నికల సంఘం విస్తరించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో వివిధ హోదాలలో రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల పనులలో నిమగ్నమైన అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారని గతంలో ఫిర్యాదులు వచ్చాయని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఎన్నికలు జరగనున్న గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ప్రధాన ఎన్నికల అధికారులకు ఈనెల 9న రాసిన లేఖలో అలాంటి వ్యక్తులు రాజకీయ తటస్థతను పాటించాలని, ఎన్నికల ప్రచారాలలో లేదా ఓట్ల లెక్కింపులో పాల్గొనకుండా ఉండాలని కమిషన్ పేర్కొంది. ఎన్నికలు ప్రకటించబడిన నియోజకవర్గం లేదా జిల్లాకు చెందిన ఏ ఎన్నికల సంబంధిత అధికారిని కూడా అధికారిక చర్చలు లేదా సమావేశాల కోసం ఈ వ్యక్తులు పిలవకూడదని కూడా ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాంటి అధికారులతో వీడియో కాన్ఫరెన్సులు లేదా సమావేశాలు నిర్వహించడం కూడా వీరికి నిషిద్ధమని తెలిపింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించే ఏ చర్య లేదా లోపాన్ని అయినా తీవ్రంగా పరిగణిస్తామని కమిషన్ హెచ్చరించింది. వీటిని కచ్చితంగా పాటించేలా చూడాలని రాష్ట్రాలకు సూచించింది. ఫలితంగా, ఈ విధంగా తిరిగి ఉద్యోగంలో చేరిన వ్యక్తులు ఏ రాజకీయ పార్టీకి లేదా వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించడానికి తమ పేర్లను, అధికారిక పదవులను లేదా అధికారాన్ని ఉపయోగించలేరని అభిప్రాయపడింది. వారు ఎన్నికల ప్రచారంలో లేదా ఓట్ల లెక్కింపులో కూడా పాల్గొనలేరు.

బిసిలకు న్యాయం జరిగే వరకు
ఉద్యమం ఆగదు

కులగణన లేని జనగణన గెజిట్ మాకొద్దు..

కాపీలను చించివేసిన విహెచ్

రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనను అడ్డుకుంటే..

బిజెపి నేతలను రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వం



ప్రజాపక్షం/న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: బిసిలకు న్యాయం జరిగే వరకు ప్రాణాలు పోయినా సరే ఉద్యమాన్ని ఆపేది లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వి.హనుమంతరావు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఓబిసి కులగణన వివరాలను చేర్చకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ తమకు ఆమోదయోగ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కులగణన ప్రస్తావన లేని గెజిట్ ప్రతులను చించి తన నిరసనను వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనను బిజెపి నాయకులు అడ్డుకోవాలని చూస్తే, ఢిల్లీ నుంచి వచ్చే బిజెపి నాయకులను తెలంగాణలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చినప్పుడు తాము ఎప్పుడైనా అడ్డుకున్నామా? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడబోదని స్పష్టం చేశారు. జనగణనలో బిసిల వివరాలను ఎందుకు చేర్చలేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని విహెచ్ డిమాండ్ చేశారు. బిసిల హక్కుల విషయంలో బిజెపికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో కులగణన చేపట్టకపోవడం ద్వారా తేటతెల్లమైందని విమర్శించారు. గ్రామాలకు వచ్చే బిజెపి నాయకులను బిసి కులగణన అంశంపై నిలదీయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిసిలకు సామాజిక న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తహసీల్దార్ల పదోన్నతుల దస్త్రాన్ని ఆమోదించేలా చూడండి....

సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రిని కలిసిన ట్రెసా ప్రతినిధి బృందం



ప్రజాపక్షం/న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: తహసీల్దార్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం(ట్రెసా) ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ట్రెసా అధ్యక్షుడు కె.గౌతమ్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి ఎల్. రమన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డితో కూడిన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రిని మంగళవారం కలిసింది. తహసీల్దార్ల నుండి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులకు సంబంధించిన దస్త్రం సిఎంఒ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నదని,దీనిని ఆమోదించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనికి శేషాద్రి స్పందిస్తూ రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న 25 పోస్టుల భర్తీ అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి వేగవంతమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీనిచ్చినట్టు గౌతమ్ కుమార్ తెలిపారు. ఇతర శాఖల్లోని ఖాళీలకు సంబంధించి కూడా మరోసారి సంబంధిత అధికారులతో చర్చించి, సమగ్ర నివేదికను తెప్పించుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్టు ఆయన వివరించారు. తహసీల్దార్ల పదోన్నతుల సాధన దిశగా ట్రెసా తనవంతు ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తోందన్నారు.

రబీకి కొత్త రుణాలివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే ఆధారపడకుండా రైతు కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించేందుకు బ్యాంకులు సహకరించాలని కోరారు. ఈ సీజన్‌లో కనీసం 10 నుంచి 15 శాతం కుటుంబాలకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలన్నారు ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు అందించాలని కోరారు. రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి కల్పించేలా స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని సూచించారు. విద్యా, వ్యక్తిగత గృహ, ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాలు పెంచాలని, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కోరారు.

వ్యవసాయ రుణాల లక్ష్యాలను సాధించాలి: తుమ్మల

రైతులను ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కృష్ణా, గోదావరి నదులకు వరదలు రాకపోవడం, భూగర్భ జలాలు పడిపోవడంతో 10 నుంచి 15 లక్షల బోరుబావుల్లో నీరు అందని పరిస్థితి నెలకొందని తెలిపారు. రబీ సీజన్‌కు నిర్దేశించిన రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. సెప్టెంబర్ వరకు రూ.96,943 కోట్ల రుణ లక్ష్యంలో 53 శాతమే సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిమిత నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ సాగుకు విరివిగా రుణాలు ఇవ్వాలని, వాణిజ్య బ్యాంకులు కూడా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయిల్‌పామ్, పాడి, పౌల్ట్రీ, పశుపోషణ వంటి అనుబంధ రంగాలకు ఆర్థిక చేయూతనిచ్చి రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలని సూచించారు. గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం రూ.21 వేల కోట్ల పంట రుణ మాఫీ, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించిందని, వ్యవసాయ రంగంపై మొత్తం రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తుమ్మల తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, వ్యవసాయ శాఖల ముఖ్య అధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, రాహుల్ బొజ్జా, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, కె.సురేంద్ర మోహన్, ఎస్ఎల్‌బిసి అధికారులు మానస గంగోత్రి, చిన్మయ్ కుమార్, ఉదయ్ భాస్కర్, నీలేష్ ద్వివేది, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్ యుద్ధం దాదాపు ముగిసింది



- ఆ దేశానికి శిరచ్ఛేదం చేశాం
- అణుకార్యక్రమం ముగించేందుకు దీర్ఘకాలిక యత్నాలు
- వైట్‌హౌస్ పత్రికాగోష్ఠిలో ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధం దాదాపు ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఖతార్ ప్రధానమంత్రితో సమావేశం తర్వాత ట్రంప్ వైట్‌హౌస్‌లో పత్రికావిలేకరులకు సమాచారాన్ని తెలియజేసే గదిలోకి ఆకస్మికంగా ప్రవేశించారు. ఇరాన్‌తో సైనిక యుద్ధం దాదాపుగా ముగిసిపోయిందని తాను నమ్ముతున్నానని పాత్రికేయులకు చెప్పారు. ''ఇరాన్‌కు శిరచ్ఛేధం చేశాం, యుద్ధంలో ఆ దేశం సైనికంగా ఓడిపోయింది, మేం యథాతథ స్థితిని కొనసాగిస్తున్నాం'' అని చెప్పారు.ఐతే ఇరాన్ అణు కార్యక్రమానికి శాశ్వతంగా చరమగీతం పలికేందుకు దీర్ఘకాలిక పరిష్కారాల సాధనకు తాను ఇంకా ప్రయత్నాలు చేస్తున్నానని స్పష్టం చేశారు. అమెరికా కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల విజయభేరితో ఉభయసభలను వారు చేజిక్కించుకోవడంతో ట్రంప్ చేతులు కట్టేసినట్లయింది. దీంతో ఆయన సగౌరవంగా బయటపడే ప్రయత్నం చేస్తున్నారంటూ ఇప్పటికే ఇరాన్ యుద్ధాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు, వ్యంగ్య చిత్రాలు ప్రచురితమయ్యాయి. తెరవెనుక జరుగుతున్న చర్చల్లో పురోగతి సాధిస్తే ఇరాన్‌పై కొత్త దాడులు ఉండబోవని ఒకరోజు ముందు సిఎన్ఎన్–సిబిఎస్‌లకు వేరువేరుగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో ట్రంప్ తెలియజేశారు. ''ఇరాన్‌పై మళ్ళీ దాడులు అసంభవం,ఎందుకంటే అదొక విఫలమవుతున్నదేశం, ఆ దేశంలో ద్రవ్యోల్బం 301 శాతంగా నమోదైందిఆర్థికంగా విఫలమవుతోంది, బలమైన ఒప్పందంపై సంతకాలు చేస్తే దాడులు జరిగే అవకాశాలు చాలా తక్కువ, మళ్ళీ దాడుల పరిస్థితులు తలెత్తితే, ఒక్క గంట వ్యవధిలోనే ఇరాన్‌లో ఉన్న 38 వంతెనలను అమెరికా సైన్యం ధ్వంసం చేయగలదు'' అని హెచ్చరించారు.

దౌత్య పరిష్కారమే మార్గం: అరాఘ్చి

ఇరాన్–అమెరికా ఉన్నతస్థాయి భద్రతాధికారుల మధ్య దోహాలో సమావేశం జరుగుతుందని అంతర్జాతీయ మీడియాలో వస్తున్న వార్తలను ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఖండించారు. అలాంటి సమావేశం ఏదీ జరిగే అవకాశంలేదని, ఈ వార్తలన్నీ నిరాధారమైనవని టెహ్రాన్‌లో మంగళవారం చెప్పారు. ఇరాన్‌తో యుద్ధానికి మొదటి నుండీ వ్యతిరేకంగా ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ మధ్య శిఖరాగ్ర సమావేశం జరుగుతుందన్న వార్తలు నిజం కాదని అరాఘ్చి చెప్పారు. అలాంటి సమావేశం నిర్వహించే ప్రణాళిక ఏదీ లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌పై యుద్ధం చేయడం ద్వారా తన నిర్దేశిత లక్ష్యాలలో ఏ ఒక్కటీ అమెరికా సాధించలేదని డోనాల్డ్ ట్రంప్ ముందుగానే గ్రహించి ఉంటే బాగుండేదని చెప్పారు. యుద్ధాన్ని కేవలం దౌత్యం మాత్రమే నిరోధించగలదని ఆయన వ్యాఖ్యానించారు. ఆంక్షలు, ఆర్థిక ఒత్తిడులు కూడా మార్గం కాదని త్వరలోనే ఆయన తెలుసుకుంటారని, అందుకు ఆయనకు ఎంతో సమయం పట్టదని అన్నారు. ''ఇరాన్‌పై యుద్ధం సైనిక చర్య ద్వారా, ఆంక్షలు విస్తరించడం ద్వారా ముగిసిపోదు, ఇరాన్ డిమాండ్లను పరిష్కరించాలి, విధించిన షరతులు అంగీకరించడం ద్వారా ఇరాన్ ప్రతిపాదించిన రెండు రోజుల ప్రణాళిక(హోర్ముజ్ తెరవడం– చర్చలు ప్రారంభించడం) అమలుకు పూర్తి భరోసా ఇవ్వాలి, దౌత్యపరంగా ముందుకు వెళ్ళడానికి ఇదొక్కటే మార్గం'' అని అరాఘ్చి చెప్పారు.

హెగ్సెత్‌పై కాంగ్రెస్‌లో అభిశంసన తీర్మానం

- ఇది దేశభక్తి కాదు దేశద్రోహం : హెగ్సెత్
- అభియోగాలు మోపింది రిపబ్లికన్ ప్రతినిధే



వాషింగ్టన్: ఇరాన్ యుద్ధం, వెనెజులా అధ్యక్ష దంపతుల కిడ్నాప్, యెమెన్‌లో యుద్ధ కార్యకలాపాలు వంటి ఎనిమిది అభియోగాలతో అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్‌కు వ్యతిరేకంగా ఆ దేశ కాంగ్రెస్‌లో ఒక తీర్మానాన్ని ఆయన సొంత పార్టీకి చెందిన ప్రతినిధి థామస్ మాస్సీ ప్రవేశపెట్టారు.ఐతే హెగ్సెత్ పెంటగాన్ పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ ఇది దేశభక్తి కాదు,దేశ ద్రోహం అని విమర్శించారు.

కాంగ్రెస్‌లో ఆయనపై ఎనిమిది అభియోగాలను అందరూ వినేట్టుగా థామస్ మాస్సీ గట్టిగా చదివారు. మాస్సీ రిపబ్లికన్‌పార్టీ తరఫున కెంటకీ రాష్ట్రంలో నాలుగవ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హెగ్సెత్ చర్యలను ఘోరమైన నేరాలుగా, దుష్ప్రవర్తనగా పరిగణించాలన్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై సొంతపార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉందనడానికి ఇదే తార్కాణమని ఈ వార్తను ప్రచురించిన ఇరాన్ పత్రిక వ్యాఖ్యానించింది. 34 పేజీలున్న ఈ తీర్మానాన్ని ఆయన ప్రతినిధుల సభకు సమర్పించారు.ఇరాన్ యుద్ధంలో, వెనిజులాలో, యెమెన్‌లో ఆయన పోషించిన పాత్రను ఆ నివేదికలో మాస్సీ వివరించారు.

కాంగ్రెస్ అనుమతి లేకుండా ఆయన యుద్ధ చర్యలకు దిగారని ఒక అభియోగంలో ఆరోపించారు. అదేవిధంగా పౌరుల ప్రాణాలకు హాని తగ్గించే చర్యలు తీసుకునే చట్టాలను కూడా హెగ్సెత్ విస్మరించారని మరో అభియోగంలో పేర్కొన్నారు. ఇరాన్‌లోని మినాబ్ పాఠశాలపై జరిగిన దాడిలో 164 మంది విద్యార్థులు,ఉపాధ్యాయులు హతులైన బాంబుదాడి ఘటనను కూడా ఆయన ప్రముఖంగా మరో తీర్మానంలో ప్రస్తావించారు.మినాబ్‌పై జరిగిన దాడిలో 120 మంది విద్యార్థులు, 26 మంది ఉపాధ్యాయులు, ఏడుగురు తల్లిదండ్రులు, ఒక బస్సు డ్రైవర్, ఫార్మసిస్టు ఇతర పౌరులు కూడా మరణించారని పేర్కొంది. తద్వారా మానవహక్కులు ఉల్లంఘించారని పేర్కొన్నారు.ఈ దాడిని యుద్ధరంగంలో జరిగిన పొరపాటుగానో, లక్ష్యాలను ఛేధించడంలో జరిగిన గందరగోళంగానో కొట్టిపారేయలేవని తీర్మానం తీవ్రంగా తప్పుపట్టింది. అదేవిధంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో కరీబియన్ సముద్రజలాల్లో పడవలపై అక్రమ దాడులకు పాల్పడ్డారని, ఈ దాడుల్లో అనేకమంది అమాయకులు కాల్పుల్లో హతులయ్యారని మరో అభియోగంలో పేర్కొన్నారు. వెనిజులా అధ్యక్షభవనంపై అర్థరాత్రి దాడిచేసి అనేకమంది భద్రతాసిబ్బందిని హత్యచేసి నికొలాస్ మదురో ఆయన సతీమణిని ఈ ఏడాది జనవరి మొదటివారంలో కిడ్నాప్‌చేసి అమెరికాకు తరలించి జైలులో విచారణ నిమిత్తం తరలించారని మరో అభియోగంలో పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన ఆదేశాలను పాటించవద్దని సైనికులకు చట్టసభ సభ్యుడు మార్క్ కెల్లీ విజ్ఞప్తి చేసినందుకు ఆయన పట్ల అనుసరించిన వైఖరిని కూడా ప్రతిపాదిత తీర్మానం విమర్శించింది.

హెగ్సెత్‌ను ఎవ్వరూ తప్పు పట్టలేరు:ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన రక్షణమంత్రి హెగ్సెత్ చర్యలను సమర్థించారు. యుద్ధనేరాలకు పాల్పడినందుకు రాబోయేకాలంలో డెమోక్రాట్లు హెగ్సెత్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెడతారని వస్తున్న వార్తలు, సొంతపార్టీ ప్రతినిధి మాస్సీ ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నేపథ్యంలో హెగ్సెత్‌కు ట్రంప్ మద్దతు ప్రకటించారు. రిపబ్లికన్ ప్రతినిధి థామస్ మాస్సీ ఆకస్మికంగా ఈ విధంగా ఒక అభిశంసన తీర్మానం సభలో ప్రవేశపెడతారని ఊహించలేదని ట్రంప్ వైట్‌హౌస్‌లో జరిగిన పత్రికాగోష్ఠిలో చెప్పారు.'మాస్సీ ఒక లూజర్'' అని ట్రంప్ విమర్శించారు.''అతనొక పనికిమాలినవాడు, ఇలాంటివాడు ఈ పనులు చేయకూడదు, ఒకవేళ సభ ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేసే సమయంలో కూడా మాస్సీ రక్షణ మంత్రి హెగ్సెత్ వెంటే ఉండాల్సి ఉంటుంది, కానీ ఆయన ఇలాంటి పనిచేశాడు, కానీ నేను హెగ్సెత్ వెంట ఉంటాను, ఆయనకు మద్దతు ఇస్తాను, ఔను, హెగ్సెత్ రెండు యుద్ధాలు గెలిచాడు, మేం అన్ని యుద్ధాలూ గెలుచుకున్నాం, ఇరాన్, వెనిజులాలలో ఆయన విజయవంతంగా సైనిక చర్యలు పూర్తిచేశారు, నేను చెప్పిన వెంటనే 48 నిమిషాల్లో వెనిజులాలో యుద్ధం గెలిచి చూపించాడు, ఆయనను ఎవ్వరూ తప్పుపట్టలేరు'' అని వైట్‌హౌస్ పత్రికాగోష్ఠిలో చెప్పారు. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా కూడా ఆయన పోస్టింగ్ పెట్టారు.

వ్యక్తిగత వివాదాన్ని చైనాపై ఆంక్షలుగా మార్చేయత్నం

- ఎన్విడియా కేసుపై రాయిటర్స్ కథనం
- ఎఫ్‌బిఐ దర్యాప్తు చేస్తోందని ట్రంప్ ప్రకటన



శాంతాక్లారా: ప్రపంచ ప్రఖ్యాత టెక్ కంపెనీ ఎన్విడియా సిఇఓ జెన్సన్ హువాంగ్‌కు, చైనా(గూఢచారగా చెబుతున్న)యువతికి మధ్య వ్యక్తిగత వ్యవహారాన్ని సాకుగా తీసుకుని అత్యంత అత్యాధునిక ఎ.ఐ చిప్‌లను చైనాకు చేరకుండా ఆంక్షలు విధించేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోందన్న రాయిటర్స్ వార్తా సంస్థ నివేదికను చైనా పత్రికలు మంగళవారం ప్రచురించాయి. ఐతే ఎన్విడియా కేసులో యువతిని చైనా గూఢచారిగా పేర్కొని వివాదంగా మార్చడాన్ని ఆ దేశం ఖండించింది. చైనాపై బురద జల్లడానికే ఇలాంటి ప్రచారం జరుగుతోందని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ విమర్శించింది.

ఎన్విడియా ఉదంతంలో దేశ రహస్యాలు బయటకు పొక్కాయా? అనే విషయంపై ఎఫ్‌బిఐ దర్యాప్తు ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. చైనాగూఢచారులు హువాంగ్‌ను లక్ష్యంగా చేసుకున్నారని తాను నమ్ముతున్నానని, ఈ విషయంపై ఆయనతో సోమవారం ఫోన్‌లో సంభాషించానని చెప్పారు. ''ఆమె గూఢచారి అనే విషయం మీకు ఏమైనా తెలుసా?'' అని తాను ప్రశ్నించానని, తనకు తెలియదని ఆయన చెప్పారని, తాను ఆయనను నమ్ముతున్నానని ట్రంప్ చెప్పారు.

చైనా గూఢచారిగా భావిస్తున్న అలిస్ హువాంగ్ లేతో హువాంగ్ శారీక సంబంధం కొనసాగించాడని వార్తలు వెలుగులోకి వచ్చిన తర్వాత కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే జెన్సన్ హువాంగ్ మార్కెట్‌లో 740 కోట్ల డాలర్లు పోగొట్టుకున్నారు. ఆయన కంపెనీ షేర్ ప్రైస్ రేటింగ్ కూడా ఫోర్బ్స్ జాబితాలో ఒక్కసారిగా పదోస్థానానికి దిగజారిపోయింది. మంగళవారం జరిగిన మొదటి అరగంట ట్రేడింగ్‌లో జెన్సన్ హువాంగ్ సంపద 162.6 బిలియన్ డాలర్ల నుండి 154.7 బిలియన్‌డాలర్లకు క్షీణించిపోయింది. ఆయన రియల్ టైమ్ బిలియనీర్ ర్యాంకింగ్ ఎనిమిదోస్థానం నుండి పదోస్థానానికి దిగజారింది. ఇఎస్‌టి కాలమానం మధ్యాహ్నం 1.30 నాటికి 55 శాతం ఆయన కంపెనీ షేర్లు పతనమయ్యాయి. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా గణనీయస్థాయిలో క్షీణించింది.

చిప్‌ల తయారీలో అమెరికాలో దిగ్గజ కంపెనీగా ఉన్న ఎన్విడా సిఇఓ జెన్సన్ హువాంగ్ సోమవారంనాడు స్వయంగా సంచలనం కలిగించే విషయాలు బహిర్గతం చేశారు. సింగపూర్ కేంద్రంగా పనిచేసే మెగాస్పీడ్ ఇంటర్నేషనల్ డేటా సెంటర్‌లో పనిచేసిన అలిస్ హువాంగ్ అనే చైనా యువతితో హువాంగ్ అక్రమ సంబంధం కొనసాగించాడు. ఆయనే తన ఉద్యోగులకు ఈమెయిల్ ద్వారా ఈ విషయం తెలియజేశాడు. తాను తప్పుచేశానని, తప్పు సరిదిద్దుకుంటానని ప్రకటించాడు. తన బాధ్యతల నిర్వహణలో విఫలమయ్యానని ప్రకటించాడు. ఆయన అమెరికా నిబంధనలు ఉల్లంఘించి చిప్‌లను చైనాకు చేరవేశాడని, ఈ విధంగా చేరవేయడంలో చైనా యువతి అలిస్ తన స్వదేశం తరఫున గూఢచారిగా పనిచేసిందని అమెరికా ప్రభుత్వం ఆలస్యంగా గుర్తించినట్లు వార్తలు వచ్చాయి. అమెరికా కృత్రిమ మేధ చిప్‌లను ప్రభుత్వ అనుమతి లేకుండా చైనాకు తరలిస్తున్నారన్నది అభియోగం.

తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రికార్డులు, జాతీయ ఎఆర్‌టి అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి వైద్యులు, ఐవిఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ కొనసాగుతోంది.ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు ఈనెల 6న వైద్య అధికారులు న్యూఢిల్లీలోని నేషనల్ ఎఆర్‌టి అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో నమోదైన ఎ ఆర్‌టి కేంద్రాలు, ఎ ఆర్ టి బ్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు కోరారు. మహిళల నుంచి అండాలను 'అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం2021' నిబంధనలకు విరుద్ధమని, ఇది శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని ఎ ఆర్‌టి క్లినిక్‌లను ,ఎ ఆర్ టి బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొందడంతో పాటు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల మాయమాటలు,ఆర్థిక ప్రలోభాలకు లోనై అక్రమ వైద్య విధానాలకు బలికావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

త్రైపాక్షిక చర్చలు షురూ

(మొదటి పేజీ తరువాయి)

కావాలని తాము ఆశిస్తున్నామని జారెడ్ కుష్నెర్ తొలుత అన్నారు.ఈ చర్చలపై ఎన్నో భావోద్వేగాలు పెల్లుబుకుతున్నాయన్నారు. భద్రతాహామీలపై చర్చల్లో ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తొలుత చెప్పారు. ఎప్పటికప్పుడు పుతిన్‌కు తెలియజేస్తామని చెప్పారు. చర్చలు జరిగే తీరు తెన్నులను బట్టి సమాచారాన్ని అతివేగంగా చేరవేయడానికి టెలిగ్రాఫిక్ విధానం అనుసరించాలా? లేక సమగ్ర నివేదిక అందించాలా? అనే విషయాన్ని ఈ చర్చల సారాంశానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.మాస్కో కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 11.15 గంటలకు చర్చలు ప్రారంభమయ్యాయి. రష్యా, ఉక్రేన్ ప్రతినిధులు ఎదురెదురుగా కూర్చున్నారు. ఇరువైపులా రష్యా, ఉక్రేన్, యుఎఇ, అమెరికా జాతీయ పతాకాలను వేలాడదీశారు.రష్యాబృందంలో అలెక్సీ కోమ్‌కోవ్(రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధిపతి), మైఖేల్ గలుజిన్,సెర్గీ ర్యాబ్‌కోవ్(విదేశాంగశాఖ సహాయమంత్రులు), ఇగోర్ కోత్సుకోవ్(ఆర్మీజనరల్ స్టాఫ్ ప్రధాన డైరెక్టరేట్ అధిపతి)ఉన్నారు. వీరితోపాటు ఇతర విభాగాలకు చెందిన అనేకమంది అధిపతులు కూడా పాల్గొంటున్నారు.

ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభమై రాబోయే ఫిబ్రవరి నాటికి నాలుగు సంవత్సరాలు పూర్తికానున్నది.తాను అధికారంలోకి వచ్చిన వెంటనే నెలరోజుల్లో ఉక్రేన్ యుద్ధం ముగింపజేస్తానని ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలకు వాగ్దానం చేశారు.కానీ ఇప్పటికిగానీ పుతిన్‌ను ఒప్పించి ఒక సమావేశాన్ని ట్రంప్ ఏర్పాటు చేయలేకపోయారు.ఐతే గడచిన రెండేళ్ళలో కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఉక్రేన్ యుద్ధ నివారణకు జరిగే యత్నాలలో ట్రంప్ ఖాతాలో ఇదే అతిపెద్ద సమావేశం.

భారత్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

అందులో తెలంగాణపై దృష్టి సారించిన ఎనిమిది ముఖ్యమైన సమావేశాలు నిర్వహిస్తామని ఖుర్షీద్ తెలిపారు. 'మా పార్టీలో విదేశాంగ విధాన రూపకల్పన, ఆలోచనలకు స్ఫూర్తిగా నిలుస్తున్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి,, మన స్వాతంత్ర్య 80వ వార్షికోత్సవం ఈ రెండు ముఖ్యమైన సందర్భాలతో ఈ శిఖరాగ్ర సమావేశం ఏకీభవిస్తోందని ఖుర్షీద్ అన్నారు. తెలంగాణలో, భారతదేశం అంతటా సంక్షేమ విధానాలు, సహకార సమాఖ్యవాదం, సంస్కృతి, సమాజం, యువత, క్రీడలు, ఎన్నికల సమగ్రతపై చర్చించడంతో పాటు, ఒక ఉమ్మడి ప్రకటనను రూపొందించడం, 'అవర్ వరల్డ్' అనే కొత్త మేధోమథన బృందాన్ని ఏర్పాటు చేయడంపై కూడా దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ, భారతదేశం, ప్రపంచం కోసం తన దార్శనికతను వివరిస్తారని, అలాగే సూత్రబద్ధమైన బహుళపక్షవాదం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, శాంతియుత సహజీవనం, ప్రజాస్వామ్య విలువలపై ఆధారపడి, ఆఫ్రోఏషియన్ ఐక్యత, అలీన ఉద్యమ వారసత్వం నుండి స్ఫూర్తి పొందిన భారతదేశ సముచితమైన ప్రత్యామ్నాయ విదేశాంగ విధాన దృక్పథాన్ని ప్రతిబింబిస్తారని ఖుర్షీద్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ సౌత్–గ్లోబల్ నార్త్ వేదిక, కొత్త గ్లోబల్ సౌత్ సంస్థల ఏర్పాటు కూడా జరగనుంది. ఇక్కడ 50కి పైగా దేశాలకు చెందిన సీనియర్ విధానకర్తలు, పార్టీ నాయకులు పాల్గొంటారు.

వందలాదిమంది ప్రతినిధులతో సమావేశం : శ్రీధర్‌బాబు

వివిధ దేశాల నుంచి వందలాది మంది ప్రతినిధులు హైదరాబాద్‌లో సమావేశమవుతున్నందున, వారి చర్చలు తెలంగాణ పరిపాలనకు, ప్రజలకు గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తాయని తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో భౌగోళిక రాజకీయ అంశాలు, నూతన ప్రపంచ క్రమం, సామాజిక సవాళ్లు, వాతావరణ మార్పులు, మీడియా పాత్ర, అంతర్జాతీయ జర్నలిజం, సమాచార సమగ్రత వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. 'మేము 'తెలంగాణ రైజింగ్' పై ఎనిమిది సెషన్లను కూడా నిర్వహిస్తాము. ఈ సమావేశాలలో తెలంగాణలో, భారతదేశవ్యాప్తంగా భవిష్యత్ నగరం, పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలు, సహకార సమాఖ్యవాదం, సంస్కృతి, సమాజం, యువత, క్రీడలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చిస్తారు' అని ఆయన వెల్లడించారు. భారత్ సమ్మిట్ తర్వాత, డిసెంబర్ 7 నుండి 9 వరకు రాష్ట్రం 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'కు కూడా ఆతిథ్యం ఇవ్వనుందని ఆయన చెప్పారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనే భాగస్వాములు సంభావ్య పెట్టుబడులపై చర్చిస్తారని, వారిని 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ఆహ్వానిస్తారని ఆయన పేర్కొన్నారు. కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విభజన రాజకీయాలు ప్రబలంగా ఉన్న సమయంలో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని, రాజకీయాలను తిరిగి ప్రజల వద్దకు తీసుకురావడమే దీని లక్ష్యమని పార్టీ నాయకుడు గుర్దీప్ సప్పల్ అన్నారు. ప్రస్తుత ప్రచార యుగం నుండి ప్రజలను బయటకు తీసుకువచ్చి, ప్రజల సమస్యలను, రాజకీయాలను తిరిగి దృష్టిలోకి తీసుకురావడమే లక్ష్యం అని ఆయన అన్నారు.

తెలంగాణలో అతిపెద్ద కార్యక్రమం : మహేశ్‌కుమార్ గౌడ్

దాదాపు 70 దేశాలకు చెందిన అంతర్జాతీయ ప్రగతిశీల మేధావులు ఇందులో పాల్గొననున్నందున, తెలంగాణలో జరగనున్న అతిపెద్ద కార్యక్రమాలలో ఇది ఒకటి అవుతుందని తెలంగాణ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ చెప్పారు. ఈ సదస్సులో ప్రపంచంలోని అగ్రశ్రేణి విధాన రూపకర్తలు, మేధావులు, వ్యాపార నాయకులు, కార్యకర్తలు, మార్పు సృష్టికర్తలు పాల్గొంటారని, వీరు పలు ఉన్నత స్థాయి ప్యానెల్ చర్చలు, రహస్య సమావేశాలు, ద్వైపాక్షిక సంప్రదింపులలో పాల్గొంటారని కాంగ్రెస్ తెలిపింది. బ్రెజిల్, హంగరీ, సెర్బియాలలో చారిత్రాత్మక ప్రగతిశీల ఎన్నికల విజయాల తర్వాత, అమెరికా మధ్యంతర ఎన్నికల వెంటనే జరుగుతున్న ప్రగతిశీల నాయకుల మొట్టమొదటి ప్రధాన అంతర్జాతీయ సమావేశం ఇదే కాబట్టి, మారుతున్న ప్రపంచపు నాడిని పట్టుకోవడమే దీని లక్ష్యమని ఆ పార్టీ పేర్కొంది.

మీ నిర్ణయాలే గీటురాయి

(మొదటి పేజీ తరువాయి)

జరగలేదన్నారు. గతంలో టిజిపిఎస్‌సి ద్వారా నోటిఫికేషన్ జారీ చేసినా ప్రశ్నాపత్రాలు, ఇతర అంశాల్లో జరిగిన గందరగోళం అందరికీ తెలిసిందేనన్నారు. గతంలో టిజిపిఎస్‌సి సభ్యులుగా పనిచేసిన వారిలో ఆర్‌ఎంపి డాక్టర్లు ఉన్నారని, ఉన్నత స్థాయిలో నియామకాలు చేపట్టే ఈ బోర్డులో అంతకంటే కింది స్థాయి వాళ్లను, అవగాహన లేని వారిని సభ్యులుగా నియమించడమే ఆ ప్రభుత్వ చేసిన తప్పు అని అన్నారు. అందుకే తాను సిఎం కాగానే టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేయాలని నిర్ణయించానన్నారు. యుపిఎస్‌సి తీసుకుంటున్న విధానాలను అధ్యయనం చేసి టిజిపిఎస్‌సిని తరహాలో రూపొందించామని,టిజిపిఎస్‌సి మొదటి ఛైర్మన్‌గా రిటైర్డ్ డిజి మహేందర్ రెడ్డిని నియమించామని, ప్రస్తుత ఛైర్మన్‌గా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను నియమించామన్నారు. పోటీ పరీక్షలు నిర్వహించడంలో అనుభవం కలిగిన వాళ్లను, చిత్తశుద్ధి ఉన్నవారిని మాత్రమే బోర్డు సభ్యులుగా నియమించామని సిఎం వివరించారు. భవిష్యత్తు నిర్ణయించే వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లితే నియామకాల పట్ల అపనమ్మకం ఏర్పడుతుందన్నారు. 563 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే ఇందులో 562 మంది నియమితులయ్యారన్నారు.

పారదర్శకంగా డిఎస్పీల నియామకం....

డిఎస్పిల నియామకాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో పారదర్శకతను పాటించిందని,ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కుటుంబ సభ్యుల పిల్లలు కూడా నియమితులవ్వడం తమ పారదర్శకతను స్పష్టం చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నియామకాల విషయంలో అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారాయని కొందరు పని గట్టుకుని అనేక ఆరోపణలు చేశారని,ఇలాంటి రాజకీయ ఆరోపణలు తమకు కొత్త కాదని,కానీ 'మీకు' చాలా ఆందోళన కలిగించిందన్నారు. ఏ ఉద్దేశంతో పోలీస్ శాఖలో చేరారో ఆ ఉద్దేశాన్ని మరిచిపోవద్దన్నారు. లక్ష్యం పెట్టుకుని ప్రయత్నిస్తే అసాధ్యం ఏదీ ఉండబోదని, ఇలాంటి వారు చరిత్రలో చాలా మంది ఉన్నారని గుర్తు చేశారు. ఒక లక్ష్యం పెట్టుకుని కష్టపడ్డారు కాబట్టే ఈ హోదాకు చేరుకున్నారని, ఇక ముందు రెండో అధ్యాయం ప్రారంభం కాబోతుందని, ఇది 'మీ జీవితాల్లో' చాలా ముఖ్యమన్నారు. అనేక మంది సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా పని చేయడం వల్లనే సమాజంలో పోలీసు వ్యవస్థకు గుర్తింపు వచ్చిందని, దీనిని కాపాడాలని సూచించారు. హోదాను ఎంత జాగ్రత్తగా ప్రజల కోసం వాడితే అంత బాగుంటుందని, కానీ అతిగా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడితే దీర్ఘకాలికంగా ఉపయోగం లేదన్నారు.

సైబర్‌క్రైమ్‌లో సర్వం దోపిడీ....

పివి నరసింహారావు ఓపెన్ ఎకానమీ తీసుకొచ్చిన తర్వాత 'ప్రపంచంలోని అన్ని సమస్యలు మన దగ్గర'కు వచ్చాయని, అందులో ముఖ్యం సైబర్ క్రైమ్ అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. వ్యక్తుల మధ్య పరిచయం లేకుండా, కనీసం చూడకుండా సర్వం దోచుకునే పరిస్థితి సైబర్ క్రైమ్‌లో ఉన్నదని, ప్రస్తుతం ఇప్పుడు నేరాలు, వాటి ప్రవృత్తి మారిపోయిందన్నారు. డ్రగ్స్ సరఫరాను నియంత్రించడంలో యుద్ధవీరులను ఇచ్చిన పంజాబ్ కూడా విఫలమైందని,సిక్కు రెజిమెంట్‌లో ఇప్పుడు సిక్కులు లేరని, బ్రిటీషర్లు కూడా భయపడిన సిక్కు జాతి డ్రగ్స్ విషయంలో నిర్వీర్యమైందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్‌ను ప్రవేశపెట్టి అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్, డ్రగ్స్ కంట్రోల్, సైబర్ క్రైమ్‌ల కోసం సరి కొత్త వ్యవస్థలను తీసుకొచ్చామని, ఈ అంశాలపైన అవసరమైతే నూతన డిఎస్పీలను కూడా అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తామని వెల్లడించారు. డిఎస్పీలు తమ ఫిట్‌నెస్‌పైన మరింత ఫోకస్ పెట్టాలన్నారు. 'గరం, నరం, బేషరమ్' పరిస్థితికి ఎదురుకావొద్దని నూతన డిఎస్పీలకు సిఎం సూచించారు.

ఒయు ఉద్యోగుల సమరశంఖం

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న భరోసా లేని పరిస్థితులు అత్యంత బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు.ధర్నాకు సంఘీభావం తెలిపిన ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని, ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు పరిష్కరించగలిగే న్యాయమైన సమస్యలేనని స్పష్టం చేశారు.ఈ క్రమంలోనే ప్రొఫెసర్ హరిగోపాల్ టెలిఫోన్ ద్వారా సంఘీభావ సందేశం తెలుపుతూ.. గడచిన ఇరవై సంవత్సరాలుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుండా కొనసాగడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ క్రాంతిదళ్ పార్టీ అధ్యక్షుడు డా.పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు న్యాయం జరగాలని, వారి డిమాండ్లను ప్రభుత్వం, యూని zవర్సిటీ అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ధర్నాలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలులో ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఉద్యోగుల పెన్షన్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, టైమ్ స్కేల్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆయన కో రారు. బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎక్కువ సమయం అవసరం లేదని అన్నారు.

విద్యార్థి సంఘాల మద్దతు..

ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి విద్యార్థి సంఘాలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ క్రమంలోనే ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, ఎఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతినిధులు ఉద్యోగుల ధర్నాలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఇదిలా ఉండగా.. టివిజ్జీవో నాయకులు కూడా ధర్నాకు హాజరై ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలిపారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఒయు నాన్ టీచింగ్ స్టాఫ్ జెఏసి ఛైర్మన్ కుమార్, అధ్యక్షుడు ఖదీర్ ఖాన్, ఇతర జెఏసి నాయకులు మహా ధర్నాలో పాల్గొన్న ప్రతి ఉద్యోగికి, ఉద్యోగ సంఘాల నాయకులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు, విద్యార్థి సంఘాలకు, మేధావులకు, మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

వరుణుడి ఆటతో...

భారత్–న్యూజిలాండ్ మ్యాచ్ రద్దు

న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో వన్డేకు వరుణుడు తీవ్ర అంతరాయం కలిగించాడు. పలుమార్లు వర్షం తగ్గుతూ.. మళ్లీ మొదలవడంతో మ్యాచ్ ప్రారంభం కాలేదు. చివరకు ఎంతసేపు ఎదురుచూసినా వాతావరణం అనుకూలించకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

మ్యాచ్ ప్రారంభానికి ముందే హామిల్టన్‌లో వర్షం పడటంతో టాస్ ఆలస్యమైంది. పలుమార్లు వర్షం తగ్గడంతో మైదాన సిబ్బంది కవర్లు తొలగించి ఆటకు ఏర్పాట్లు చేశారు. అయితే టాస్ నిర్వహించేందుకు సిద్ధమైన సమయంలో మళ్లీ చిరుజల్లులు మొదలయ్యాయి. చివరకు వర్షం కొంత విరామం ఇవ్వడంతో టాస్ నిర్వహించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ జట్టులో ఒక మార్పు చేసినట్లు ప్రకటించాడు. మాథ్యూ ఫిషర్‌కు అవకాశం కల్పించి బ్లెయిర్ టిక్నర్‌ను తప్పించాడు.

అయితే టాస్ పూర్తయి నవెంటనే మళ్లీ వర్షం మొదలైంది. దీంతో పిచ్‌ను మరోసారి కవర్లతో కప్పేశారు. వర్షం ఆగుతుందేమోనని అంపైర్లు, ఆటగాళ్లు, అభిమానులు చాలాసేపు ఎదురుచూశారు. మధ్యలో వర్షం కొంత తగ్గినప్పటికీ మళ్లీ జోరందుకుంది. మైదానంలో నీరు చేరడంతో ఆట నిర్వహించేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మ్యాచ్ రద్దుతో సిరీస్‌లో భారత్ 2–0 ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో



న్యూజిలాండ్ గెలిచినా సిరీస్‌ను 2–2తో సమం చేయగలదు. అయితే సిరీస్‌ను గెలిచే అవకాశం మాత్రం ఆ జట్టుకు లేకుండా పోయింది. మరోవైపు భారత్ తదుపరి మ్యాచ్‌లో విజయం సాధిస్తే ఆధిక్యాన్ని మరింత పెంచుకోనుంది.

సెహ్వాగ్ తనయుడి విధ్వంసం భారత్ ఘన విజయం!





అండర్ 19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత కుర్రాళ్లు అదరగొట్టారు. గత మ్యాచ్‌లో దాయాది పాకిస్తాన్ చేతిలో అనూహ్య పరాజయాన్ని ఎదుర్కొన్న భారత కుర్రాళ్లు.. మంగళవారం ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 70 పరుగుల భారీ తేడాతో యుఎఇని మట్టికరిపించారు. టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్(168 బంతుల్లో 17 ఫోర్లు, 7 సిక్స్‌లతో 160) భారీ శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో గ్రూప్–ఎ రన్నరప్‌గా భారత్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. గురువారం జరిగే సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి.

శతక్కొట్టిన ఆర్యవీర్ సెహ్వాగ్

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత అండర్ 19 టీమ్ నిర్ణిత 50 ఓవర్లలో 7 వికెట్లకు 309 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆర్యవీర్ సెహ్వాగ్‌తో పాటు వీకే వినీత్(69 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 67) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 193 పరుగులు జోడించారు. రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ ద్రవిడ్ 9 బంతుల్లో సిక్స్‌తో 12) పరుగులే చేశాడు. దూకుడుగా ఆడే క్రమంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆరంభం నుంచే ఆర్యవీర్ సెహ్వాగ్ దూకుడుగా ఆడాడు. మంచి బంతులను గౌరవించిన అతను చెడ్డ బంతులను బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో 69 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన అతను 131 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం దూకుడుగా ఆడి మరో 29 బంతుల వ్యవధిలోనే 150 పరుగుల మార్క్‌ను చేరుకున్నాడు. 17 ఫోర్లు, 7 సిక్స్‌లతో యుఎఇ బౌలర్లను చెడుగుడు ఆడాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసంతోనే భారత్ 309 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది.

కుప్పకూలిన యుఎఇ..

అనంతరం యుఎఇ నిర్ణీత 50 ఓవర్లలో 239 పరుగులకు కుప్పకూలి ఓటమిపాలైంది. అహ్మద్ ఖుదాదాద్(74 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 74) హాఫ్ సెంచరీతో రాణించగా.. నూరుల్లా అయోబి(25 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 39), యాయిన్ కిరణ్ రాయ్(44 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 29) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వా, మనాల్ చౌహన్, కావ్య పరేష్ పల్, యశ్‌బర్ధన్ చౌహన్, ఆర్యన్ సవ్‌సాని, అర్జున్ రాజ్‌పుత్ తలో వికెట్ తీయగా.. ఇషాన్ సూద్(4/37) నాలుగు వికెట్లతో సత్తా చాటాడు.

మహిళ

చట్టబద్ధమైన, ఉచిత అబార్షన్ కోసం
పోలాండ్‌లో ఆందోళనలు



ఉచితంగా, చట్టబద్ధంగా అబార్షన్ సేవలు పొందే హక్కు కోసం పోలాండ్ మహిళలు ఉద్యమిస్తున్నారు. దేశవ్యాప్తంగా 20కి పైగా నగరాలు, పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అబార్షన్ చట్టాలను సరళీకరిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని డొనాల్ టస్క్ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని మహిళా హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. అబార్షన్ నిబంధనలను సడలించే రెండు బిల్లులను పార్లమెంటు ఇటీవల ఆమోదించినప్పటికీ, సంప్రదాయవాద అధ్యక్షుడు కరోల్ నవ్రోత్స్కీ వాటిని 'వీటో' (చెల్లుబాటు కాకుండా అడ్డుకునే అవకాశం) చేసే అవకాశముంది. వచ్చే ఏడాది పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహిళల మద్దతు పొందేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని, చట్టాల్లో నిజమైన మార్పు తీసుకురావాలన్న చిత్తశుద్ధి లేదని అబార్షన్ డ్రీమ్ టీమ్ కార్యకర్తలు విమర్శిస్తున్నారు. పోలాండ్‌లో 1993 నుంచి అబార్షన్‌పై కఠిన ఆంక్షలు అమలవుతున్నాయి. గర్భం వల్ల తల్లి ప్రాణాలకు లేదా ఆరోగ్యానికి ముప్పు ఏర్పడినప్పుడు, పిండంలో తీవ్రమైన అసాధారణతలు ఉన్న

82 ఏళ్ల వయసులోనూ తగ్గని ఉత్సాహం
అంతరించిపోతున్న భాషకు ప్రాణం

చాలామంది పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకునే వయస్సులో మారీ విల్కాక్స్ ఒక అసాధారణమైన లక్ష్యాన్ని తన భుజాలపై వేసుకున్నారు. అంతరించిపోతున్న ఒక భాషను శాశ్వతంగా కనుమరుగుకాకుండా కాపాడాలని ఆమె సంకల్పించారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన స్థానిక అమెరికన్ ఆదివాసీ భాష అయిన 'వుక్చుమ్నీ' మాట్లాడగలిగిన చివరితరం వ్యక్తుల్లో మారీ విల్కాక్స్ ఒకరు. ఈ భాష క్రమంగా అంతరించిపోయే ప్రమాదాన్ని ఆమె గుర్తించారు. తన పూర్వీకుల భాషను భావితరాలకు అందించాలనే సంకల్పంతో, ఆమె 82 ఏళ్ల వయస్సులో కంప్యూటర్ ఉపయోగించడం నేర్చుకోవడం ప్రారంభించారు. తన మాతృభాషలోని ప్రతి పదాన్ని జాగ్రత్తగా నమోదు చేస్తూ, దాదాపు ఏడు సంవత్సరాల పాటు నిరంతరంగా శ్రమించారు. ఈకృషి ద్వారా సుమారు 6,000 పదాలతో కూడిన ఒక నిఘంటువును రూపొందించారు. భవిష్యత్తు తరాలు తమ పూర్వీకుల భాషను తిరిగి నేర్చుకోవడానికి, తమ సాంస్కృతిక వారసత్వంతో మళ్లీ అనుసంధానమవడానికి ఈ నిఘంటువు ఉపయోగపడేలా చేశారు. జీవితంలో ఏదైనా సాధించడానికి వయస్సు అడ్డంకి కాదని ఆమె చేసిన ఈ



అసాధారణ కృషి నిరూపిస్తుంది. ఆమె నమోదు చేసిన ప్రతి పదంలో తరతరాల చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి, ఒక సమాజపు ప్రత్యేకమైన గుర్తింపు దాగి ఉన్నాయి. ఆమె ఈ ప్రయత్నం చేయకపోయి ఉంటే, ఆ భాషకు సంబంధించిన అపారమైన పదసంపద, భాషా పరిజ్ఞానంలో కొంత భాగం శాశ్వతంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉండేది. మారీ విల్కాక్స్ కథ కేవలం ఒక భాషను పరిరక్షించిన వ్యక్తి విజయగాథ మాత్రమే కాదు. ఒక వ్యక్తి సంకల్పం మొత్తం సమాజపు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి ఎంత శక్తివంతంగా పనిచేస్తుందనే విషయానికి ఇది గొప్ప నిదర్శనం. వుక్చుమ్నీ అనేది కాలిఫోర్నియాలోని 'యోకుట్స్' భాషా సమూహానికి చెందిన ఒక స్థానిక భాష. అమెరికాలోని అనేక ఆదివాసీ భాషల మాదిరిగానే, ఆంగ్ల భాష ఆధిపత్యం, విద్యా వ్యవస్థలో మాతృభాషలకు లభించని ప్రాధాన్యం, తరతరాలుగా భాషా వినియోగం తగ్గిపోవడం వంటి కారణాలతో ఇది అంతరించిపోయే పరిస్థితికి చేరుకుంది. మారీ విల్కాక్స్ రూపొందించిన నిఘంటువు ఈ భాషను నమోదు చేయడంలో ఒక ముఖ్యమైన అడుగు. అయితే భాషను నిజంగా సజీవంగా ఉంచాలంటే నిఘంటువు ఒక్కటే సరిపోదు. పిల్లలు, యువత ఆ భాషను నేర్చుకోవడం, మాట్లాడటం, రోజువారీ జీవితంలో ఉపయోగించడం కూడా అవసరం.




త్వరలోనే సుమయా రెడ్డి రెండో చిత్రం

సుమ చిత్ర ఆర్ట్స్ సమర్పణలో సుమయా రెడ్డి స్వీయ నిర్మాణంలో నటిస్తున్న రెండో ప్రాజెక్ట్‌ని త్వరలోనే ప్రకటించనున్నారు. 'డియర్ ఉమ' అంటూ మొదటి సినిమాతోనే నటిగా, నిర్మాతగా, రచయితగా సుమయా రెడ్డి తెలుగు ప్రేక్షకులని ఆకట్టుకున్నారు. ఇక ఈ రెండో ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రకటన కూడా త్వరలోనే వెలువడనుంది. ఈసారి కూడా తన సొంత బ్యానర్‌లోనే హీరోయిన్‌గా సుమయా రెడ్డి నటిస్తున్నారు. ఈ ప్రొడక్షన్ నెం.2 టైటిల్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే ఉండబోతోందని ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సుమయా రెడ్డి చేతి నిండా డబ్బు, బంగారంతో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో సుమయా రెడ్డిని చూస్తుంటే మహారాణిలా అనిపిస్తున్నారు. కామెడీ, హారర్ జానర్‌లో ఇది వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో రాబోతోంది అని ప్రీ లుక్ పోస్టర్‌తో హింట్ ఇచ్చారు. ఈ ఒక్క పోస్టర్‌తోనే సినిమాపై అంచనాలు పెంచేశారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన టైటిల్‌తో పాటుగా ఇతర వివరాలని కూడా ప్రకటించనున్నారు.

'అలియాస్ రుక్మిణి' షూటింగ్ పూర్తి

హీరో నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మాణంలో రొమాన్స్, హ్యూమర్, ఆసక్తికరమైన కథనంతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా హీరో నితిన్‌తో పాటు చిత్ర బృందం షూటింగ్ కంప్లీషన్‌ను సెలబ్రేట్ చేసుకుంది. సెట్స్‌లో చిత్ర యూనిట్ అంతా కలిసి ఆనందంగా గడిపిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రానికి జోమోన్ టి. జాన్ ఐఎస్‌సి సినిమాటోగ్రాఫర్‌గా, విజయ్ బుల్గానిన్ సంగీత దర్శకుడిగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, సృజన అదుసుమిల్లి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.ఈ సినిమా డిసెంబర్ 4న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.




'రంగస్థలం' ఫేమ్ మహేష్ హీరోగా 'శివాలయం'



శ్రీ శివసాయి ఫిలిమ్స్, శ్రీమతి శ్రీ లక్ష్మి నర్సింహారెడ్డి చిత్రాలయం సంయుక్త బ్యానర్‌లపై తెరకెక్కుతున్న చిత్రం 'శివాలయం'. ఈ సినిమా టీజర్, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుక కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా శివాలయం సెట్‌ను ఏర్పాటు చేయడం విశేష ఆకర్షణగా నిలిచింది. 'శివాలయం' మూవీ టీజర్, పోస్టర్ లాంచ్ వేడుకలో ముఖ్య అతిథులుగా నిర్మాతలు ఈద రవి రాజా, సాయిలక్ష్మ జ్ అల్లు, నబీ షేక్, పి.నాగలక్ష్మి , కుప్పిలి శ్రీనివాస పాల్గొని చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. సినిమా భారీ హిట్ సాధించాలని ఆకాంక్షించారు. 'రంగస్థలం' ఫేమ్ ఆచంట మహేష్, కాంచన దీప్తిరెడ్డి, ధన్‌రాజ్, సుష్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి వెంకట్‌రెడ్డి నంది దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్‌రెడ్డి నందితో పాటు కళ్లెం నర్సింహారెడ్డి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రంలో ఘర్షణ శ్రీనివాస్, సమ్మెట గాంధీ, మురం రెడ్డి వెంకటేశ్వర్లు, మధుమతి కొక్కంటి, ముత్యాల ఉమా, చిట్టిబాబు, దిల్ రమేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'ఇట్లు అర్జున' మ్యూజికల్ కాన్సర్ట్‌లో రామ్ చరణ్



కింగ్ నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాతో నిర్మాతగా కూడా పరిచయం అవుతున్నారు. ఆయన కొత్తగా ప్రారంభించిన వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలని పెంచింది. ఎస్ తమన్ అందించిన పాటలన్నీ చార్ట్ బస్టర్ అయ్యాయి. 'ఇట్లు అర్జున' ఈ నెల 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. కింగ్ నాగార్జున, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, అఖిల్ అక్కినేని ముఖ్య అతిథులు పాల్గొన్న ఈ వేడుక జరిగింది. రామ్ చరణ్ మాట్లాడుతూ 'ఇట్లు అర్జున'తో తనకు ఒక బ్లాక్‌బస్టర్ వస్తుంది. అలాగే సంక్రాంతికి 'కాకా'తో మరో బ్లాక్‌బస్టర్ వస్తుంది. ఇది రాసి పెట్టుకోండి. తమన్ విషయానికి వస్తే.. పవన్ కళ్యాణ్ 'ఓజీ' సినిమాకైనా, అనిష్ 'ఇట్లు అర్జున'కైనా సమానంగా మ్యూజిక్ చేస్తారు. నేను కూడా 'రంగస్థలం' సినిమాలో చెవిటివాడిగా నటించాను. ఆ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో అంతకంటే పెద్ద విజయం ఈ సినిమాతో అనీష్‌కు రావాలని కోరుకుంటున్నాను. నాగార్జున మాట్లాడుతూ సినిమా చాలా బాగుంది. తన కళ్లతో మాట్లాడాడు. తన సైలెన్స్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అనీష్, అనస్వర కెమిస్ట్రీ సినిమాలో చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. అలాగే తమన్ ఇచ్చిన ప్రతి పాట హిట్ అయింది. అనీష్ ప్రేమ మీ అందరికీ వినిపిస్తుంది. హీరో అఖిల్ అక్కినేని , హీరో అనీష్ , హీరోయిన్ అనస్వర రాజన్ , మ్యూజిక్ డైరెక్టర్ తమన్, నిర్మాత రవిశంకర్ ఎఫ్ డీ సి చైర్మన్, నిర్మాత దిల్ రాజు , నిర్మాత వెంకీ కుడుముల , డైరెక్టర్ మహేష్ , డీఓపీ రాజా పాల్గొన్నారు .

'పొలిమేర 3'లో అర్జున్ ఫస్ట్ లుక్ విడుదల

మిస్టిక్ థ్రిల్లర్ ఫ్రాంచైజీలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'పొలిమేర' సిరీస్ నుంచి మూడో చిత్రంగా వస్తున్న 'పొలిమేర 3'పై అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా పోషిస్తున్న 'విరావి' పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ఈ గ్లింప్స్‌లో అర్జున్ సర్జా శక్తిమంతమైన, ఆసక్తికరమైన లుక్‌లో కనిపించారు.డాక్టర్ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వంశీ నందిపాటి, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ (ఏషియన్ గ్రూప్)కు చెందిన భరత్ నారంగ్‌తో కలిసి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయంలోని చీకటి ప్రదేశాలను చూపిస్తూ గ్లింప్స్ ఆసక్తికరంగా ప్రారంభమవుతుంది. అమావాస్య వాతావరణాన్ని ఆవిష్కరిస్తూ విష్ణుమూర్తి నుంచి పరమశివుడికి మారే దృశ్యాలు, అనంత పద్మనాభస్వామి దర్శనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'మా ఊరి పొలిమేర' చిత్రం తొలుత ఓటీటీలో విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది. వివిధ భాషల ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఆ తర్వాత థియేటర్లలో విడుదలైన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుని ఈ ఫ్రాంచైజీకి మరింత గుర్తింపు తీసుకొచ్చింది.



ఇప్పుడు మూడో భాగంలో అర్జున్ సర్జా చేరడంతో పాటు నాలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతుండటంతో ఈ ప్రాజెక్ట్ పాన్ ఇండియా స్థాయికి చేరుకుంటోంది. గత రెండు చిత్రాల విజయాలు, దర్శకుడు అనిల్ విశ్వనాథ్ కథనశైలి, అర్జున్ సర్జా పాత్ర ఈ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి.ఈ చిత్రంలో సత్యం రాజేశ్ మరోసారి కొమరయ్య పాత్రలో నటిస్తున్నారు. ఆయనతో పాటు కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, బాలాదిత్య, రాకేందు మౌళి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తొలి రెండు భాగాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'పొలిమేర' మూడో భాగంతో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

వచ్చే సంక్రాంతికి వస్తున్న 'వేట్టువం'

సరికొత్త కథా నేపథ్యాలతో అద్భుతమైన మేకింగ్‌తో ప్రేక్షకులని మెస్మరైజ్ చేసే దర్శకుడు పా.రంజిత్ 'వేట్టువం' టైటిల్‌తో మరో భారీ యాక్షన్ చిత్రాన్ని మన ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో ఆర్య, వి.ఆర్. ధినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'వేట్టువం' సినిమాను లెర్న్ అం టీచ్ ప్రొడక్షన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రొడ్యూసర్స్ ఎస్. సాయి దేవానంద్, ఎస్. సాయి వెంకటేశ్వరన్, పా.రంజిత్ నిర్మిస్తున్నారు. భారీ పాన్ ఇండియా యాక్షన్ మూవీగా తెరకెక్కుతున్న 'వేట్టువం' సినిమా వచ్చే సంక్రాంతి పండక్కి వరల్డ్ వైడ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'వేట్టువం' సినిమా నుంచి మేకర్స్ 'సెలబ్రేట్ రెసిలియన్స్..' వీడియో రిలీజ్ చేశారు. ఈ సినిమాలోని క్యారెక్టర్స్ తమ సహనాన్ని పరీక్షించే సందర్భం వచ్చినప్పుడు ఎలా తట్టుకుని నిలబడ్డాయో, తమ శక్తిని ఎలా ప్రదర్శించాయో చూపించడం ఈ వీడియోలో ఆకట్టుకుంటోంది. ఆర్య, వి.ఆర్. దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి, గురు సోమసుందరం, షబీర్ కల్లరక్కల్, జాన్ విజయ్, సాయి దీన, ఆనంద్ సామి, హరీశ్ ఉత్తమన్, లిజీ, లింగేష్ ప్రేమ్ కుమార్, కవిత భారతి, అర్జున్, శాంతకుమార్, మెలోడీ మనీషా, నిమ్మి, రాఫేల్, విక్రమ్, నవీన్, ప్రకాశ్, తదితరులు నటిస్తున్నారు. యాక్షన్ దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ మూర్తి,ఎడిటర్ సెల్వ ఆర్.కె., డిఒపి రూపేష్ షాజి, మ్యూజిక్ జి.వి.ప్రకాష్ కుమార్ , కో రైటర్స్ సంతోష్ నారాయణన్ చెందిల్ కుమార్ స్క్రిప్ట్, డైరెక్షన్ పా. రంజిత్.

బిసి 'వైస్ ఛాన్సలర్'పై
కుట్రలు సహించేది లేదు

మహిళా ప్రొఫెసర్‌ను పావుగా చేసుకుని యూనివర్సిటీలో రాజకీయాలు చేస్తే బిసిలు ఊరుకోరు : బిసి సంఘాలు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యపై వస్తున్న ఆరోపణల వెనుక కుట్ర కోణం ఉందని బిసి సంఘాల నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో తొలిసారిగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బిసి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి విసిగా నియమితులవడాన్ని కొందరు జీర్ణించుకోలేక కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మహిళా అసోసియేట్ ప్రొఫెసర్ తేజశ్రీ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని, ఆరోపణలు నిజమైతే విసిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని బిసి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. మహిళను అడ్డుపెట్టుకుని బిసి విసిని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పోలీసుల విచారణ కొనసాగుతుండగానే రాజకీయ ప్రేరేపిత నిరసనలు చేపట్టడం సరికాదన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలపై వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని ఐజి స్థాయి అధికారితో విచారణ జరిపించాలని జాజుల డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసిన వారు తమ వద్ద ఉన్న ఆధారాలను విచారణ సంస్థలకు సమర్పించాలని సూచించారు. విచారణలో దోషులెవరని తేలినా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో నిరాధార ఆరోపణలతో వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించే కుట్రదారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కుర్మా, బి. మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల వివాదంపై
డిజిపికి విసి ఫిర్యాదు

సమగ్ర విచారణ జరపాలి: ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తనపై మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో పరిపాలనా సంస్కరణలు, బదిలీల నేపథ్యంలో తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పరిపాలనా సర్దుబాట్లలో భాగంగా నిజామాబాద్ జిల్లా రూరూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకురాలిని సెప్టెంబర్ 11, 2026న నిబంధనల ప్రకారం హైదరాబాద్‌కు బదిలీ చేసినట్లు వివరించారు. తన 35 ఏళ్ల అధ్యాపక, పరిశోధన, పరిపాలనా జీవితంలో మహిళా సహోద్యోగుల పట్ల గౌరవంగా వ్యవహరించానని పేర్కొన్నారు. తనకు, సంబంధిత మహిళా అధ్యాపకురాలికి మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు, కాల్ హిస్టరీతో పాటు ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించాలని డిజిపిని కోరారు. ఆరోపణల వెనుక ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ఆధారాలను నిష్పాక్షికంగా పరిశీలించి చట్టపరంగా నిజానిజాలు నిర్ధారించాలని విసి కోరారు.



నషా ముక్త్ భారత్ అభియాన్
విస్తృతంగా నిర్వహిస్తాం

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఆంధ్ర మహిళా సభ ఉమెన్స్ కాలేజీలో అలై బలై ఫౌండేషన్, వీనెట్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరిస్తూ సమాజానికి తీవ్ర ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం వారి భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఈ నేపథ్యంలో అవగాహన కార్యక్రమాలతో పాటు క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలు, బాధితులతో నేరుగా సమావేశాలు నిర్వహించి, వారిలో మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడేందుకు చికిత్స పొందుతున్న వారిని ప్రోత్సహించేందుకు పునరావాస కేంద్రాలను సందర్శించి, వారికి అవసరమైన మార్గదర్శకత్వం, మానసిక ధైర్యా న్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ కోసం ప్రత్యేక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఆంధ్ర మహిళా సభ అధ్యక్షుడు, మాజీ ఐఎఎస్ అధికారి డాక్టర్ డి. చక్రపాణి, ప్రొఫెసర్లు మురళీ మనోహర్, రాజిరెడ్డి, మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర, సందీప్, విశ్వనాథ్, వీనెట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటుండగా కమిషనర్ పట్టివేత!

నిర్మల్‌లోని కుబేర హోటల్ సమీపంలో ఎసిబి అధికారులు

ప్రజాపక్షం/నిర్మల్, భైంసా : భైంసా మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించి ఇన్‌చార్జి కమిషనర్ జాదవ్ సంతోష్‌ను లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల్ చౌరస్తా సమీపంలో ఉన్న కుబేర హోటల్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి ఓ కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూ రు చేసి చెల్లించేందుకు రూ.50 వేలు లంచంగా ఇవ్వాలని జాదవ్ సంతోష్ డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్ ఎసిబి అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు పక్కా ప్రణాళిక మేరకు కాంట్రాక్టర్ మంగళవారం సాయంత్రం నిర్మల్‌లోని కుబేర హోటల్ సమీపానికి చేరుకుని జాదవ్ సంతోష్‌కు రూ.50 వేల నగదును అందజేశారు. అదే సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకుని ఆయనను పట్టుకున్నట్లు సమాచారం.

కృష్ణా జలాల్లో తెలంగాణ
న్యాయమైన వాటా సాధించాలి

సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలి
డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలి
నీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపితో వివాదం ఉన్న అన్ని అంశాలపై అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి న్యాయ నిపుణులతో చర్చించారు. ఎంసిఆర్ హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సిఎంఒ కార్యదర్శి మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఇంజనీర్లను ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన ప్రకారం ఏదుల నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఈ రెండు పథకాలకు అవసరమైన 0.6 టిఎంసిల నీటిని నార్లపూర్ నుంచి ఏదుల వరకు తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడ టన్నెల్, ఎక్కడ కాలువ అవసరమో గుర్తించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాళేశ్వరం అదనపు టిఎంసి పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టిఎంసిల నీటినే తరలించలేని పరిస్థితి ఉన్నందున అదనపు టిఎంసి పనుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించి, భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని పాటతో చాటిన ప్రజాకవి అందెశ్రీ

వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఘన నివాళి

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని తన అక్షరాలతో, పాటలతో ప్రజల హృదయాల్లో నింపిన ప్రజాకవి అందెశ్రీ చిరస్మరణీయుడని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. అందెశ్రీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయనకు సిఎం ఘనంగా నివాళులు అర్పించారు. అక్షరాన్ని ఆయుధంగా, పాటను ఉద్యమ గళంగా మలిచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజల్లో చైతన్యం రగిలించిన మహనీయుడని సిఎం స్మరించుకున్నారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా అందెశ్రీ అందించిన సాహిత్య సేవలు అపారమని సిఎం పేర్కొన్నారు. ముఖ్యంగా 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గీతం ద్వారా తెలంగాణ తల్లి వైభవాన్ని, ఈ నేల సంస్కృతి, సంప్రదాయాలను, ప్రజల ఆకాంక్షలను అద్భుతంగా ఆవిష్కరించారని కొనియాడారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి ఉన్నంతకాలం అందెశ్రీ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని సిఎం పేర్కొన్నారు.

అందెశ్రీ సాహిత్యం ఆత్మగౌరవానికి ప్రతీక: అడ్లూరి

తెలంగాణ మట్టి వాసన, పల్లె ప్రజల జీవన పోరాటాలు, సామాన్యుల ఆకాంక్షలను తన సాహిత్యంలో ప్రతిబింబించిన ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. మంగళవారం అందెశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయనకు మంత్రి నివాళులర్పించారు. తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత కవి అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన 'జయ జయహే తెలంగాణ' గీతం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, తెలంగాణ నేల ఉన్నంతకాలం అందెశ్రీ అక్షరాలు ప్రజల గొంతుకలో సజీవంగా ఉంటాయని అన్నారు.

ఆదివాసీలకు హక్కులు కల్పించకుంటే అసెంబ్లీ ముట్టడి

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : దశాబ్దాలుగా తెలంగాణలో నివసిస్తున్న వలస ఆదివాసీలకు ఎస్‌టి హోదా, ధ్రువీకరణ పత్రాలు కల్పించకుండా ప్రభుత్వాలు వారి హక్కులను కాలరాస్తున్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. ఆదివాసీల సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఆదివాసీ మహాప్రదర్శన నిర్వహించారు. వేలాదిమంది ఆదివాసీలు విల్లంబులు, కొమ్ము డోలు ప్రదర్శనలు, సంప్రదాయ నృత్యాలతో మహాప్రదర్శనలో పాల్గొన్నారు.అనంతరం ఇందిరాపార్కు వద్ద సభ నిర్వహించారు. సభను ఉద్దేశించి జాన్ వెస్లీ మాట్లాడుతూ ఆదివాసీల జీవన విధానమే సంచారంతో ముడిపడి ఉంటుందని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం వారి జీవన పరిస్థితుల్లో భాగమని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారని అక్కడి ప్రభుత్వం, తెలంగాణకు చెందినవారు కారని ఇక్కడి ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. బతుకుదెరువు కోసం వలస వచ్చి 30 ఏళ్లుగా నివసిస్తున్న వారి హక్కులను హరించడం అన్యాయమన్నారు. తెలంగాణలో నివసిస్తున్న ఆదివాసీలకు ఎస్‌సి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అడవులలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు, వారి ప్రయోజనాల కోసం రోడ్లు వేయడానికి అడ్డురాని నిబంధనలు ఆదివాసీ గూడాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు కల్పించేందుకు ఎందుకు అడ్డొస్తున్నాయని కేంద్ర ప్రభుత్వాన్ని జాన్ వెస్లీ ప్రశ్నించారు. అడవులను సంరక్షించే ఆదివాసీలపై దాడులు చేయించడం దుర్మార్గమన్నారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా, తెగించి పోరాడాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపి మిడియం బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్‌సి సర్టిఫికెట్లు ఇప్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అటవీ అధికారుల దాడులను నిలిపివేయాలని కోరారు. సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు స్కైలాబ్ బాబు, ఆర్.వెంకట్రాములు, ఆశయ్య, అరుణజ్యోతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరికి వినతిపత్రం

ధర్నా అనంతరం సిపిఐ(ఎం), ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న 5 వేలకు పైగా ఆదివాసీ కుటుంబాలకు ఎస్‌టి ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. వారి గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అటవీ అధికారుల దాడులు, కందకాల తవ్వకాలు నిలిపివేయాలని, ఎస్ఐఆర్‌లో సరైన పత్రాలు లేవనే కారణంతో సుమారు 2 వేల మంది ఆదివాసీల ఓట్లను తొలగించకుండా వారి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



ట్రైనీ డిఎస్‌పిలు ఫెయిల్ కావడంపై
తక్షణమే స్వతంత్ర విచారణ

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : గ్రూప్‌–1 పరీక్షల ద్వారా ఎంపికైన దాదాపు 35 శాతం మంది ట్రైనీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్పీ)లు ఫెయిల్ కావడం తక్షణమే స్వతంత్ర, కాలపరిమితితో కూడిన న్యాయ విచారణ చేపట్టాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దాసోజు శ్రవణ్ నేతృత్వంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయకులు తుంగ బాలు, సతీష్ ఉపేంద్ర,కొడంగల్ రవికుమార్ తదితరుల బృందం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ గ్రూప్‌–1 పరీక్షల ద్వారా ఎంపికైన 112 మంది ట్రైనీ డిఎస్పీలలో 40 మందికిపైగా అధికారులు టిజిపిఎ ఫెయిలయ్యారన్నారు. 10 సబ్జెక్టులలో 1600 మార్కులకు గాను 10 నెలల పాటు శిక్షణ పొందిన తర్వాత కేవలం 50 శాతం ఉత్తీర్ణత మార్కులను కూడా సాధించలేకపోయారన్నారు. 35 శాతం మంది ఫెయిలవ్వడం అభ్యర్థుల అసలు సామర్థ్యాన్నే ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. బలహీనమైన బోధన, జాయింట్ డైరెక్టర్ వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉండటం లేదా?, వివాదాస్పద పోస్టింగ్‌ల కారణంగా టిజిపిఎస్‌సి అకాడమీ శిక్షణలో విఫలమవ్వడం, ఎంపిక ప్రక్రియలో మార్కులు, ర్యాంకులు లేదా మూల్యాంకనంలో అక్రమాలు జరగడం లాంటి ఏదైనా కారణాలు ఉంటాయని దాసోజు తెలిపారు.

13న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత కౌన్సిల్ సమావేశం

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర విస్తృత కౌన్సిల్ సమావేశం ఈ నెల 13న శుక్రవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహదూర్ గౌర్ హాల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ, బికెఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు హాజరవుతారని పేర్కొన్నారు. 2027 జనవరి మొదటి వారంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో, అంతకుముందు జిల్లా మహాసభలు నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర సమితి సభ్యులందరూ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆర్‌టిసి బస్‌స్టేషన్లకు 'మోడల్' హంగులు

రోజుకు 5 వేలకుపైగా రద్దీ ఉండే 86 బస్‌స్టేషన్ల ఎంపిక



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: ప్రయాణికులకు మరింత మెరుగైన, సురక్షితమైన సేవలు అందించేందుకు టిజిఎస్‌ఆర్‌టిసి చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 5 వేలకుపైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 ప్రధాన బస్‌స్టేషన్లను గుర్తించి, వాటిని ఆధునిక సౌకర్యాలతో మోడల్ బస్‌స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రారంభించింది. ఇప్పటికే ఈ 86 బస్‌స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు కంట్రోలర్లను నియమించడంతోపాటు విచారణ కేంద్రాలు, సంప్రదింపు నంబర్లను ఏర్పాటు చేశారు. బస్సుల రాకపోకలు, సమయాల వివరాలను తెలిపేందుకు కొత్త టైమ్‌టేబుల్ బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. తొలి, చివరి బస్సుల సమయాలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్(పిఎఎస్)ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల భద్రత, రద్దీ నియంత్రణ, బస్‌స్టేషన్ల కార్యకలాపాల పర్యవేక్షణ కోసం త్వరలో రాష్ట్రంలోని అన్ని బస్‌స్టేషన్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిని ప్రాంతీయ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసి కేంద్రీకృత పర్యవేక్షణ చేపట్టనున్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ లక్ష్యమని టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డి తెలిపారు.

గ్రేటర్ వరంగల్‌లో ఇందిరమ్మ టవర్స్

ప్రజాపక్షం/హనుమకొండ



- హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెరో 480 యూనిట్లు
- జి+5 అంతస్తులతో ఇందిరమ్మ అపార్ట్‌మెంట్లు..
- అర్హుల ఎంపికకు డిమాండ్ సర్వే.. లాటరీ పద్ధతిలో కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ కార్యదర్శి విపి గౌతమ్

గ్రేటర్ వరంగల్ నగరంలో సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మాదిరిగా పట్టణ ప్రాంతాల్లో గృహ వసతి కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంలో గ్రేటర్ వరంగల్‌కు కూడా 960 ఇళ్లను కేటాయించింది. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెరో 480 ఇళ్ల చొప్పున మంజూరు చేసింది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి (ఎఫ్ఎసి) విపి గౌతం జిఒ ఆర్‌టి నెంబర్ 579 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. బహుళ అంతస్తుల భవనాల్లో ఫ్లాట్ల నిర్మాణం చేపట్టి అర్హులైన కుటుంబాలకు అందించనున్నారు.నగరాల్లో పెరుగుతున్న జనాభా, ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని జి+5 విధానంలో అపార్ట్‌మెంట్ బ్లాకులు నిర్మించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ పాటు ఐదు అంతస్తుల్లో ఫ్లాట్లు అందు బాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం ప్రభుత్వ భూములను గుర్తించి నిర్మాణాలకు అనువైన స్థలాలను ఎంపిక చేయనున్నారు. వరంగల్, హనుమకొండతో పాటు నిజామాబాద్, నల్లగొండ, మహబూబ్ నగర్ పట్టణాలకూ ఈ పథకాన్ని విస్తరించారు. కాగా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద ఒక్కో యూనిట్ కు రూ.8.50 లక్షల వ్యయాన్ని అంచనా వేశారు. ఇందులో అర్హులైన ఈడబ్ల్యూఎస్, ఎన్ఐజీ కుటుంబాలకు ఒక్కో ఇంటిపై రూ.5 లక్షల సబ్సిడీ అందించనున్నారు. లబ్ధిదారుల వాటా కింద గరిష్టంగా రూ.3.50 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు వసూలు చేసేందుకు అనుమతిచ్చారు. ఈ మొత్తంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి అర్హులకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

భూముల గుర్తింపుపై కసరత్తు

ఇళ్ల కేటాయింపునకు ముందుగా నగరం, ప్రాంతాల వారీగా డిమాండ్ సర్వే నిర్వహించనున్నారు.తెలంగాణ హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ లు జారీ చేసి దరఖాస్తులను స్వీకరిస్తుంది. అర్హతలను పరిశీలించి, క్షేత్రస్థాయి తనిఖీల అనంతరం లాటరీ విధానంలో అర్హులను ఎంపిక చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ, అర్హతల నిబంధనలు, ఎంపిక ప్రక్రియపై తదుపరి మార్గదర్శకాలు వెలువడనున్నాయి. కాగా, టవర్ల నిర్మాణానికి అవసరమైన భూములు గుర్తించి హౌసింగ్ బోర్డుకు అప్పగించే బాధ్యతను సంబంధిత కలెక్టర్లకు అప్పగించారు. మున్సిపల్, ప్లానింగ్ అధికారులు భూముల ఎంపిక, నిర్మాణ అనుమతులు, ఇతర చట్టపరమైన ప్రక్రియల్లో సహ కరించాలని ప్రభుత్వం సూచించింది. స్థలాల గుర్తింపు పూర్తయితేనే నిర్మాణాలకు మార్గం సుగమం కానుంది.

పేద కుటుంబాలలో చిగురిస్తున్న ఆశలు

గ్రేటర్ వరంగల్ లో 960 ఇళ్ల కేటాయింపుతో సొంతిల్లు లేని పేద కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ఎక్కడ నిర్మిస్తారు? ఎప్పుడు పనులు ప్రారంభిస్తారు? దరఖాస్తు లు ఎప్పుడు స్వీకరిస్తారు? అర్హతల ప్రాతిపదిక ఏంటి? అన్న ప్రశ్నలు నగరవాసుల్లో నెలకొన్నాయి. కేటాయింపునకు అనుగుణంగా భూముల గుర్తింపు, నిర్మాణాలు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.మొత్తానికి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మినహా ఇప్పటి వరకు ఎక్కడా నిర్మించని ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను గ్రేటర్ వరంగల్ లో చేపట్టడానికి నిర్ణయించడం పట్ల పేద ప్రజలలో హర్షం వ్యక్తం అవుతున్నది.



'ఇందిరమ్మ బీమా'తో కోటి మందికి బీమా

● కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

ప్రజాపక్షం/సిద్దిపేట : ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేటలో పర్యటించి ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తారని ఈ పథకం ద్వారా 1 కోటి మందికి 5 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కలుగుతుందని అన్నారు. జిల్లాలో నూతనంగా 15 వేల కొత్త రేషన్ కార్డ్‌లను ఇచ్చామని, 45 వేలమందికి అదనంగా లబ్ది జరిగిందని తెలిపారు. కరోనా సమయంలో సహకరించినట్టుగానే ఎల్ నినో సమయంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలను కోరారు. మంగళవారం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, కలెక్టర్ కె హైమావతితో కలిసి సిద్దిపేట పట్టణంలోని వివిధ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కొండ భూదేవి గార్డెన్స్‌లో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట మున్సిపాలిటీ, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 1121 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలందరికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును ప్రభుత్వం అందిస్తుందని ఈ స్కీం ద్వారా ఒక్కొక్క లబ్ధిదారులు నెలకు 1200 రూపాయలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రానున్న రోజులలో మంచినీటికి కొరత ఏర్పడుద్ది కాబట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించడంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నీటిని పొదుపుగా వాడాలని ఇప్పుడు జాగ్రత్త పడకపోతే మే, జూన్ మాసాలలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తుతుందని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువచ్చిందని ఈ పథకాలను ఉపయోగించుకొని ప్రతి ఒక్క పేద కుటుంబం పొందాలని సూచించారు.



సాగుకు నాణ్యమైన విద్యుత్ కాంగ్రెస్ ధ్యేయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రజాపక్షం/చిట్యాల : తెలంగాణ రాష్ట్రంలో సాగు కోసం రైతాంగానికి నాణ్యమైన విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడు తూ గతంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యుత్ కోతలు ఉన్నాయంటూ ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం రైతులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ద్వారా చిట్యాల మండలంలోని పలు గ్రామాల చెరువులను నీటితో నింపినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పందరిగీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పోకల దేవదాసు, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా కొండమల్లేపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ మండల కమిటి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే పంటలు నష్టపోయిన రైతులు అప్పుల భారంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లేపల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కరువు దృష్ట్యా చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు 14 రకాల నిత్యావసరాలను సరఫరా చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు వరి పంటకు ఎకరానికి రూ. 30వేలు, పత్తి పంటలకు ఎకరానికి రూ. 50వేలు మిర్చి పంటకు ఎకరానికి రూ. 50వేలు, ఇతర పంటలకు ఎకరానికి రూ. 20వేల చొప్పున చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు పన్నాల శ్రీను, పట్టణ కార్యదర్శి సోమ్లా, దొడ్డి మధు, కల్లు చర బోరెడ్డి, ధర్మయ్య, వీరస్వామి, ఇద్దయ్య, ఆశయ్య, లచ్చు, సోమ్లా, మంగ్త, వాసు, రాము, దాసు తదితరులు పాల్గొన్నారు.

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



ప్రజాపక్షం/హాలియా: రబీలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పులిమామిడి,నారాయణపురం గ్రామాలలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతు ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరి స్థితుల దృష్ట్యా సాగు నీటి లభ్యత దొరికే అవకాశాలు కష్టంగా మారినట్లు చెప్పారు. ఎల్ నినో ప్రభావం భూగర్భ జలాలపై పడిందని దీనివలన సాగు నీరు మరింత ఇబ్బందిగా మారుతున్న తరుణంలో రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేయాలని సూచించారు.ఆరుతడి పంటలైన మినుము,జొన్న,కంది తదితర ఆర్తడి పంటలు సాగు చేసుకోవా లని తెలిపారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకొని రైతుకి ఉపయోగపడే పంటలని సాగు చేయాలన్నారు.జిల్లా కలెక్టర్ చెప్పిన విషయాలను గ్రహిం చిన రైతులు సానుకూలంగా స్పందించారు.ఈకార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి వినోద్ కుమార్,జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశే ఖర్,సర్పంచ్ మాలె అరుణ,డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత,మండల ఏవో వెంకన్న,ప్రవీణ్,విగ్నేశ్వర్ రెడ్డి, ఏపీయం లక్ష్మీనారా యణ తదితరులు పాల్గొన్నారు.

రూ.11.50 కోట్లతో నూతన భవన నిర్మాణానికి కృషి

ప్రజాపక్షం/కోదాడ: పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్వహిం చిన పశువైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ప్రారంభించారు.



అనంతరం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ బోడేపూడి శ్రీని వాసరావు, స్థానిక కౌన్సిలర్ కారింగుల ఉమ అంజన్‌గౌడ్ తో కలిసి రైతుల అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లా డుతూ పశువైద్యశాల భవనం శిధిలావస్థకు చేరడంతో వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో రూ.1.50 కోట్ల నిధులు సమకూర్చి ల్యాబ్, ఎక్సరే, స్కానింగ్ ఆపరేషన్ థియేటర్ల రైతుల విశ్రాంతి హాళ్లతో కూడిన విశాలమైన ఆధునిక వైద్యశాల భవన నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువైద్య శిబి రంలో 62 ఆవులు, గేదెలకు, 1138 గొర్రెలు, మేకలు, 140 కుక్కలు, కోళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, పశువై ద్యాధికారులు కొండేటి వీరారెడ్డి, డాక్టర్ విజయ, మధు, సిరిపురపు సురేంద్ర, కొండా సాయికృష్ణ, చంద్రకళ పాల్గొన్నారు.

వరికి రూ.30వేలు, పత్తికి 50వేలు
నష్టపరిహారం చెల్లించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్

నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి



ప్రజాపక్షం/చండూరు: ఎల్ నినో కరువు పరిస్థి తులను జాతీయ విపత్తుగా పరిగణించి తక్ష ణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ప్రజలు , రైతుల సమస్యలను పరిష్కరిం చాలని,కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చండూరు తహ సీల్దార్ కార్యాలయం ముందు భారత కమ్యూ నిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ధర్నా కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని, గ్రామాలలో సాగునీరు, త్రాగునీరు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని అన్నారు. రైతులపై ఉన్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని ,రుణాలపై వడ్డీని పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు నష్టపోయిన రైతు లకు ఎకరం 50వేల చొప్పున పత్తి పంటకు ,వరి పంటకు 30వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటిం చాలని అన్నారు. ఉపాధి హామీ పథకం పని దినాలను 200 రోజులకు పెంచాలని కరువు కోరల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సాగునీరు లేక ఏడారి ప్రాంతంగా ఉన్న మును గోడు నియోజకవర్గానికి సాగు నీరు అందించే డింది ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి మును గోడు ప్రాంత రైతులకు సాగునీరు అందించా లని ప్రభుత్వాని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ , రైతు సంఘాల ఆధ్వ ర్యంలో ఉద్యమాలు ,పోరాటాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లరాజు రామలిం గయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్ల రాజు సతీష్ కుమార్ , సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య , బొడ్డు వెంటకే శ్వర్లు , కార్యవర్గ సభ్యుడు మండల పార్టీ కార్య వర్గ సభ్యుడు బరిగెల వెంకటేష్ , దోటి వెంకన్న, బండమీది వెంకన్న, జెల్ల శ్రీను సిహెచ్ ఊషయ్య, గంట రమేష్ , ఇరిగి సంజీవ,ఏఐవై ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం నవీన్ కన్తాల సర్పంచ్ లేదన్న సత్యం, కురుపాటి పరమేష్ , గంట నగేష్,పల్లె శంకరయ్య పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ: ఎల్‌నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతు లకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం సిపిఐ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు దేవరకొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి హాజరైన పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వేసిన పంటలు ఎండిపోయాయని వ్యవసాయ విస్తరణ అధికారులు పంటలు ఎండిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులను ఆదుకోవాలని అన్నారు. వరికి రూ. 40వేలు, పత్తికి రూ. 50వేలు నష్టప రిహారం చెల్లించాలని పశువులకు పశుగ్రాసం సరఫరా చేయాలని, కౌలు రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరు కులు, సరఫరా చేయాలని గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా నివా రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్యాక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, రంగారెడ్డి, వెంకట్రాములు, రాంరెడ్డి, యాదయ్య, మల్లయ్య, భారీములు, పర్వతాలు, రామకృష్ణ, గోపర్ధన్, అంజయ్య, పుల్లయ్య, శ్రీను పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలి..పబ్బు వీరస్వామి

ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కనగల్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి,పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు నివారణ,సహాయక చర్యలు చేపట్టా లని కోరుతూ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో కనగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఈ ధర్నాలో సిపిఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,లెనిన్ రాము లు, నరసింహ,దోటి అక్కలయ్య, సురేందర్,కట్ట యాదయ్య,జోగు కృష్ణ య్య, జోగు నాగమ్మ,తల్లరి సుదర్శన్,సూరయ్య పాల్గొన్నారు.



200 రోజులు పని కల్పించాలి



జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఈనెల 26న జిల్లా కేంద్రంలోని వ్యవ సాయ కార్మిక సంఘం భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు తెలి పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం వల్ల సూర్యాపేట జిల్లాలో కరువు విలయతాండవం చేస్తుందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, కరెంటు సరఫరా చేసే పరిస్థితి లేదని ప్రభుత్వం ప్రకటించినందున చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు బ్రతుకుదెరువు దొరకకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి సంవత్సరానికి 200 రోజులు ఉపాధి పని కల్పించి రోజుకు రూ.700ల వేతనం అందిం చాలన్నారు. రేషన్ షాపుల ద్వారా ఎల్‌నినో ప్రభావం తగ్గే వరకు 14 రకాల నిత్యవసర సరుకులను సబ్సిడీపై అందించి ఆదుకోవాలని కోరారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను గృహ అవసరాల కోసం ఉచితంగా అందిస్తుందని ఆ యూనిట్లు దాటి ఒక్క యూనిట్ పెరిగినా మొత్తం యూనిట్లకు కరెంటు బిల్లు వేస్తున్నారని మండి పడ్డారు. అలాకాకుండా 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇచ్చి ఆ తరు వాత ఎన్ని యూనిట్లు పెరిగితే ఆ పెరిగిన యూనిట్ల వరకు మాత్రమే బిల్లులు వసూలు చేయాలని సూచించారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా ప్రతి మనిషికి అందిస్తున్న 6 కేజీల బియ్యంకు బదులుగా 10 కేజీల బియ్యం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రెమి దాల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నీలం నాగభద్రం, బాదె నర్సయ్య, రైతులు సంఘం జిల్లా కమిటి సభ్యులు కత్తి శ్రీనివాస రెడ్డి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా కమిటి సభ్యులు బత్తిని శ్రీనివాస గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్‌లో మహిళా హోంగార్డు దారుణహత్య..

భర్తే హంతకుడా?



ప్రజాపక్షం/నల్లగొండ : పోలీస్ క్వార్టర్స్‌లో మహిళా హోంగార్డు దారుణ హత్యకు గురైన ఘటన నల్లగొండ జిల్లాలో కలకలం రేపింది. నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా హోంగార్డు మెహబూబ్ బీ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆమె భర్త సతీష్ గొంతు నులిమి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెహ బూబ్ బీ,సతీష్ మతాంతర వివాహం చేసుకున్నట్లు సమాచారం. అయితే కొంతకాలంగా వీరిద్దరి మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఈ క్రమంలోనే భార్యా భర్తల మధ్య వివాదం హత్యకు దారితీసిందా అనే కోణం లో అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు వెంటనే పోలీస్ క్వార్టర్స్‌కు చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ దర్యాప్తు ప్రారంభిం చారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుడిగా అనుమానిస్తున్న భర్త పాత్రపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మహిళా హోం గార్డు హత్య ఘటనతో పోలీస్ వర్గాల్లోనూ స్థానికంగా నూ ఆందోళన నెలకొంది.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, హత్యకు గల అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

కరువును జాతీయ విపత్తుగా గుర్తించాలి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తీర్పారి వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర కరు వును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించి తక్షణ సహాయంగా 30వేల కోట్ల రూపాయలు అందించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తీర్పారి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం కరువు సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లా డుతూ ఎల్‌నినో కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయాలరని ఆవేధన వ్యక్తం చేశారు. కరువు శాశ్వత నివారణ కోసం డిండి ప్రాజెక్టు ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వివిధ డిమాండ్ లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ , రైతు సంఘం జిల్లా నాయకులు కంపే దుర్గయ్య , ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు నరేష్ , మండల పార్టీ సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య , యాదయ్య , లక్ష్మయ్య , కందాల ముత్యం , నర్సింహ్మ, కట్టా చెన్నయ్య , రాములు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలకు ఆర్థిక సాయం ప్రకటించాలి : బంటు వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, కరువు మండలాలకు ఎలాంటి షరతులు లేకుండా ఆర్థిక సాయం అందించా లని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి ఏ.రామలింగం, పి.ఉదయ్‌కుమార్, గిరి జన సమాఖ్య జిల్లా కార్యదర్శి డి.లింగనాయక్, మహిళా సమాఖ్య నాయకు రాలు డి.దుర్గమ్మ, డి.శాంతి, ఈ.ప్రమీల, జమ్ముల కోటయ్య, ఎస్.కె.రహీం, మర్రి తిరుపతయ్య, కట్ట యుద్ధయ్య, గువ్వల మట్టయ్య, ఎస్.రాములు, నరేష్, పి.లక్ష్మ య్య, సైదులు, లక్ష్మ మ్మ, కోటేష్, సీహెచ్.రాములు, భిక్షం, స్వామి, గురువయ్య పాల్గొన్నారు.





రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ప్రజాపక్షం/మోటకొండూర్: రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన మంగళవారం మోటకొం డూరు మండలంలోని కాటేపల్లి, చాడ, కొండాపూర్, ముత్తి రెడ్డిగూడెం గ్రామాల్లో ఐకేపీ, పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిదాన్యం కొను గోలు కేంద్రాలను ప్రారంభించారు. కొండాపూర్ లో నూతనంగా నిర్మిం చిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను, వాటర్ ప్లాంట్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో మొదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు ఎల్లెంల సంజీవరెడ్డి, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి, వంగపల్లి పిఏసిఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సిపిఐ నాయకుల ఫిర్యాదుపై కదిలిన అధికార యంత్రాంగం..

తోపుగాని చెరువు నాలా ఆక్రమణలపై అధికారుల క్షేత్రస్థాయి విచారణ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని న్యూ గుండ్లపల్లి గ్రామంలో ఉన్న చారిత్రక తోపుగాని చెరువు నాలా కబ్జాలకు గురికా కుండా తక్షణమే పరిరక్షించాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలి సిందే. ఈ ఫిర్యాదుపై స్పందించిన సంబంధిత శాఖల అధికారులు మంగళ వారం నాలా ప్రాంతానికి చేరుకుని క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేప ట్టారు.ఈ విచారణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ శాఖ డివిజ నల్ ఇంజనీర్ (డీఈ), ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్, రెవెన్యూ శాఖ ఆర్ఐ, జీపీఓతో పాటు ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. నాలాను క్షుణ్ణంగా పరి శీలించిన అధికారులు, స్థానిక పరిస్థితులపై వివరాలను సేకరించారు. ఈ సంద ర్భంగా తోపుగాని చెరువు నాలాను ఆక్రమణదారుల చెర నుంచి కాపాడి, పూర్తి స్థాయిలో పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ నాయకులు గట్టిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెరబోయిన మహేందర్, రైతు సంఘం జిల్లా కోశాధికారి పెరబోయిన బంగారు, గోపగని రాజు, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి ముక్కెర్ల పెంటయ్య, పల్లెపాటి ఆంజనేయులు, తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో క్రైస్తవ యువ తులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని క్రైస్తవ అసోసియేషన్ అధ్యక్షలు కన్నాదేవిడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సియాన్ యూత్,నల్లగొండ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడటం అమానవీయమని,ఇలాంటి ఘటనలు సమాజానికి సిగ్గుచేటని ఆవే దన వ్యక్తం చేశారు.బాధిత మహిళలకు తక్షణ న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో మత స్వేచ్ఛను కాపాడటంతోపాటు మహిళల భద్రత,మానవ హక్కు లను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, బాధితులకు న్యాయం చేయాలని,క్రైస్తవులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కట్టా మోజేస్,సమర్పణ్ కుమార్,జాన్ బాబు,ఐజాక్ రాము సాంబశివరావు,మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు తీగల జన్ శాస్త్రీ,సియాన్ యాత్ నాయకులు ప్రేమ్ కుమార్,రోషన్,సాగర్ జాన్,స్టీఫన్ పాల్, సాయి రాజ్ పాల్గొన్నారు.



12
ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
11-11-2026
www.prajapaksham.in











కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి..

కలెక్టరేట్ల ఎదుట సిపిఐ ధర్నాలు

జిల్లాల నుంచి ప్రజాపక్షం విలేకరులు

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని, కరీంనగర్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కరువు నివారణ చర్యలను తక్షణమే చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు ముందు కలెక్టరేట్ వరకు సిపిఐ నేతలు ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్,గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, చొక్కుల శ్రీశైలం, గోవిందుల రవి, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, లంక దాసరి కళ్యాణ్, చాడ శ్రీధర్‌రెడ్డి, పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠరెడ్డి, బీర్ల పద్మ, బోయిని వల్ల భాయ్ పటేల్, బామండ్లపెల్లి యుగేందర్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, నలువాల సదానందం, కొట్టె అంజలి, తేరాల సత్యనారాయణ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు నునావత్ శ్రీనివాస్, పోలోజు రంజిత్, రైతు సంఘం చిగురుమామిడి మండల అధ్యక్ష, కార్యదర్శులు గోలి బాపురెడ్డి, కోమటిరెడ్డి జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కరువు పరిస్థితులలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ఖమ్మం జిల్లాను పూర్తి కరువు జిల్లాగా ప్రకటించాలని రైతులు, వ్యవసాయకార్మికులను ఆదుకునేందుకు తక్షణం ఆర్థికసాయం అందించాలని, రైతు రుణాల వడ్డీ మాఫీ చేయాలని, మురసు తుఫాన్ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె జాని మియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవింద రావు, సిద్దినేని కర్ణకుమార్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహలక్ష్మి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, బెజవాడ రవి, మందడపు రాణి, ఏనుగు గాంధీ, కూచిపూడి రవి, యానాలి సాంబశివారెడ్డి, యంగల ఆనందరావు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

కరువు పరిస్థితులతో పంట నష్టపోయి న రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నల్లగొండ జిల్లా మునుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుర్రిజ రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోల్గూరి నరసింహా, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు సురిగి చలపతి, బి.లాలు, చల్లెడ సర్పంచ్ బండమీది యాదయ్య, గోస్కొండ లింగయ్య, మందుల పాండు, ఈదులకంటి కైలాస్, ఉప్పునూతల రమేష్, వెంకన్న, ఉదయ్ కుమార్, కట్ట దశరథ్, టి.కృష్ణయ్య పాల్గొన్నారు. ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీని ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో కరువు పరిస్థితులపై సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో 'చలో కలెక్టరేట్' నిర్వహించి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిపిఐ ఆదిలాబాద్ జిల్లాకన్వీనర్ ఎస్.విలాస్, నాయకు లు ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కట్టా చంద్రమౌళి, కట్టా కిష్టయ్య, బి.గోవర్ధన్, సిర్రా దేవేందర్, కె.గంగయ్య, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు మేస్రం భాస్కర్, గేడం కేశవ్, ఎండి. ఫయాజ్, సంగీత, జాడే నామ్దేవ్, పూజ, ఎండి.పాషా, అర్ధాంగి రమేష్, కుంటాల రాములు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వివిఎన్ బోస్ డిమాండ్ చేశారు. సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డిజి సాయిలుగౌడ్, ఏసు రత్నం, కె.ధర్మేంద్ర, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి అన్వర్, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, నాయకులు లక్ష్మి, రచ్చ కిషన్, కృష్ణ, సత్యప్రసాద్, వి.శ్రీనివాస్, నిమ్మల నర్సింలు, మాధవి, నరేంద్రప్రసాద్, అమరావతిబాబు, యాదగిరి, దశరథ్, రాములుగౌడ్, ప్రమీల పాల్గొన్నారు.

కరువుపై కేంద్రానికి పంపిన నివేదికను బహిర్గతం చేయాలని క్షేత్రస్థాయిలో ఎండిన పంటలను సర్వే చేసి నష్టాన్ని నమోదు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, కార్మికులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేసి పశ్య పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, స్వరూపరాణి, అలీ ఇమ్రాన్, ఫిరోజ్, హన్మాండ్లు, రఘురాం, రంజిత్, కుశాల్, కిషోర్, కవిత, స్వరూప పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి ర్యాలీగా వెళ్లి వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వైవి.గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రైతు సంఘం జిల్లాకార్యదర్శి చుక్క మొగిలి, నాయకులు పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, గన్నారపు రమేష్, సంగీ ఏలేందర్, అక్కపెల్లి రమేష్, కందిక చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, నెట్టం నారాయణ, తాళ్లపల్లి జాన్‌పాల్, ఎండి అక్బర్‌పాషా, జన్ను రవి, పరికిరాల రమేష్, ల్యాదెళ్ల శరత్, పార్థసారథి, సాంబమూర్తి, సుధీర్, యాకాంబ్రచారి పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్లావుల రాములు, ఉప్పెల నారాయణరెడ్డి, దూళిపాల ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, ఎస్‌కె లతీఫ్, ఎస్‌కె సాయిబెల్లి, అనంతుల మల్లేశ్వరి, కొప్పోజు సూర్యనారాయణ, జడ శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, ఎడెల్లి శ్రీకాంత్, గుగులోతు రాజారాం, మండల కార్యదర్శులు ఎర్రసాని రవి, కడియాల అప్పయ్య, చింతిర్యాల రవి పాల్గొన్నారు.

కరువు పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, బొల్లం పూర్ణిమ, ఇప్పకాయల లింగయ్య, కలిందర్ అలీ ఖాన్, కారుకూరి నగేష్, లింగం రవి, దాగం మల్లేష్, మిట్టపల్లి శ్రీనివాస్, రేగుంట చంద్రకళ, చిప్ప నర్సయ్య, మండల కార్యదర్శులు కొండు బానేష్, బొంతల లక్ష్మి నారాయణ, వనం సత్యనారాయణ పాల్గొన్నారు. రైతులను ఆదుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, జిల్లా సహాయ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి, సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సారిక శ్రీను, తండ సందీప్, బానోతు లింగయ్య, జంపాల వెంకన్న, వరి పల్లి వెంకన్న, మైస స్వామి, బనెల్లూరు నాగేశ్వరావు, మేక వీరన్న, సాంబలక్ష్మి, యాకమ్మ, హలీమా, వెంకటమ్మ, సరిత, వీరమ్మ పాల్గొన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో పంటలు సాగు చేసి నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో దయానందరెడ్డి, కొమ్ముల భాస్కర్, యెడల వనేశ్, జేరిపోతుల జనార్దన్, పిల్లి రజిని, శివలింగు కృష్ణ, పిట్ల మల్లేశం, కర్ణాల చంద్రం, మాచర్ల శ్రీనివాస్, సుదర్శన చారి, ముంజ గోపి, పట్టణ కార్యదర్శి బన్సీలాల్, ఎస్‌కె.హారీఫ్,బర్మా ఐలయ్య పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తక్షణమే మహబూబ్ నగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాల సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, నాయకులు గోవర్ధన్, కొండపల్లి రాముడు, పి.నురేష్, కె.పద్మావతి, మెట్టు మహేష్, జి.సత్యనారాయణరెడ్డి, హన్వాడ మండల కార్యదర్శి శంకర్ నాయక్, మేడ ముని ఆంజనేయులు, ఇందిరక్క, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సుంకరి బసవరాజ్, సుందరాజు, సంజు నాయక్, అంజమ్మ, గుడ్ భాషా పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వనపర్తి జిల్లా కలెక్టర్ ఎదుట జిల్లాలో కరువు సహాయక చర్యలను చేపట్టాలని ధర్నా చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు, పట్టణ కార్యదర్శి రమేష్ కళావతమ్మ, రమేష్, మోష, రాబర్ట్, భాస్కర్, గోపాలకృష్ణ , రవీందర్, పృథ్వినాదం, కుతుబ్, సంతోష్, కాకం బాలస్వామి, మల్లెపు బాలస్వామి, బాలరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కడారి రాములు, గుంటి వేణు, తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, దుండ్రపల్లి రవీందర్, నారాయణ పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, కె.రామస్వామి, ముత్యాల యాదిరెడ్డి, ఎం.డి. పైముద్దీన్, బుద్దుల జంగయ్య, టి.రామకృష్ణ, సామిడి శేఖర్‌రెడ్డి, ఎం.ప్రభులింగం, పల్నాటి యాదయ్య, ఆర్.యాదగిరి, వడ్ల సత్యనారాయణ, నీలమ్మ, పి.శివకుమార్, దత్తు నాయక్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

























దద్దరిల్లిన కలెక్టరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను సమగ్రంగా గుర్తించాలని స్పష్టం చేశారు. ఇంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సహాయక అంచనా బృందాలను గ్రామాల్లోకి పర్యటనకు పంపలేదని విమర్శించారు. గ్రామస్థాయిల్లో పరిశీలించకుండా ఊహాజనిత నష్టాన్ని అంచనా వేసి నిధులు డిమాండ్ చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం కేంద్రం నుండి రూ.25వేల కోట్లను అడగడం అశాస్త్రీయమని క్షేత్రస్థాయిలో నష్టం అంతకంటే ఎక్కువగానే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి బృందాలు రాష్ట్రంలో పర్యటించి శాస్త్రీయంగా నష్టాన్ని లెక్కించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కేవలం 364 మండలాలకే పరిమితం చేయకుండా తెలంగాణ మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు. కరువు తీవ్రత వల్ల అసలు పంటలే వేయలేకపోయిన రైతులకు కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని లేకపోతే తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఉద్ఘాటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తాన్ని తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వం కరువు మండలాలుగా కేవలం 16 మండలాలనే గుర్తించి చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. వర్షాభావంతో అల్లాడుతున్న టేకులపల్లి, పాల్వంచ, భద్రాచలం, జూలూరుపాడు, సూజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లెందు మండలాలను కరువు మండలా ల జాబితాలో చేర్చాలని కోరారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ మేయర్ మూడ గణేష్, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్‌డి సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, ఫహీమ్ పాల్గొన్నారు.

రూ. 25వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి : ఇటి

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడటంతో రైతాంగం, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఇటి నరసింహా డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లాకు జీవనాధారంగా ఉన్న సింగూరు ప్రాజెక్టు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయించి జలవనరుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరస్పర సమన్వయంతో శాశ్వత పరిషారం చూపాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులతో రైతులు, పేద కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.25 వేల కోట్ల ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెర్ల కంటి శ్రీకాంత్, ప్రకాశ్‌రావు, రెహమాన్, కె.నర్సింహులు, సయ్యద్ తాజుద్దీన్, షఫి అహ్మద్, శంకర్, తిలక్, వరలత, బిపాషా, రజీయా బేగం, సాదకలి, ముస్తాఫా, పూలమ్మ, కీర్తి, గడ్డం కిరణ్ కుమార్, వెంకట్ పాల్గొన్నారు





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com